
# ఆంధ్ర ప్రదేశ్

మార్చి 1972

50 పైసలు



# ఆంధ్రప్రదేశ్


సంపుటి : 16 | మార్చి, 1972 | సంచిక : 5

ఫాల్గుణం 1893 – చైత్రం, 1894


ప్రధాన సంపాదకులు :
పెండ్యాల వామనరావు

సంపాదకులు
కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

## సంచికలో

ముఖ చిత్రం : ఆశావల్లరి
చిత్రకారుడు: ఎం. ఎ. రహీం

రెండవ అట్ట :
ఫిబ్రవరి 3న ప్రధాని తిరుపతి వద్ద కల్యాణి రిజర్వాయరుకు ప్రారంభోత్సవం చేసిన అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తున్న దృశ్యం

నాల్గవ అట్ట :
విశాఖపట్నంలో తయారైన నావికా శిక్షణ నౌక 'రాజేంద్ర'

వెల : 50 పైసలు

రిజిష్టరు నెం : 133

పేజీ

# రాష్ట్ర ప్రగతికి రాచబాట


సాధారణ ఎన్నికలు జరిగి శ్రీ పి. వి. నరసింహారావుగారి నాయకత్వంలో నూతన మంత్రి వర్గం పదవీ స్వీకారం చేయడంతో రానున్న అయిదేళ్ళ కాలంలోనూ ప్రగతి గమనానికి మార్గం పడినట్టు అయ్యింది. కాంగ్రెసు పార్టీకి అమోఘమైన మెజారిటీ లభించడంతోపాటు శ్రీ నరసింహారావుగారు రెండవసారి ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. వీరిని, ప్రభుత్వ కార్యక్రమాలనూ, విధానాలనూ ప్రజల ఆమోదంగా మనం భావించవచ్చు. ఇంతకుముందు కొద్ది కాలం మాత్రమే శ్రీ నరసింహారావుగారు ముఖ్యమంత్రి పదవిని చేపట్టినప్పటికీ ఆ కొద్దికాలంలోనూ ఎన్నో గణనీయమైన సంఘటనలు సంభవించాయి. ప్రజలు ఎంతో విజ్ఞతతో తమ ఓటు హక్కును వినియోగించుకున్నందుకు ముఖ్యమంత్రి వారిని అభినందించడం సమంజసంగానే వుంది. రక్షణ కృషిలో ప్రజలు భాగస్వాములై పాల్గొన్నందుకు, కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో సహకరించినందుకు ఆయన ప్రజలను అభినందించారు. సమైక్యతా శక్తులు బలపడి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సుస్థిరత వ్యవస్థాపితం కావడంతో అయిదేళ్ళపాటు పటిష్ఠమైన, సుస్థిరమైన ప్రభుత్వం ఏర్పడి ప్రగతి పథంలో రాష్ట్రం పురోగమించడానికి సన్నద్ధంగా వుంది.

కొత్త మంత్రిమండలి ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ముఖ్యమంత్రి రేడియోలో ప్రసంగిస్తూ, దారిద్ర్య నిర్మూలనకూ, వెనుకబడిన తరగతుల, బలహీనవర్గాలవారి సాంఘిక, ఆర్థిక, రాజకీయ ప్రతిపత్తిని మెరుగుపరచడానికీ ప్రభుత్వం కృతనిశ్చయంతో వున్నట్లు స్పష్టం చేశారు. ఇందుకు రాష్ట్ర మంత్రిమండలిలోని సభ్యుల నియామకమే ఒక దృష్టాంతం అన్నారు. భాషాపరంగానూ, మతపరంగానూ అల్పసంఖ్యాక వర్గాలవారి విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందనీ, వారి అభివృద్ధికి సంబంధించిగాని, బోధనాభాషకు సంబంధించిగాని, రాష్ట్రంలో వారి స్థితిగతులకు సంబంధించిగాని లోగడ వారికున్న ప్రత్యేక సౌకర్యాలు యిప్పుడుకూడా కొనసాగింపబడతాయనీ ముఖ్యమంత్రి హామీ యిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ఎప్పుడూ సంకుచిత ఆలోచనలకు దూరంగా, సార్వజనీక, ప్రగతి దృక్పథంగల రాష్ట్రంగా గణుతి కెక్కిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

శ్రీ నరసింహారావుగారు ఉర్దూను గురించి ప్రత్యేకించి పేర్కొన్నారు. ఉర్దూకు రాష్ట్రంలో సముచిత స్థానం వున్నదని పేర్కొంటూ, యికముందుకూడా యిది కొనసాగగలదని ఆయన హామీ యిచ్చారు. నిరుద్యోగాన్ని నిర్మూలించడానికీ నిష్పక్షపాత వైఖరితో రాష్ట్రంలో మరిన్ని పరిశ్రమలను నెలకొల్పడానికీ ఒక నిర్ణీత కాలవ్యవధి కార్యక్రమాలను రూపొందించడం జరుగుతుందని కూడా ఆయన ప్రకటించారు. తెలంగాణాకు సంబంధించిన సమస్యలను పరిష్కరించే విషయంలో ప్రధాని ఆదేశాలను అక్షరాలా తాను పాటిస్తానని లోగడ పేర్కొన్న విషయాన్ని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. ఈ మార్గంలో అప్పుడే కొన్ని చర్యలు తీసుకోవడం జరిగిందనీ, ఈ తీసుకున్న చర్యలు తెలంగాణా ప్రాంతంలోని ప్రజల్లో నూతన విశ్వాసాన్ని నెలకొల్పాయనీ ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర శాసన సభలకు జరిగిన ఎన్నికలు అన్ని రాష్ట్రాలలోనూ సుస్థిర ప్రభుత్వాలు నెలకొనడానికి కారణమయ్యాయి. యావత్ప్రపంచ పీడిత జనావళి నాయకురాలుగా శ్రీమతి ఇందిరాగాంధీని ప్రతిష్ఠించాయి. కాంగ్రెసు పార్టీని లోగడ ఎప్పుడూ లేనంత పటిష్ఠవంతమైన పార్టీగా రూపొందించాయి. మనం నిర్దేశించుకొన్న సోషలిజం లక్ష్యాన్ని సత్వరమే సాధించడానికై బహుముఖాలుగా వున్న అనేక అంతరంగిక, బాహిర సమస్యలను ప్రధాని పరిష్కరించడంలో ఆమెకు మన మద్దతును అందించి ఆంధ్రప్రదేశ్ ప్రజలు అగ్రశ్రేణిలో నిలవాలని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రప్రదేశ్ స్వతహాగా సుస్థిరమైన రాష్ట్రం. ఇటీవల రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికలవల్ల యీ సుస్థిరత మరింత బలపడింది. నాలుగున్నర కోట్ల జనాభాతో ఒక పెద్దరాష్ట్రం కావడమేగాక, ఉత్తర-దక్షిణ భారతదేశాలకు మధ్యగా అత్యంత కీలకమైన ప్రాంతంలో వుండడం వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే ప్రథమగణ్యమైన రాష్ట్రంగా అభివృద్ధి చెందగలదు.

— పి. వి. ఆర్.



# కొత్త అధ్యాయానికి అంకురార్పణ

— పి. వి. నరసింహారావు

ఉగాది సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు రాష్ట్ర ప్రజలకు యీ దిగువ సందేశాన్నిచ్చారు.

"ఆంధ్రప్రదేశ్ ప్రజలకేగాక మరికొన్ని యితర రాష్ట్రాల ప్రజలకు కూడా ఉగాది నూతన సంవత్సర దినోత్సవం. ఇది వసంతోత్సవ పర్వదినం. భవిష్యత్తును గూర్చి ప్రజలలో కొత్త ఆశలు చిగురించే పండుగదినం. ఈ పర్వదిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు నా హృదయ పూర్వకమైన శుభాకాంక్షలు అందజేస్తున్నాను.

గత ఏడాది ఉగాదికి ముందు లోక్ సభకు జరిగిన మధ్యంతర ఎన్నికలలో ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీకి బ్రహ్మాండమైన మద్దతు లభించి కేంద్రంలో సుస్థిరమైన, పటిష్ఠవంతమైన ప్రభుత్వం ఏర్పడగా; ఈ సంవత్సరం ఉగాదికి ముందు రాష్ట్ర శాసన సభలకు జరిగిన ఇటీవలి ఎన్నికలు ప్రధాని కార్యక్రమాలకు, విధానాలకు పెద్ద ఎత్తున, మరింత మద్దతును స్పష్టంచేశాయి. ఇందువల్ల, ఓటర్లకు ప్రధాని చెప్పావచ్చినట్టు కేంద్ర విధానాలను అమలు జరుపగల సుస్థిరమైన, పటిష్ఠమైన ప్రభుత్వాలు రాష్ట్రాలలో ఏర్పడనున్నాయి. అన్ని రాష్ట్రాలలోనూ, చివరకు ప్రధాని నాయకత్వంతో పూర్తిగా ఏకీభవించని రాష్ట్రాలలో కూడ ప్రధానికి అఖండమైన విజయం లభించడం చాలా అపూర్వమైన విషయంగా పేర్కొనవచ్చు. మన ప్రజాస్వామ్య పరిణామంలో యిదొక మైలురాయి. దేశమంతటా ఎలాటి ఒడుదుడుకులు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరగడం చూస్తే దేశంలో ప్రజాస్వామ్యం బాగా నిలిచిందనీ, ప్రజలు స్వేచ్ఛగా ఉండవంటి ప్రతిబంధకాలు లేకుండా తమ నిర్ణయాన్ని ప్రకటించడంలో సమర్థులేనన్న మన దృఢ విశ్వాసం అక్షరాలా యథార్థమని నిరూపితమైంది.

రాష్ట్ర చరిత్రలోనే అపూర్వమనదగినంతగా పెద్ద ఎత్తున అధికార పార్టీని గెలిపించినందుకు నేను ఆంధ్రప్రదేశ్ ప్రజలను అభినందిస్తున్నాను. ప్రగతి దృక్పథంతో సుస్థిరమైన, పటిష్ఠమైన రాష్ట్రంగా ప్రతిష్ఠించినందుకు నా హృదయపూర్వకమైన కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. కొత్త శాసన సభ్యుల జాబితాను పరిశీలిస్తే లోగడ ఎప్పుడూ లేనంతగా బలహీన వర్గాల, వెనుకబడిన తరగతులవారి విషయంలో మరింత న్యాయం చేకూర్చిన విషయం స్పష్టమవుతుంది. దీనినిబట్టి అధికారపార్టీ 'గరీబీ హఠావో' కార్యక్రమాన్ని యితోధిక ఉత్సాహంతో అమలుపరచడానికి సంకల్పించిందన్న సత్యం ద్యోతకమవుతుంది. రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సమైక్యతా శక్తులను పటిష్ఠం చేయడంలో నూతన అధ్యాయానికి అంకురార్పణ చేశాయి.

ఇప్పుడు రాష్ట్రం సర్వతోముఖ ప్రగతికి సమాయత్తం చేయబడింది. దేశపురోభివృద్ధి కృషిలోను, సమైక్యత, సెక్యులరిజం సోషలిజం, శక్తులను పటిష్ఠం చేసే కృషిలోను ఆంధ్రప్రదేశ్ తన పాత్రను నిర్వహిస్తుంది.

గత ఏడాది యీ దేశానికి ఒక మరపురాని అపూర్వమైన సంవత్సరం. అప్పుడు యీ దేశం ఒక చరిత్రనే సృష్టించింది. బంగ్లాదేశ్‌కు విముక్తి కలిగించడం ప్రపంచంలోని ప్రజాస్వామిక శక్తులను పటిష్ఠంచేసే కృషిలో ఒక సువర్ణాధ్యాయం ఏక పక్షంగా యుద్ధాన్ని విరమించడం, పాకిస్తాన్ బలవంతంగా మనపై రుద్దిన సుమారు కోటిమంది శరణార్థులను తిరిగి వారి స్వస్థలాలకు పంపడం, బంగ్లాదేశ్ నుండి భారత సేనల ఉపసంహరణ—యివన్నీ ప్రపంచం దృష్టిలో భారత దేశ కీర్తి ప్రతిష్ఠల్నీ, నైతిక వ్యక్తిత్వాన్నీ సమున్నతం చేశాయి. ఈ అపూర్వ విజయాలన్నిటికీ కారణం శ్రీమతి ఇందిరాగాంధీ ఉత్తేజకరమైన నాయకత్వమే. ఆమె భారత దేశానికి విజయపథంపను సిద్ధంచేసింది. యీపట ద్వేషానికి ఆమె నాయకత్వం లభించడం భారత దేశ మహాద్భాగ్యం. శీఘ్రంగా సోషలిస్టు సమాజాన్ని నెలకొల్పడంలోను ప్రపంచంలో శాంతి సద్భావనలను పెంపొందించడంలోను ఆమెకు అండగా నిలబడిన ప్రజలు ఎంతగానో ప్రశంసాపాత్రులు.

ఈ శుభసమయంలో రాష్ట్ర ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షల్ని అందజేస్తున్నాను."

# ఆంధ్రప్రదేశ్ కొత్త మంత్రి మండలి

ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు మార్చి 2[illegible] వతేదీన శాసనసభలో మంత్రిమండలి సభ్యులకు శాఖలు కేటాయిస్తూ ప్రకటన చేశారు. మంత్రుల శాఖలు ఈ దిగువ పేర్కొనబడినవి.

## కేబినెట్ మంత్రులు

| | |
|---|---|
| శ్రీ పి. వి. నరసింహారావు<br>ముఖ్యమంత్రి | సాధారణ పరిపాలన శాఖ, సర్వీసులు, శాంతిభద్రతలు, లెజిస్లేచర్ వ్యవహారాలు. కాలేజి విద్య, రెసిడెన్షియల్ స్కూల్సు, ఆధునిక భారతీయ భాషల అభివృద్ధి, అధికార భాష, వాణిజ్యపన్నులు, భూమిశిస్తు, నిర్వాసితుల ఆస్తులు, రిజిస్ట్రేషన్ స్టాంపులు, అతియత్, జాగీర్ పరిపాలన, ఋణ పరిష్కార సంఘం, సమాచార, పౌరసంబంధాలశాఖ. |
| శ్రీ బి. వి. సుబ్బారెడ్డి<br>ఉప ముఖ్యమంత్రి | ప్లానింగు, అర్థగణాంకశాఖ, భవనాలు, రోడ్లు, రహదారులు, పబ్లిక్ గార్డెన్స్, పి. డబ్ల్యు. డి. వర్క్‌షాపులు, రైల్వేలు, టెలిగ్రాఫ్ విషయాలు. |
| శ్రీ కాకాని వెంకటరత్నం | వ్యవసాయం, ఆహారోత్పత్తి, పశుపోషణ, సమీకృత పాలప్రాజెక్టు, పాడిక్షేత్రాల అభివృద్ధి. |
| శ్రీ టి. హయగ్రీవాచారి | పంచాయతీరాజ్. |
| శ్రీ మహమ్మద్ ఇబ్రహీం అలీ అన్సారీ | వైద్య, ఆరోగ్యశాఖ, వక్ఫులు, సాలార్‌జంగ్ మ్యూజియం. |
| శ్రీ జె. వెంగళరావు | పరిశ్రమలు. |
| శ్రీ అనగాని భగవంతరావు | ఆర్థిక, పునరావాసశాఖలు. |
| శ్రీ వి. కృష్ణమూర్తినాయుడు | హోం, పోలీసు, ఆయుధాల చట్టం, ప్యాస్‌పోర్టులు, సినిమటోగ్రఫీ, ఎన్నికలు, జైళ్లు. |
| శ్రీ ఎం. మాణిక్‌రావు | మునిసిపల్ పరిపాలన, టౌన్‌ప్లానింగు, వాణిజ్యం, ఎగుమతుల ప్రోత్సాహం, సిటీ వాటర్ వర్క్సు, ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్, రేవులు. |
| శ్రీ బత్తిన సుబ్బారావు | సహకారం. |
| శ్రీ సి. హెచ్. ఎస్. ఆర్. వి. పి. మూర్తిరాజు | దేవాదాయ, ధర్మాదాయ సంస్థలు, ఇండియన్ మెడిసిన్. |
| శ్రీ పి. బసిరెడ్డి | మధ్యతరహా నీటి పారుదల, వరదల నివారణ, డ్రైనేజి, న్యాయశాఖ, కోర్టులు. |
| శ్రీ రాజా సాగి సూర్యనారాయణ రాజు | అటవీశాఖ. |
| శ్రీ యల్. లక్ష్మణదాసు | గృహనిర్మాణం, గృహవసతి. |
| శ్రీ పి. నరసారెడ్డి | భారీనీటి పారుదల శాఖ. |
| శ్రీ టి. అంజయ్య | కార్మిక శాఖ, ఎంప్లాయిమెంటు. |
| శ్రీ మండలి వెంకటకృష్ణారావు | సాంఘిక సంక్షేమం, మత్స్యపరిశ్రమలు. |
| శ్రీమతి బి. జయప్రద | విద్యుచ్ఛక్తి, స్టేషనరీ, ప్రింటింగు, మహిళా సంక్షేమం, శిశు సంక్షేమం. |
| శ్రీ కె. ప్రభాకర రెడ్డి | రవాణా శాఖ. |

## స్టేట్ మంత్రులు

| | |
|---|---|
| శ్రీ చల్లా సుబ్బారాయుడు | పౌరసరఫరా, రేషనింగు. |
| శ్రీ డి. రాజారాం | చేనేత, సహకార జవుళి మిల్లులు, సహకార చక్కెర ఫ్యాక్టరీలు. |
| శ్రీ పి. మహేంద్రనాథ్ | ఎక్సైజు. |
| శ్రీ కె. గోపాలనాయుడు | చిన్నతరహా నీటిపారుదల. |
| శ్రీ భాట్టం శ్రీరామమూర్తి | ప్రాథమిక, సెకండరీ విద్య, అకాడమీలతోపాటు విజ్ఞానశాస్త్ర సంస్థలు, సాంస్కృతిక విషయాలు, స్వాతంత్ర్యోద్యమ చరిత్ర. |
| శ్రీ కె. భీమ్‌రావు | గిరిజన సంక్షేమం. |
| డా. సి హెచ్. దేవానందరావు | యాత్రావిషయాలు, రవీంద్రభారతి, రాష్ట్రాన్ని సందర్శించే సాంస్కృతిక బృందాలు, ప్రభుత్వ గ్రంథాలయాలు. |
| శ్రీ ఎ. మదన్ మోహన్ | సాంకేతిక విద్య, గనులు, యువజన సేవలు. |
| శ్రీ యం. ఆర్. శ్యామ్‌రావు | ఆర్షశాఖ. పురాపత్ర సంచయనం, స్పోర్ట్స్ కౌన్సిల్, ఆటలు, స్టేడియం, చిన్న మొత్తముల పొదుపు. |
| శ్రీ డి. మునిస్వామి | మార్కెటింగు, రాష్ట్రగిడ్డంగి సంస్థ. |

---

## ఆంధ్రప్రదేశ్ భూకమతాల పరిమితి చట్టానికి సవరణ

1972 వ సం॥ ఆంధ్రప్రదేశ్ భూకమతాల (సవరణ) చట్టం 1972 జనవరి 19 వ తేదీనాటి అసాధారణ గజెటులో ప్రచురించబడింది. ఇందులో కొత్తగా చేర్చబడిన 12-బి సెక్షన్ తప్ప ఈ చట్టం అదే రోజునుంచి అమల్లోకి వచ్చింది. కొత్తగా చేర్చబడిన సెక్షన్ ప్రకారం 1970 డిసెంబరు 18 నుంచి 1971 జూన్ 5 వ తేదీ మధ్యకాలంలో నిర్ణీత భూకమతాలకన్నా యెక్కువగా వున్న భూమిని బేదఖలు చేయడానికి, పంచుకోవడానికి అవకాశంవుంది. సవరించబడిన సదరు చట్టం ప్రకారం 1970 డిశంబరు 18 వ తేదీన కానీ 1971 జూన్ 5 వ తేదీన కానీ, ఎవరికైనా పరిమితికి మించి భూమి వున్నట్లయితే, వారు 1971 జూన్ 5 వ తేదీన కానీ లేక ఆ తరువాత కానీ చట్టం ప్రకారం మిగులు భూమిని వప్పగించే విషయంలో రెవిన్యూ డివిజనల్ ఆఫీసరు ఉత్తరువు జారీచేసేంత వరకు దానిని బేదఖలు చేయడంకానీ, దానం చేయడం కానీ, విక్రయించడం కానీ, తాకట్టుపెట్టడం కానీ లేక విభజించడం కానీ చేయకూడదు. ఈ చట్టాన్ని ఉల్లంఘించి చేసిన చర్యలు చెల్లవు.

జాతీయం చేయబడిన బ్యాంకుల భూములకు వలనే స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా, దాని అనుబంధ సంస్థలు ఇతర బ్యాంకింగ్ కంపెనీల అధీనంలో వున్న భూములకు కూడా ఈ చట్టం వర్తించదు.

తీసుకోబడిన మిగులు భూమికి నష్టపరిహారం చెల్లించ వలసి వచ్చినపుడు, అది చట్టం ప్రకారం మార్కెటు విలువకు పరిమితం చేయబడుతుంది.

సవరించబడిన చట్టంలో, కలెక్టరు రెవిన్యూ డివిజనల్ ఆఫీసరు ఉత్తరువును పునః పరిశీలించ డానికి అవకాశం కల్పించబడింది. తోటలువేసిన భూమి, పాడిపశువులకొరకు ఉపయోగంల్లోవున్న భూమి, చక్కెర ఫ్యాక్టరీ కొరకు చెరకు సాగుచేస్తున్న భూమి మున్నగు వాటికి సంబంధించి, ప్రభుత్వం రూపొందించే నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకోబడిన మిగులు భూమి ఉపయోగం లోకి తీసుకొనిరావడానికి సదరు చట్టంలో వీలుకల్పించబడింది.

# ఇటీవల రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికలలో గెలుపొందిన అభ్యర్థులు

శ్రీకాకుళం జిల్లా:

1. శ్రీ ఉప్పాడ రంగబాబు (కాంగ్రెసు) ఇచ్ఛాపురం.
2. శ్రీ మజ్జి తులసీదాసు (కాం) సోంపేట.
3. శ్రీ ఎస్. లోకనాథం నాయుడు (కాం) టెక్కలి.
4. శ్రీ కె. అప్పల నరసింహం భుక్త (కాం) హరిశ్చంద్రపురం.
5. శ్రీమతి బి. సరోజనమ్మ (కాం) నరసన్నపేట.
6. శ్రీ ముక్కా పగడాలు (కాం) పాతపట్నం (S.C.)
7. శ్రీ వి. నరసింహరావు (ఇండిపెండెంటు) కొత్తూరు (S.T.)
8. శ్రీ సి.సి.డి. వైరిచర్ల (ఇం) నాగూరు (S.T.)
9. శ్రీ సి. పరశురామ నాయుడు (ఇం) పార్వతీపురం
10. శ్రీ జన్ని ముత్యాలు (కాం) సాలూరు (S.T.)
11. శ్రీ సి. వేంకట కుమార కృష్ణారావు (కాం) బొబ్బిలి.
12. శ్రీ తెంటు లక్ష్మి నాయుడు (ఇం) పెద్దమానాపురం.
13. శ్రీమతి పి. రుక్మిణమ్మ (కాం) ఉనుకూరు.
14. శ్రీ కొత్తపల్లి నర్సయ్య (కాం) పాలకొండ (S.C.)
15. శ్రీ పి. శ్రీరామమూర్తి (ఇం) నగిరికటకం.
16. శ్రీ సి. లక్ష్మి నారాయణ (ఇం) శ్రీకాకుళం.
17. శ్రీ బల్లాడ హరియప్పడు (ఇం) ఇచ్ఛెర్ల
18. శ్రీ లుకలాపు లక్ష్మణదాసు (కాం) పొందూరు
19. శ్రీ రౌతు సైదప్ప నాయుడు (కాం) చీపురుపల్లి.

విశాఖపట్నం జిల్లా.

*20. శ్రీ పెనుమెత్స సాంబశివరాజు (కాం) గజపతినగరం.
21. శ్రీ అప్పసాని అప్పన్నదొర (కాం) విజయనగరం.
22. శ్రీ కె. అప్పడుదొర (కాం) భోగాపురం.
23. శ్రీ రాజసాగి డి. ఎస్. సూర్యనారాయణరాజు (కాం) భీమునిపట్నం.
24. శ్రీ ఎం. ఆర్. డీన్. (కాం) విశాఖపట్నం. I.
25. శ్రీ పి. సన్యాసిరావు (ఇం) విశాఖపట్నం II.
26. శ్రీ ఉప్పలపాటి ఎ. సూర్యనారాయణరాజు (ఇం) జామి.
27. శ్రీమతి దొడ్డ కళావతి (కాం) మాడుగుల.
28. శ్రీ కె. వి. సత్యనారాయణ పద్మనాభరాజు (కాం) శృంగవరపు కోట.
29. శ్రీ లావుర్బ చిట్టినాయుడు (కాం) పాడేరు (S.T.)
30. శ్రీ జి. కృష్ణం నాయుడు (కాం) గొంప.
31. శ్రీ వెనలపు పాంవెర్లి (కాం) చోడవరం.
32. శ్రీ పి. వి. రమణ (కాం) అనకాపల్లి.
33. శ్రీ భాట్టం శ్రీరామమూర్తి (కాం.) పరవాడ.
34. శ్రీ కె.కె.వి. సత్యనారాయణ రాజు (ఇం) ఎలమంచిలి.
35. శ్రీ జి. సూర్యనారాయణ (కాం) పాయకరావుపేట (S.C.)
36. శ్రీ రాజా సాగి సూర్యనారాయణ రాజు (కాం) నరసీపట్నం.
37. శ్రీ ఐ. రాహుస్నవజాల్ (కాం) చింతపల్లి

తూర్పు గోదావరి జిల్లా.

38. శ్రీమతి తడపట్ల రత్నాబాయి (కాం) ఎల్లావరం (S.T.)
39. శ్రీ కె. రామచంద్రరావు (కాం) బూరుగుపూడి.
/40. శ్రీ బి. మల్లిఖార్జునరావు (కాం) రాజమండ్రి.
41. శ్రీ బత్తిన సుబ్బారావు (కాం) కడియం (S.C.)
42. శ్రీ పి. పద్మనాభం. (కాం) జగ్గంపేట.
43. శ్రీ కె. కృష్ణమూర్తి (కాం) పెద్దాపురం.
44. శ్రీ వారుపుల జోగిరాజు (కాం) ప్రత్తిపాడు.
45. శ్రీమతి ఎన్. విజయలక్ష్మి (కాం) తుని.
46. శ్రీ వై. సూర్యనారాయణమూర్తి. (కాం) పిఠాపురం.
47. శ్రీ సి. వెంకటరత్నం (కాం) సంపర.
48. శ్రీ సి.వి.కె. రావు (ఇం.) కాకినాడ.
49. శ్రీ సాదనాల సత్తిరాజు (కాం) తాళ్ళరేవు (S.C.)
*50. శ్రీ వి. రామకృష్ణ చౌదరి (కాం) అనపర్తి.
51. శ్రీ డి. సత్యనారాయణ రెడ్డి (కాం.) రామచంద్రపురం
52. శ్రీమతి జి. కమలాదేవి (కాం) పామర్రు.
53. శ్రీ పి. వెంకటరావు (కాం) చెయ్యేరు.
54. శ్రీ ఎం. విష్ణు ప్రసాదరావు (కాం) అల్లావరం (S.C.)
55. శ్రీ కె. ప్రభాకర రావు (కాం) అమలాపురం.
56. శ్రీమతి డి. భానుతిలకం (కాం) కొత్త పేట.
57. శ్రీ జి. మహాలక్ష్మి (కాం) నగరం (S.T.)
58. శ్రీ బి. గోపాల కృష్ణారావు (ఇండి) రాజోలు.

పశ్చిమ గోదావరి జిల్లా :

59. శ్రీ పరకాల శేషావతారం (కాం) నరసాపురం.
60. శ్రీ సి. వి. హరరామ జోగయ్య (కాం) పాలకొల్లు.
61. శ్రీ గొట్టి ముక్కల వెంకన్న (కాం) అనంత (S.T.)
62. శ్రీ బి. విజయ కుమార్ రాజు (కాం) భీమవరం.
63. శ్రీ దండుబోయిన పేరయ్య (కాం) ఉండి.
64. శ్రీ వంకా సత్యనారాయణ (సి.పి.ఐ.) పెనుగొండ.
65. శ్రీ జి. సత్యనారాయణ మూర్తి (కాం) తణుకు.
66. శ్రీ కె. విజయ నరసింహ రాజు (కాం) అత్తిలి.
67. శ్రీ చలి ఆంజనేయులు (ఇండి) తాడేపల్లి గూడెం.
*68. శ్రీ సి. హెచ్. ఎస్. వరప్రసాద మూర్తి రాజు (కాం) ఉంగుటూరు.
*69. శ్రీ ఎం. రామమోహన రావు (కాం) దెందులూరు.
70. శ్రీ ఎ. శ్రీరాములు (ఇండి) ఏలూరు.
71. శ్రీ ఎస్. వెంకట రావు (ఇండి) గోపాలపురం. (S.C.)
72. శ్రీ ఎ. హనుమంత రావు (ఇండి) కొవ్వూరు.

73. శ్రీ కటితి రాములు (కాం) పోలవరం (S.T.)
74. శ్రీ డి. కోటేశ్వర రావు (ఇండి) చింతలపూడి.

<u>కృష్ణా జిల్లా :</u>

75. శ్రీ వి. ఆర్. జి. కె. ఎం. ప్రసాద్ (ఇండి) జగ్గయ్య పేట.
76. శ్రీ వి. నాగేశ్వర రావు (కాం) నందిగామ.
77. శ్రీ డి. రమారావు (కాం) విజయవాడ-(తూర్పు.)
78. శ్రీ ఆసిఫ్ పాషా (కాం) విజయవాడ-(పశ్చిమం)
79. శ్రీ ఎ. భాస్కర రావు (కాం) కంకిపాడు.
80. శ్రీ సి. వెంకట రావు (కాం) మైలవరం.
81. శ్రీ కె. రమయ్య (కాం) తిరువూరు -(S.C.)
82. శ్రీ ఎం. ఆర్. రంగయ్యప్ప రావు (కాం) నూజివీడు.
83. శ్రీమతి వి. ఎలిజబెత్ సరోజినీ ఆనందబాయి (కాం) గన్నవరం.
84. శ్రీ కాకాని వెంకటరత్నం (కాం) ఉయ్యూరు.
85. శ్రీ కె. సత్యనారాయణ (కాం) గుడివాడ.
86. శ్రీ కె. రఘునాథం (కాం) ముదినేపల్లి.
87. శ్రీమతి కె. పుంగిత యారమ్మ (కాం) కైకలూరు.
88. శ్రీ పి. పమిడేశ్వర రావు (కాం) మల్లేశ్వరం.
89. శ్రీ పి. లక్ష్మణ రావు (కాం) బందరు.
90. శ్రీ కె. సోమేశ్వర రావు (కాం) నిడుమోలు-(S.C.)
91. శ్రీ ఎం. వెంకట కృష్ణా రావు (కాం) అవనిగడ్డ.

<u>గుంటూరు జిల్లా :</u>

92. శ్రీ ఎ. భగవంత రావు (కాం) కూచినపూడి.
93. శ్రీ వై. చెన్నయ్య (కాం) రేపల్లె
94. శ్రీ వై. వెంకట్రావు (స్వతంత్ర) వేమూరు
95. శ్రీ బి. గోపాలరెడ్డి (కాం) దుగ్గిరాల
96. శ్రీమతి దొడ్డపనేని ఇందిర (ఇండి) తెనాలి
97. శ్రీ డి. రంగారావు (ఇండి) పొన్నూరు
98. శ్రీ కె. ప్రభాకరరావు (కాం) బాపట్ల
99. శ్రీ ఒక్క పీటర్‌పాల్ (కాం) ప్రత్తిపాడు
100. శ్రీమతి విజయ రామానుజం (కాం) గుంటూరు I.
101. శ్రీ ఎస్. వెంకటరత్నం (ఇం) గుంటూరు II.
102. శ్రీ వి. శ్రీకృష్ణ (సి. పి. ఐ.) మంగళగిరి
103. శ్రీ జి. వి. రత్తయ్య (కాం) తాడికొండ
104. శ్రీ జి. వీరాంజనేయశర్మ (కాం) సత్తెనపల్లి
105. శ్రీమతి షరీఫున్నీసాబేగం (కాం) పెదకూరపాడు
106. శ్రీ ఎం. నాగిరెడ్డి (సి. పి. ఐ.) గురుజాల
107. శ్రీ జె. నాగిరెడ్డి (ఇండి) మాచెర్ల
108. శ్రీమతి భవనం జయప్రద (కాం) వినుకొండ
109. శ్రీ డి. కృష్ణారెడ్డి (కాం) నరసారావుపేట

<u>ఒంగోలుజిల్లా:</u>

110. శ్రీ బి. సత్యనారాయణ (కాం) చిలకలూరిపేట
111. శ్రీ ఎం. నారాయణరావు (ఇండి) పర్చూరు
112. శ్రీ జి. కోటయ్య (కాం) చీరాల
113. శ్రీ దాసరి ప్రకాశం (కాం) అద్దంకి
114. శ్రీ అరేటి కోటయ్య (కాం) సంతనూతలపాడు (S.C.)
115. ఎస్. జీవరత్నం నాయుడు (కాం) ఒంగోలు
116. శ్రీ పి. వెంకటయ్య (సి. పి. ఐ) కొండెపి
117. శ్రీ ఎం. ఆదినారాయణరెడ్డి (ఇండి) కందుకూరు
118. శ్రీ గురాల పాపిరెడ్డి (ఇండి) కనిగిరి
119. శ్రీ కాటూరి నారాయణస్వామి (ఇండి) పొదిలి
120. శ్రీ డి. రాజగోపాలరెడ్డి (కాం) దరిశి
121. శ్రీ కె. సుబ్బారెడ్డి (కాం) ఎర్రగొండపాలెం
122. శ్రీ ఎం. నాసర్‌బేగ్ (కాం) మార్కాపురం
123. శ్రీ పి. రంగారెడ్డి (కాం) గిద్దలూరు

<u>నెల్లూరు జిల్లా :</u>

124. శ్రీ పి. చెంచు రామయ్య (కాం) ఉదయగిరి.
125. శ్రీ జి. కొండప్ప నాయుడు (ఇం). కావలి.
126. శ్రీ ఆర్. దశరథ రామిరెడ్డి (కాం) అల్లూరు.
127. శ్రీ పి. రామచంద్రా రెడ్డి (కాం) కోవూరు.
128. శ్రీ కె. శ్రీహరి నాయుడు (కాం) ఆత్మకూరు.
129. శ్రీ ఎస్. వెంకట రత్నం నాయుడు (ఇం) రాపూరు.
130. శ్రీ ఎ. వెంకట రెడ్డి (కాం) నెల్లూరు.
131. శ్రీ పుంగగిరి నానాదాస్ (కాం) సర్వేపల్లి-(S.C.)
132. శ్రీ ఎస్. శ్రీనివాసులు రెడ్డి (ఇం) గూడూరు.
133. శ్రీ పి. వెంకట సుబ్బయ్య (కాం) సూళ్ళూరు పేట (S. C.)
134. శ్రీ ఓ. వెంకట సుబ్బయ్య (కాం) వెంకటగిరి (S. C.)

<u>చిత్తూరు జిల్లా :</u>

135. శ్రీ ఎ. బలరామ రెడ్డి (ఇం) కాళహస్తి.
136. శ్రీ సి. దాస్. (కాం) సత్యవేడు (S. C.)
137. శ్రీ కె. గోపాల నాయుడు (కాం) నగరి.
138. శ్రీ ఇ. గోపాల రాజు (కాం) పుత్తూరు.
139. శ్రీ వి. మునసామి అప్ప (కాం) వేపంజెరి (S. C.)
140. శ్రీ డి. ఆంజనేయులు నాయుడు (కాం) చిత్తూరు.
141. శ్రీ ఎం. మునుస్వామి (కాం) బంగారి పాళ్యం (S. C.)
142. శ్రీ డి. వెంకటేశం (ఇం) కుప్పం.
143. శ్రీ ఎం. ఎం. రత్నం (కాం) పలమనేరు
144. శ్రీమతి రాణి సుందరమ్మణ్ణి (కాం) పుంగనూరు.
145. శ్రీ ఎ. నరసింగ రావు (కాం) మదనపల్లి.
146. శ్రీమతి టి. ఎన్. అనసూయమ్మ (కాం) తంబళ్లపల్లి.
147. శ్రీ ఎస్. అమరనాథ రెడ్డి (కాం) వాయల్పాడు.
148. శ్రీ మెయిగర్ సైపుల్లాబేగ్ (కాం) పీలేరు.
149. శ్రీ విజయ శిఖామణి (కాం) తిరుపతి.

కడప జిల్లా :

150. శ్రీ జి. శ్రీరాములు (కాం) కోడూరు (S. C.)
151. శ్రీ వి. రత్న సభాపతి (స్వ) రాజంపేట.
152. శ్రీ హబీబుల్లా సుహల్ (కాం) రాయచోటి.
153. శ్రీ రాజగోపాల రెడ్డి (కాం) లక్కిరెడ్డిపల్లి.
154. శ్రీ జి. రంగా రెడ్డి (కాం) కడప.
155. శ్రీ బి. వీరా రెడ్డి (కాం) బద్వేల్.
156. శ్రీ ఎస్. పెద్ద నాగిరెడ్డి (కాం) మైదుకూరు.
157. శ్రీ కె. సుబ్బారావు (కాం) ప్రొద్దుటూరు.
158. శ్రీ టి. నరసింహా రెడ్డి (ఇం.) జమ్మల మడుగు
159. శ్రీ ఆర్. సీతారామయ్య (కాం) కమలా పురం.
160. శ్రీ పి. బసిరెడ్డి (కాం) పులివెందల.

అనంత పురం జిల్లా :

161. శ్రీ సి. నారాయణ రెడ్డి (ఇం) కదిరి.
162. శ్రీ ఎ. వీరప్ప (కాం) నల్లమడ
163. శ్రీ పి. రవీంద్ర రెడ్డి (ఇం) గోరంట్ల.
164. శ్రీ జి. సోమ శేఖర్ (కాం) హిందు పురం.
165. శ్రీ యం. ఎల్లప్ప (కాం) మడకశిర.
166. శ్రీ ఎస్. నారాయణ రెడ్డి (కాం) పెనుగొండ.
167. శ్రీమతి ఎం. లక్ష్మీదేవి (కాం) కళ్యాణ దుర్గం (S. C.)
168. శ్రీ జె. తిప్పేస్వామి (కాం) రాయదుర్గం.
169. శ్రీ బి. బసప్ప (ఇం) ఉరవ కొండ.
170. శ్రీ డి. వెంకట రెడ్డి (ఇం) గుత్తి.
171. శ్రీ టి. రంగా రెడ్డి (ఇం) శింగనమల.
172. శ్రీ ఎ. వెంకట రెడ్డి (కాం) అనంతపురం.
173. శ్రీ పి. వి. చౌదరి (కాం) ధర్మవరం.
174. శ్రీ పల్లా సుబ్బా రాయుడు (కాం) తాడి పత్రి.

కర్నూలు జిల్లా :

175. శ్రీ పి. రాజరత్నా రావు (కాం) ఆలూరు (S. C.)
176. శ్రీ హెచ్. సత్యనారాయణ (కాం) ఆదోని.
177. శ్రీ పి. ఒ. సత్యనారాయణ రాజు (కాం) ఎమ్మిగనూరు.
*178. శ్రీ డి. మునిస్వామి (కాం) కోడుమూరు (S. C.)
179. శ్రీ పి. రహమాన్ ఖాన్ (కాం) కర్నూలు.
180. శ్రీ కె. బి. నరసప్ప (కాం) పత్తికొండ.
181. శ్రీ శేషన్న (కాం) ద్రోణాచలం
*182. శ్రీ బి. వి. సుబ్బారెడ్డి (కాం) కోయిల కుంట్ల.
183. శ్రీ ఎస్. వెంకట సుబ్బారెడ్డి (ఇం) ఆళ్లగడ్డ.
*184. శ్రీ ఇ. అయ్యపు రెడ్డి (కాం) పాణ్యం.
*185. శ్రీ ఎం. సుబ్బారెడ్డి (కాం) నందికొట్కూరు
186. శ్రీ బి. వెంకట రెడ్డి (ఇం) నంద్యాల.

మహబూబునగరు జిల్లా :

187. శ్రీ పి. మహేంద్రనాధ్ (కాం) అచ్చంపేట (S. C.)
188. శ్రీ వి. ఎన్. గౌడ్ (కాం) నాగరకర్నూలు
189. శ్రీ ఎస్. జయపాలరెడ్డి (కాం) కల్వకుర్తి
190. శ్రీ ఎన్. వి. జగన్నాధం (కాం) షాద్‌నగర్ (S. C.)
191. శ్రీ ఎస్. నరసప్ప (కాం) జడ్చర్ల
192. శ్రీ ఇబ్రహిం అలీ అన్సారి (కాం) మహబూబునగర్
193. శ్రీ అయ్యప్ప (కాం) వనపర్తి
194. శ్రీ టి. చంద్రశేఖరరెడ్డి (కాం) అలంపూరు
195. శ్రీ కె. రంగదాసు (ఇం) కొల్లాపూరు
196. శ్రీ పి. పి. రెడ్డి (కాం) గద్వాల్
*197. శ్రీ సోంభూపాల్ (కాం) అమరచింత
*198. శ్రీ కళ్యాణి రామచంద్రరావు (కాం) మక్తాల్
199. శ్రీ ఎస్. వెంకటయ్య (ఇం) కొడంగల్.

హైద్రాబాదు జిల్లా :

*200. శ్రీ ఎమ్. మానిక్‌రావు (కాం) తాండూరు
201. శ్రీ తిరుమలయ్య (ఇం) వికారాబాదు (S. C.)
202. శ్రీ కె. ఆర్. రెడ్డి (కాం) పర్గి
203. శ్రీ కిషన్‌రావు (కాం) చేవెళ్ల
204. శ్రీ ఎన్. అనంతరెడ్డి (కాం) ఇబ్రహింపట్నం
205. శ్రీ టి. అంజయ్య (కాం) ముషిరాబాదు
206. శ్రీమతి శాంతాబాయి తల్పల్లీకర్ (కాం) గగనమహల్
207. శ్రీ ఎస్. లక్ష్మినారాయణ (కాం) మహరాజ్‌గంజ్
208. శ్రీ ఎస్. క్రిష్ణారావు (కాం) ఖైరతాబాదు
209. శ్రీ సయ్యద్ రహమత్ అలీ (కాం) ఆసిఫ్‌నగర్
210. శ్రీ ఎస్. రహమాన్ (ఇం) సీతారాంబాగ్
211. శ్రీమతి సరోజినీపుల్లారెడ్డి (కాం) మలకపేట
212 శ్రీ ఎస్. ఎస్. ఒవైసి (ఇం) యాకుత్‌పురా
213. శ్రీ సయ్యద్ హసన్ (ఇం) చార్మినార్
214. శ్రీ ఎల్. నారాయణ (కాం) సికింద్రాబాదు
215. శ్రీమతి వి. మంకమ్మ (కాం) సికింద్రాబాదు కంటోన్మెంటు (S.C.)
216. శ్రీమతి సుమిత్రాదేవి (కాం) మేడ్చల్

మెదక్ జిల్లా :

217. శ్రీ మదనమోహన్ (కాం) సిద్దిపేట
218. శ్రీ ఎస్. రామచంద్రారెడ్డి (కాం) దొమ్మాట
219. శ్రీ జి. సైదయ్య (కాం) గజ్వేల్ (S. C.)

220. శ్రీ జగన్నాథరావు (కాం) నర్సాపూర్
221. శ్రీ పి. రామచంద్రారెడ్డి (కాం) సంగారెడ్డి
222. శ్రీ సి. రాజనరసింహ (కాం) ఆందోల్ (S. C.)
223. శ్రీ ఎం. బాగారెడ్డి (కాం) జహీరాబాదు
224. శ్రీ వెంకటరెడ్డి (ఇం) నారాయణ్‌ఖేడ్
225. శ్రీ పి. రామచంద్రరావు (ఇం) మెదక్
226. శ్రీ కిష్టారెడ్డి (ఇం) రామాయంపేట

నిజామాబాదు జిల్లా :

227. శ్రీ జి. రాజారాం (కాం) బాల్కొండ
228. శ్రీ టి. రంగారెడ్డి (కాం) ఆర్మూరు
229. శ్రీ వై. సత్యనారాయణ (కాం) కామారెడ్డి
230. శ్రీమతి జె. ఈశ్వరీబాయి (ఎస్. టి. పి. ఎస్.) ఎల్లారెడ్డి
231. శ్రీ శ్రీనివాసరావు (కాం) బన్సువాడ
232. శ్రీ ఎస్. విఠల్‌రెడ్డి (ఇం) జుక్కాల
233. శ్రీ ఎం. నారాయణరెడ్డి (కాం) బోధన్
234. శ్రీ వి. చక్రధరరావు (ఇం) నిజామాబాదు

ఆదిలాబాదుజిల్లా :

*235. శ్రీ గడ్డన్న (కాం) ముథోల్
*236. శ్రీ పి. నరసారెడ్డి (కాం) నిర్మల్
237. శ్రీ ఎస్. ఎ. దేవ్‌షా (కాం) బోథ్ (S. T.)
238. శ్రీ మసూద్‌అహ్మద్ (కాం) ఆదిలాబాదు
239. శ్రీ కె. భీమ్‌రావు (కాం) ఆసిఫాబాదు (S. T.)
240. శ్రీ కె. వి. కేశవులు (కాం) సిర్పూరు
241. శ్రీ జె. వి. నరసింగ రావు (కాం) లక్సెట్టి పేట
*242. శ్రీ కె రాజమల్లు (కాం) చెన్నూరు (S.C.)

కరీంనగర్ జిల్లా :

243. శ్రీ పి. వి. నరసింహా రావు (కాం) మంథెని.
244. శ్రీ గె. మల్లా రెడ్డి (కాం) పెద్దపల్లి.
245. శ్రీ జి. ఈశ్వర్ (కాం) మేడారం (S. C.)
246. శ్రీ వై. రాజేశ్వర రావు (కాం) హుజూరాబాదు.
247. శ్రీ పి. జనార్దన రెడ్డి (ఇం) జమ్మికుంట?
248. శ్రీ ఎ. ఎల్లారెడ్డి (సి.పి.ఐ.) ఇందుర్తి
249. శ్రీమతి ప్రేమలతా దేవి (కాం) సుల్తానాబాదు. (S. C.)
250. శ్రీ జె. చొక్కారావు (కాం) కరీంనగర్.
251. శ్రీ జె. దామోదర రావు (ఇం) బుగ్గారం.
252. శ్రీ వి. జె. రావు (కాం) జగిత్యాల.
253. శ్రీ సి. సత్యనారాయణ రావు (కాం) మెట్‌పల్లి.
254. శ్రీ జె. ఎన్. రావు (కాం) సిరిసిల్ల.
255. శ్రీ జి. భూమయ్య (ఇం) నేరెళ్ళ (S. C.)

వరంగల్లు జిల్లా :

256. శ్రీ పి. జె. లింగయ్య (కాం) చేర్యాల. (S. C.)
257. శ్రీ ఎ. నారాయణ (కాం) జనగాం.
258. శ్రీ కె. మధుసూదన రెడ్డి (ఇం) చెన్నూరు.
*259. శ్రీ ఎస్. రామచంద్రా రెడ్డి (కాం) డోర్నకల్లు.
260. శ్రీ జె. జనార్ధన రెడ్డి (కాం) మహబూబాబాదు.
261. శ్రీ ఎం. ఓంకార్ (సి. పి. ఎం.) నరసంపేట.
262. శ్రీ సి. పురుషోత్తమ రావు. (ఎస్. టి. పి. ఎస్) వర్ధన్న పేట.
263. శ్రీ టి. హయగ్రీవాచారి. (కాం) ఘనపూరు.
264. శ్రీ పి. ఉమారెడ్డి (కాం) వరంగల్లు.
265. శ్రీ ఆర్. ఎస్. రామయ్య (కాం) హనుమకొండ (S. C.)
266. శ్రీ పి. ధర్మారెడ్డి (కాం) పరకాల.
267. శ్రీ ఎస్. చక్రవర్తి (కాం) ములుగు.

ఖమ్మం జిల్లా :

268. శ్రీ ఎం. రామచంద్రయ్య (కాం) భద్రాచలం (S T.)
269. శ్రీ కె. రామయ్య (కాం) బూర్గంపాడు (S. T.)
270. శ్రీ చేకూరి కాశయ్య (కాం) పాల్వంచ.
271. శ్రీ జె. వెంగళరావు (కాం) వేంసూరు.
272. శ్రీమతి పి. వెంకట్రావమ్మ (కాం) మధిర.
273. శ్రీ కె. శాంతయ్య (కాం) పాలేరు (S. .)
274. శ్రీ ఎం. రజబ్ అలీ (సి. పి. ఐ) ఖమ్మం
275. శ్రీ వి. సుబ్బారావు (కాం) యెల్లందు.

నల్గొండ జిల్లా :

276. శ్రీ జి. వెంకట నర్సయ్య (ఇం) తుంగతుర్తి.
277. శ్రీ వై. గోవిందయ్య (కాం) సూర్యాపేట (S. C.)
278. శ్రీ కె. జితేంద్ర రెడ్డి (ఇం) హుజూరునగరు.
279. శ్రీ చిన్న కృష్ణా రెడ్డి (కాం) మిర్యాలగూడ.
280. శ్రీ ఎస్. రామయ్య (కాం) చలకుర్తి.
281. శ్రీమతి ఎం. కమలమ్మ (కాం) నకిరేకల్.
282. శ్రీ శ్రీనివాస రావు (కాం) నల్గొండ.
283. శ్రీ వి. కాశీరాం (కాం) రామన్న పేట (S. C.)
284. శ్రీ ఎ. పున్నా రెడ్డి (కాం) ఆలేరు.
285. శ్రీ కొండా లక్ష్మణ బాపూజీ (కాం) భువనగిరి.
286. శ్రీ పి. గోవర్ధన రెడ్డి (కాం) మునుగోడు.
287. శ్రీ బి. రామ శర్మ (సి.పి.ఐ.) దేవర కొండ.

---

* ఈగుర్తు గల అభ్యర్థులు పోటిలేకుండా ఎన్నికయ్యారు.

# మన ఇరుగుపొరుగు రాష్ట్రాలలో

# ఉగాది తీరుతెన్నులు

గుమపాటి భోగేశ్వరం

హైందవుల పర్వదినాలలో కెల్ల "ఉగాది" మేటి పర్వదినం "యుగాది" అనే సంస్కృత శబ్దానికి తెలుగురూపం "ఉగాది" కాలగమనానికి అనుకూలంగా ఏర్పడిన ఆరంభదినమే ఉగాది సంవత్సరాదియే ఉగాదిగా పేర్కొనబడుతున్నది.

మనదేశంలో ఎన్నోరకాల పంచాంగాలున్నాయి. కొన్ని ప్రాంతాలలో శాలివాహన శకం, మరికొన్నిప్రాంతాలలో విక్రమ శకం ప్రచారంలోనున్నాయి. మనభారతదేశంలోని పలురాష్ట్రాలవారు వారివారి కాలమానాలననుసరించి వివిధకాలలుగా నూతన సంవత్సరాది ఉత్సవాలు (ఉగాది ఉత్సవాలు) జరుపబడుతున్నవి. ఇటు మన ఇరుగుపొరుగు రాష్ట్రములలో ఉగాది వివిధకాలలుగా ఆచరించబడుతున్ననూ ఆచారంవైవిధ్యంలోని ఐక్యత్రింపారత్రిం కోణంలో చూడంపలె ఒక్కటే

## ఆంధ్రప్రదేశ్ లో

మన ఆంధ్రప్రదేశ్‌లో ఉగాది పర్వంయేటేటా చైత్రశుద్ధ పాడ్యమినాడు జరుపుకుంటారు నాటి ఉదయం యింటికి పూర్వమే తెలావుంగి స్నానంచేసి గృహప్రదేశాలను మామిడి ఆకుల తోరణాలతో, అలంకరించి ప్రతి ఇంట నిర్మించి అందు నూతనసంవత్సర పంచాంగాన్ని అర్చించి దేవతను షోడశోపచారాలతో అర్చించి షడ్రసోపేతమైన ఉగాది పచ్చడిని సంవత్సరాదిదేవతకు నివేదించుతారు. మామిడి ముక్కలు, బెల్లము, కొత్త చింతపండు, వేపపూత పచ్చిమిరపకాయలు ఉప్పుమొదలగునవి కలిపి ఉగాది పచ్చడి తయారుచేసి సేవించుట మన ముఖ్య ఆచారము ఈ ఉగాది పచ్చడి సుఖదుఃఖ సమ్మిశ్రమగు మానవుని సంవత్సర జీవితానికి ఉపలక్షణమని ఆంధ్రుల గాఢ విశ్వాసము ఉగాది నాటి కార్యక్రమాలలో పంచాంగ శ్రవణం, కందాయఫలములు తెలుసుకొనుట ముఖ్యమైనవి, ఆలయాలలో విశేష అర్చనలు ముఖ్యమైనవి.

## మహారాష్ట్రంలో ధ్వజారోహణం

మహారాష్ట్రంలో కూడ "ఉగాది" పండుగను చైత్రశుద్ధ పాడ్యమి నాడే జరుపుకుంటారు. దాని పేరు "గుడిపడవా" (ధ్వజారోహణపర్వం) అని వ్యవహరిస్తారు. ఈ ధ్వజారోహణ పర్వాన్ని మన ఆంధ్రులు ఆచరించకపోయినా మహారాష్ట్రీయులు ముఖ్యంగా ఆచరిస్తారు. దీనికి సంబంధించిన గాథ యిలా వుంది.

పూర్వం "వసురాజు" అనే ఒకరాజు దేవేంద్రుని గూర్చి తపస్సుచేసి దేవేంద్రుని అనుగ్రహముపొంది ఆయననుండి ఒక విమానాన్ని, పుష్పహారమునూ పొందగలిగాడు. ఆ అలంకరించుకున్నవారిని ఎన్నడూ వాడని పూలమాలవలన యుద్ధములో జయము సాధించగలిగిన వసురాజు తన రాజ్యమును పాలించి ఇట్టి అద్భుతవస్తువులతో వసురాజు చైత్రశుద్ధపాడ్యమినాడు తన పట్టణానికి రాగా ఆనందించి ప్రజలు అపూర్వవస్తువులనొసంగిన దేవేంద్రుని గూర్చి కృతజ్ఞత సూచకంగా గొప్ప ఉత్సవం చేశారు. ఆనాటినుండి ఇంద్రుని అనుగ్రహార్థం చేసే ఉత్సవమే ధ్వజారోహణోత్సవం.

ఒకపొడుగైన కర్రను తీసుకొని దానికి మామిడి ఆకులు చుట్టి పూలు పుష్పములు అలంకరించి ఒక పట్టుబట్టను చుట్టి దాని పై ఒక వెండిపాత్రను బోర్లించి గృహముల ముందు ధ్వజస్తంభముగా నిలబెడతారు. దీనినే ఇంద్రధ్వజం అని అంటారు.

## కేరళలో వాస్తవికం

కేరళరాష్ట్రంలో నూతన సంవత్సరాదిని "విషు" అంటారు. పండుగకు ముందు రోజున రాత్రి ... దేవుని గదిలో పెట్టి ఆగది మూసివేసి మరునాడు ఉదయం ఉగాదినాడు ఇంటిలోని పెద్దలు లేచి ... చుండగనే కళ్ళుమూసికొని దేవుని గదిలో ఉంచబడిన వస్తువులను చూడటం వారి ఆచారమట. అసలు నూతన సంవత్సరంనాడు నిద్రలేచిన తర్వాత మొదట ఏ వస్తువును చూస్తారో ఆ సంవత్సరమంతా వారికి ఆ వస్తువులే ప్రాప్తిస్తాయని వారి ప్రగాఢవిశ్వాసం.

కేరళలో పనసలు కొబ్బరి మామిడి ముఖ్యంగా కొబ్బరికాయలు విపరీతంగా కాస్తాయి. కేరళీయులు వర్షాలు కురిపించి పంటలు పండించినందులకు ఇంద్రునికి కృతజ్ఞతలతో పూజలు జరుపు

లారు నూతన ధాన్యాలు, అపూపాలూ, కొబ్బరికాయ కోరి తినిపిస్తే ప్ర ఉన్నారు ఈ పండుగ సమయంలో స్త్రీలు బప్పట్లు తట్టుతూ మన ఆంధ్రలో గొబ్బి పాటలు పాడినరీతిగ పాటలు పాడుతూ ఆడతారు. కేరళీయులు అత్యంత పెద్ద పండుగ జరుపుకొనే "ఓణంపండుగ" వారి పండుగలా చాలాపోలికలున్నాయి ధాన్యపు కుంకుమల్ని ..., లేనికొబ్బరి ... పురుషులు తలపాగాలోనూ స్త్రీలు ... ధరించుట ఆ పండుగ ప్రత్యేకత

## తమిళ నాడులో

తమిళులలో ఆంధ్రుల ఆచారమున్నది. ఉగాదినాడు స్త్రీలు మంగళవాచకములైన కుంకుమ, చందనం, నారికేళము, వెండి, సువర్ణము పళ్ళెములో పోసి పిల్లలకు చూపించుట వారి ఆచారమట. ఈ విధంగా చేయుటం మూలమున సంవత్సరమంతా సంపద, సుఖసౌభాగ్యాలతో వారు తులతూగగలరు.

ఈ విధంగా మాసపు ఆనందానుభూతికి, వాతావరణ సిద్ధికి ప్రతిబింబమైన ఉగాది పర్వదినం వివిధ ప్రాంతాలలో విభిన్నరీతుల ఆచరించబడుచున్నా, భారతీయాత్మ ఒక్కటేనని ఋజువగుచున్నది

ఉగాది ... సంప్రదాయసిద్ధముగా ... సంస్కృతములో గొప్ప కవులు ఎందరో వర్ణించియున్నారు

"మాకొరకు కనుము కేసరి నీరి
  ... మూర్ఛ దిగంతే

మధురమధురాధర మధుపే
  మధుపుచపేటికా సనోత్కంటా"

(వసంతకాల లేతమామిడి చిగురులతో నిండిన దిక్కులుగలదీ మృదులమైన పూదేనెతో కూడిన తుమ్మెదలుగలదీ అయిన చైత్ర మాసము ఉగాదితో ఆరంభం అవుతున్నది గొలుపుదు)

మానవుని జీవితంలో ప్రతి రోజూ పండుగ కావాలి ... మానవజీవితం ... అదే మానవుని ... ... మానవజీవితమే ... ఎంతో ఆనందం.

# స్వాగతము పరీధావికి

కల్యాణసింగ్

ఉజ్జ్వల రవి ప్రభాపూర్ణ మహోజ్జ్వల హోయసు
  సంతరించె వనిన్
పల్లవి పర్వదినంబుగను సంస్కృతి సొగసు
  నుందు, ...
పర్వము లేగుచున్ మరల వచ్చును నుండును;
  వచ్చె నేడిదే
సర్వ యుగాది; వచ్చె నవ వర్షము హాయి
  విరిస్ఫురించువిన్.

స్వాగతము పరీధావి స్వాగతమ్ము
పేశలోజ్జ్వల కిసలయ పీఠికమ్ము
పుష్కల రసాల మంజరీ పూజనమ్ము
భవ్య హాసంబు మురిపించు భాసనమ్ము.

ఉపుసలను పిందియలను సంజీవకరణ
సనల రేనియలు రసాయనముగ జేసి
నవ నవోన్మేష మోద సంధానకరణి
కలిపి త్రావింపు గాక ఉగాదిలక్ష్మి.

గణనీయ భాగ్యకర మయి
ప్రణవౌజో దీప్తి భాసురం బయి సుఖకా
రణ మయి ఆమయ భయ వా
రణ మయి నవ హాయనమ్ము రక్షించు ప్రజన్.

... ధారిణ మయి భవ
తారణ మయి క్లేశ బంధ దారిణ మయి శు
భాకృత చణ మయి శోభా
తోరణ మయి క్రొత్తయేడు దోహదమిచ్చున్.

ప్రాణ జీవన ధారిణ మయి
నవ జీవన దివ్య హర్ష నవ్య ప్రాణి
సన మయి ... సవ వర్షము
ఘనత ప్రద మయి ఘటించు భారతమాయున్.

... జవానిలోల్లసిత వీచి
ప్రసార చాలన విభ్రాంత ... సృష్టి
లగ్ని విహార గంధర్వ కోలాహలముగ
... వెడవి వారి కింత విశ్రాంతి నిమ్ము
వసుధ యెల్ల పరీధావి వత్సరంబ

శాంతి భంగంబు కావించు శాత్రవులకు
గర్వ భంగంబు కావించి ఖ్యాత నడవి
శౌర్య కూర్పుము మావీర సుభట తతికి
శుభము కూర్పుము భారతక్షోణి ప్రజకు.

# 1970-71 సంవత్సరంలో ప్రణాళికా ప్రగతి

1970-71 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రణాళిక పథకాలకు నిర్దేశించిన పెట్టుబడిలో రాష్ట్రంలోని ఆర్థికాభివృద్ధికి ఉద్దేశించబడిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై 1971 మార్చి ఆఖరి వరకు 97% ఖర్చు చేయడం జరిగింది. 1970-71 ప్రణాళికా పెట్టుబడుయిగా రూ. 86.68 కోట్లు నిర్దేశించబడింది. ప్రాంతాల వారిగా కోస్తా ఆంధ్రలో రూ. 35.35 కోట్లు, రాయలసీమకు రూ. 17.62 కోట్లు తెలంగాణాకు రూ. 33.71 కోట్లు కేటాయించబడగా, యీ ప్రాంతాలలో కోస్తా ఆంధ్రలో 96.5%, రాయలసీమలో 89,6% తెలంగాణాలో 101.1% ఖర్చు చేయబడింది.

## వ్యవసాయ ఉత్పత్తి

1970-71 సంవత్సరంలో యీ పద్దుక్రింద రు. 121.71 కేటాయించారు. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులను ఎక్కువ చేయడానికి నిర్దేశించిన వివిధ కార్యక్రమాలకు యీ మొత్తాన్ని ఖర్చుచేశారు. అధిక దిగుబడి రకాల కార్యక్రమం క్రింద రాష్ట్రములో 1970-71 సంవత్సరంలో 20.28 లక్షల ఎకరాలను లక్ష్యంగా నిర్ణయించబడగా 16.5 లక్షల ఎకరాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించడం జరిగింది. అధిక దిగుబడి రకాల వంగడాలను పంపిణీ చేయడానికి తీవ్రంగా కృషిజరిగింది. దాని ఫలితంగా 22.76 టన్నుల మేలురకం విత్తనాలను పంపిణీచేయడం జరిగింది. మేలురకం విత్తనాల పంపిణీ లక్ష్యానికి మించి నూరు టన్నులు అధికంగా జరిగింది.

## చిన్నతరహా నీటిపారుదల

చిన్నతరహా నీటిపారుదల క్రింద రాష్ట్రంలో 17,092 లక్షల ఎకరాల విస్తీర్ణానికి నీటిపారుదల సౌకర్యం కల్పించారు. భూగర్భజలాలను వినియోగించుకొనే దృష్టితో రాష్ట్రంలో 1970-71 సంవత్సరంలో 3,048 గొట్టపు బావులను త్రవ్వారు. దీనిద్వారా అదనంగా 9,144 ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం కల్పించారు. 1970-72 సంవత్సరంలో 16,000 మామూలు సేద్యపు బావులను త్రవ్వాలని నిర్దేశించబడగా, లక్ష్యాన్నిమించి 17,145 బావులను త్రవ్వడం జరిగింది. 52,435 ఎకరాల భూమికి సేద్యపు నీటి సౌకర్యం జరిగింది. రాష్ట్రంలో యిదేకాలంలో 5,000 ఆయిల్ యింజన్లను ఏర్పాటుచేయాలని ఉద్దేశించబడగా 4,506 ఆయిల్ ఇంజన్లను ఏర్పాటుచేశారు. వాటికితోడు రాష్ట్రంలోని వివిధ గ్రామాలలో 4,083 విద్యుచ్ఛక్తి మోటారు పంపుసెట్లను నెలకొల్పారు.

## ఆయకట్టు అభివృద్ధి

ఈ పద్దుక్రింద వివిధ ప్రాజెక్టు ప్రాంతాలలో ఆయకట్టు అభివృద్ధికై రు178.58 లక్షలు కేటాయించారు. లక్ష్యానికి మించి ఖర్చుచేయడం జరిగింది నాగార్జునసాగరు ప్రాజెక్టు ప్రాంతంలో కుడికాలువ క్రిందవున్న 11.74 లక్షల ఎకరాలు, ఎడమ కాలువ క్రిందవున్న 8.87 లక్షల ఎకరాలలో లోకలైజు చేశారు, పోచంపాడు ప్రాజెక్టుక్రింద 26,500 ఎకరాలకు ఆయకట్టుకు సంబంధించిన కాలువలత్రవ్వకం పని పూర్తిఅయింది.

## పాల సరఫరా

రాష్ట్రంలో 1970-72 సంవత్సరంలో పాడిక్షేత్రాలు పాల సరఫరా పథకాల అమలుకు రు.59 లక్షలు కేటాయించారు. రామభద్రాపురంలోని పాలశీతల కేంద్రం పని ప్రారంభించింది. శ్రీకాకుళం కేంద్ర నిర్మాణాన్ని చేపట్టారు. శ్రీకాకుళం కేంద్రానికి సంబంధించిన బల్క్ కూలర్లను కొనుగోలు చేయడం జరిగింది. విజయవాడలోవున్న పాలపొడి ప్రాజెక్టులోని బొగ్గుతో నడిచే బాయిలర్లను ఒక లక్షరూపాయల ఖర్చుతో నూనెతో నడిచే బాయిలరుగా నిర్మించడానికి ప్రతిపాదించారు. ఈ ఫాక్టరీలో రు. 1.50 లక్షల ఖర్చుతో పిల్లల ఆహారం తయారి యూనిట్‌ను నెలకొల్పడానికి ప్రతిపాదించారు.

1970-71లో పాలవెల్లువ కార్యక్రమంక్రింద విజయవాడతో పాటు గుంటూరు, మచిలీపట్టణం, ఏలూరు, తెనాలివంటి ఇతర పట్టణాలలో స్థానిక అవసరాలను ఆదుకొన్న తరువాత విజయవాడ నుండి మద్రాసుకు పాలసరఫరా చేయడం ప్రారంభించారు.

కర్నూలులో పాడి క్షేత్రాన్ని ఏర్పాటుకు సంబంధించిన స్థలం ఎంపిక పూర్తిచేశారు. సివిల్ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. కొన్ని యంత్రపరికరాలుకూడ కొనుగోలు చేయడం జరిగింది. అనంతపురంలోని పాల శీతల కేంద్రానికి సంబంధించిన బల్క్ కూలర్ కొనుగోలు చేయబడింది. సివిల్ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. హైదరాబాదులోని కేంద్ర పాడి క్షేత్రంలో రెండవ బాటలింగ్ లైన్ ఏర్పాటు చేయడం ద్వారాను, ఐస్‌ప్లాంట్ ఏర్పాటుచేయడం ద్వారాను దానిని పటిష్టం చేయాలని ప్రతిపాదించారు. నిజామాబాదులోని పాల శీతల కేంద్రాన్ని అన్ని హంగులతో దాదాపు పూర్తిచేశారు. మెదక్‌లోని పాలశీతల కేంద్రం పని ప్రారంభించింది. భువనగిరిలోని పాలశీతలకేంద్రం 1969-70లో రోజుకు 8000 లీటర్లపాలను నిర్వహించగా యీ సంవత్సరం

16,000 లీటర్ల పాలను నిర్వహిస్తుంది. హైదరాబాదు నగరంలో అల్పాదాయ కుటుంబాలకు సబ్సిడీ పాలసరఫరా ఏర్పాటును కొనసాగిస్తున్నారు. దిగువ పేర్కొన్న పాల కేంద్రాలు క్రిందివిధంగా పాల సరఫరాను నిర్వహిస్తున్నాయి. విజయవాడ 72,160 లీటర్లు; హైదరాబాదు 60 000 లీటర్లు; [illegible] 6 700 లీటర్లు.

## మత్స్యపరిశ్రమ

రాష్ట్రంలో 1970-71 లో మత్స్య పరిశ్రమ అభివృద్ధి కార్యక్రమం క్రింద రూ. 10.57 లక్షలు ఖర్చుచేశారు. కోస్తా ఆంధ్ర ప్రాంతంలో 27 పడవలకు యంత్రపరికరాలు అమర్చారు. రాష్ట్రంలో 105 లక్షల ఫింగర్‌లింగ్స్ పంపిణీ చేశారు. రాష్ట్రంలో చెరువు కుంటలలో లభించే 78 టన్నుల మరియు కోస్తా ఆంధ్రలోని సముద్రతీరంలో 160 టన్నుల చేపలను విక్రయించటం జరిగింది. ఎండు రొయ్యలను అమెరికాకు ఎగుమతి చేయడం జరిగింది.

## సహకారశాఖ

1970-71 లో సహకార రంగంలో గణనీయమైన అభివృద్ధి సాధించ బడింది. రాష్ట్రంలో 1971 మార్చి ఆఖరునాటికి వివిధ సహకార కార్యక్రమాల క్రింద 137.45 లక్షలు ఖర్చుచేశారు. వ్యవసాయ పరపతి సంఘాలలో సభ్యత్వానికి సంబంధించి 1970 మార్చి ఆఖరునాటికి 31.33 లక్షల మంది సభ్యులుగాయున్నారు. 1970 సంవత్సరంలో 66.700 మంది క్రొత్తగా సభ్యులుగా చేరారు. తత్ఫలితంగా 1971 మార్చి ఆఖరునాటికి మొత్తం సభ్యుల సంఖ్య 32 లక్షలకు చేరుకొంది. వ్యవసాయాభివృద్ధి నిమిత్తం స్వల్ప కాలిక, మధ్యకాలిక రుణాలరూపంలో, సహకార సంఘాల ద్వారా 25 కోట్లు పంపిణీ చేశారు.

## గ్రామీణ విద్యుద్దీకరణ

1970-71 లో ప్రణాళిక, ప్రణాళికేతర కార్యక్రమాల క్రింద అదనంగా 950 గ్రామాలు 16 కుగ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరాచేశారు. తెలంగాణాలో అదనంగా 125 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేశారు.

## పరిశ్రమలు

రాష్ట్రంలో 1970-71 సంవత్సరములో భారీ పరిశ్రమలు, మధ్య తరహా పరిశ్రమల నిమిత్తం రు. 199.19 లక్షలు కేటాయించబడగా యీ సంవత్సరములో రు. 118 లక్షలు అనగా 70 శాతం మేరకు ఖర్చు చెయడం జరిగింది. రాష్ట్రంలో ఖనిజ సంపద అభివృద్ధి నిమిత్తం: విజయవాడ, విశాఖపట్టణం సర్వే పనుల నిమిత్తం ఖనిజ సంపద రు. 2.48 లక్షలు ఖర్చుచేశారు. 1970-71లో చిన్న తరహా పరిశ్రమల నిమిత్తం 51 లక్షలు కేటాయించారు. రాష్ట్రంలో 20 సాంప్రదాయక పారిశ్రామిక వాడలు 15 సహాయక పారిశ్రామిక వాడలున్నాయి.

## గ్రామీణ నీటిసరఫరా

1970-71 లో పైపుల ద్వారా నీటి సరఫరా, మామూలు బావుల ద్వారా నీటి సరఫరా పథకాల క్రింద రు. 159.75 లక్షలు కేటాయించారు. పైపుల ద్వారా నీటి సరఫరా పథకం క్రింద ఆంధ్ర ప్రాంతంలో 25,000 జనాభా గల ఐదు గ్రామాలకు, తెలంగాణా ప్రాంతంలో 35,000 జనాభాగల ఆరు గ్రామాలకు నీటి సరఫరా జరిగింది. అదే సంవత్సరంలో మామూలు బావుల ద్వారా నీటి సరఫరా క్రింద ఆంధ్ర ప్రాంతంలో 3.10 లక్షల జనాభాగల 620 గ్రామాలలోను తెలంగాణా ప్రాంతంలో 2.65 లక్షల జనాభాగల 530 గ్రామాలలోను, నీటిసరఫరా జరిగింది.

## బడుగు వర్గాల సంక్షేమం

1970-71లో రాష్ట్రంలో షెడ్యూల్డు కులాలు, యితర వెనుకబడిన తరగతుల సంక్షేమ కార్యక్రమాల నిమిత్తం రు.23.30 లక్షలు ఖర్చుచేశారు. రాష్ట్రంలో 734 మంది విద్యార్థులకు ప్రీమెట్రిక్ స్టయిపండ్‌లు, స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయబడినాయి. ఈ సంవత్సరంలో ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారికి ఉద్దేశించబడిన 29 ప్రభుత్వ హాస్టళ్ల నిర్వహణ కొనసాగించబడింది. షెడ్యూలు జాతుల సంక్షేమానికి రు. 123.58 లక్షలు ఖర్చుచేశారు. రాయలసీమలో 1, తెలంగాణాలో 5, ఆశ్రమ పాఠశాలల నిర్వహణ కొనసాగింప బడింది. 951 మంది, విద్యార్థులకు పుస్తకాలు, పలకలు, దుస్తులు సరఫరా చేశారు. ఎరుకల, యానాది, సుగాలీలకు చెందిన 308 కుటుంబాలకు యిండ్లు నిర్మించారు. వాటితోడు, నాగటి పశువులను సరఫరాచేశారు.

# ఆహార ధాన్యాలను దుబారా చేయకండి

# జానపదం....జ్ఞానపథం

రావూరు వెంకట సత్యనారాయణరావు

"కళ ఆనందానికికాదు, వినోదానికికాదు, కాలక్షేపానికికాదు. కళ జీవితంలో విడదీయలేని ఒక అవయవం" అన్నాడు టాల్‌స్టాయ్.

అలనాటి జానపద జీవితంలోకి తొంగిచూస్తే ఈ సత్యం ఎంతగానో గోచరిస్తుంది. ఎన్నో విషయాలు బోధిస్తుంది. ఆనాటి గ్రామీణ జీవితంలో కళకు దూరమైనక్షణం ఏంవుండేది ! ప్రతి గ్రామం ఒక చక్కనిపువ్వుల పాలవెల్లిలా గోచరించేది.

ఊరిచుట్టూ చక్కని కోనేరులు, వాటివొద్దనో, గ్రామానికి నడిబొడ్డునో చక్కని దేవాలయం. దిగంత దూరంలో పకపకలాడుతూ పరుగులుతీసే పంట కాల్వలు. మరికొంత దూరంలో పెద్ద కాలువ కదులుతుంటుంది. అందులో నావలు తెరచాపలు విప్పుకొని పరుగులు తీస్తుంటాయి. సరుకులు మోసుకు వచ్చి సంతలు చేయిస్తూవుంటాయి. బంధుమిత్రుల్ని తీసుకువచ్చి వింత వినోదం కల్పిస్తూ వుంటాయి.

ఊరి చెరువు ఒడ్డున ఊడలు దిగిన మర్రి, పచ్చని గుడారాలు కల్పించే రావిచెట్లు, అటుప్రక్క ఎర్రతంగేడు, ఇటు తెల్లగన్నేరు, సూర్యోదయం అవగానే విచ్చి వికసించిన రకరకాల రంగురంగుల తామరలు, వాటిపై మూగే కొంటె తుమ్మెదలు. ఎక్కడినుంచో హఠాత్తుగావచ్చి వ్రాలి చిరుచేపల ఫలహారానికి రాపత్రియపడే నీటి కొంగ...

## చిరు కెరటాలపైన తామరల ఉయ్యాల

కొలనులో నీళ్ళు గాలికెరటాలకు అలలుగాసాగి, తామరలను తమ చిరు కెరటాలపైన ఉయ్యాల లూగించటం... నీటికోసం వచ్చిన వయ్యారులు యింటికి త్వరగావెళ్ళడం యిష్టంలేక కడవలతో నీటిని మరింతగా కదలిస్తూ నీళ్ళలో కదిలే తమ ప్రతిబింబాలను చూసి మురుసుకొంటూ, మధ్యమధ్య ప్రొద్దెక్కిందనే భయంతో నాలిక కరచుకొని నవ్వుకోవటం... సరసమున్న పిల్లపైన సంబరంగా నీళ్ళు చిమ్మటం...గతరాత్రికి చెందిన మధుర స్మృతులను కంటి రెప్పల మడతల్లో దాచుకొని, కొలను అందాన్ని గోముకోవడం— ఎన్ని మనోహర భావాలు !

పడుచులు వడివడిగా నీళ్ళుమోసుకొని పరుగు లెత్తుతుండగా కాలి అందెల చప్పుళ్ళు ఒక్కశృతిలో, చక్కని లయలో విని పిస్తుంటే, వారు హొయలు ప్రదర్శిస్తూ అప్పుడప్పుడు చూపులు పైకెత్తి సిగ్గు తెరలను చించడానికి చేసే ప్రయత్నాలు, పురుష తెదురైతే దారివదిలి ప్రక్కపుంతలో అందంగా, అర్ధచంద్రాకారంగా తిరిగి మళ్ళీవచ్చి బాటలో కలవడం రాగాలాపనచేసి మళ్ళీపాటలోకి రావడంలాగా ఎంతో హాయిగా తోచడం, అత్తలు జ్ఞాపకం వచ్చి నప్పుడు అందెలు మరింతగా చెదిరి మ్రోగడం—ఇవన్నీ ఎంత మనోహర దృశ్యాలు !

'నీలాటిరేవు' నిత్యజీవితంలో ఎంతో అపూర్వశోభను సమకూరుస్తుంది. స్నేహితురాండ్రను కలుసుకోవడానికి ఎంతో అవకాశమిస్తుంది. ఆ ఉత్సాహంతో పనిలోవున్న బరువునే మరచిపోయి తూనీగల్లాగా ఎగిరిపోతూ వుంటారు పడుచుకత్తెలు. అందువల్లనే కాబోలు 'భుజానబిందె ! కాలుకింద చిందూ' అనే సామెతవచ్చింది.

## అందెల గలగలలు–పకపకల సితారాలు

ఆ సమయంలో వారి మాటలే పాటలుగా వినిపిస్తాయి. కాదు అవి అలా మారిపోతాయి. వారి అందెలు, గాజులు కదిలి కమ్మటి శృతి కల్పిస్తాయి. పకపకలు ఆపిఆపి అదనుచూసి వినిపించితే 'సితారా' లాగా శబ్దించేస్తాయి. వారి జీవితాలు రాగమయం ! 'భోగమయం'! అన్నిటినీ మించి కళామయం ! ! !

"కోనేటి వొద్దునా
కులికేవు కోడలా !
కళ్ళిప్పి చూసేవు
కుండలో నీళ్ళన్ని
కోనేట వదిలేసి
కొండొంక చూసేవు
గొప్పగా నవ్వేవు !
ఏ మాట మెదిలిందె నీలో !
ఏ పాట కదిలిందె నీలో !
క్రొత్తా కోడల నీకు
అత్త భయమే లేదు !
ఇంటిదారీ బట్టు
ఓ కొంటె పడుచా !"

ఇలాటి నీలాటిరేవుకు చెందిన పాటలు మన జానపద సాహిత్యంలో చాలావున్నాయి. ఉదయరాగంలో ఊరి పడుచుల సరాగాలు, పరామర్శలు, వాని వరుసలూ ఒక అందమైన ఆశ్వాసంగా మిగిలిపోతాయి—అనంతమైన జానపద మధుర కావ్యంలో.

నీలాటి రేవు తర్వాత గ్రామజీవనంలో మరో అద్భుతమైన దృశ్యం 'ఊరుబావి' ఊరి బావిదగ్గర ఉవిదలు చెప్పే ఊసులలో ఆ గ్రామచరిత్ర అంతా సంక్షిప్తంగా ఏ రోజు కారోజు వర్ణించ బడుతుంది. ఆ విమర్శలలో కొందరు కళావైదుష్యాన్ని వెలి బుచ్చుతూ వుంటారు. వారికి వంత పాడేవారిని సంతరించు కొంటారు. ప్రతిరోజు వారి కచ్చేరి యధాలధంగా సాగవలసిందే.

## మంచినీళ్ళబావి-ముగువల మంతనాలు

వారు మధ్యమధ్య వేసేవాక్యాలు ఏంతో అందంగా, భావ స్ఫోరకంగా, వ్యంగ్యంగా, గుండెల్లో రంగరింపులుగా వుంటాయి. ఏదో విషయం చెప్తూ చెప్తూ ఆపివేసి "నవ్వెందుకోస్తోందే నీకు నాగమ్మా" అంటూ వుంటారు. "అందరు త్రాగేది ఈ నూతి నీళ్ళే నువుచే పిచ్చెమ్మా" అని ప్రశ్నిస్తూవుంటారు. ఒకనూతి నీళ్ళే అయినా యిన్నిరకాల బుద్ధులెలా వచ్చినాయి అని ప్రశ్నించడం, ఆశ్చర్యపోవడం వున్నదా మాటలో! "వేస్తు వన్నిన రావిచెట్టే విరిగేటకు పడిపోతుంది. ఏళ్ళువచ్చిన మనుషులెక్కడ నిలుస్తారే లులసమ్మా" — ఇలాటి వేదాంత వాక్యాలుకూడా ఆరి తేరిన అమ్మలక్కలనుంచి వినిపిస్తూవుంటాయి.

బావిచుట్టూ ఎర్ర కడవలు
కడప కడవను
పడచు కత్తెలు
ఊరుబావి గట్టు నెక్కి
నీరుతోడే కుర్రవాడా
జోరుచేసి తోడబోకు
జారి పడిపోయేవు!
ఓ కొంటెవాడా
ప్రక్కచూపు చూడబోకు
బావి పిందెవు

— ఇలాటి పాటలు వినిపిస్తూవుంటాయి గ్రామాలలో. అందరూ నీటికోసం నిలబడివుండగా ఊళ్ళోవున్న పడుచువాడు పరోప కారంకోసం బయలుదేరి వస్తాడు. సాకు పరోపకారంకని. అసలు విషయం—సరసం. ఎవరికిముందు నీరుఅందిస్తే వారు అభినందించ దం, ఆలస్యమైనవాళ్ళు పరుసను పట్టి ఆక్షేపించడం అన్నీ అత గాడికి సమంగానే వుంటాయి. ఆ సంతోష సమయంలో, "ముస లాళ్ళకే నేను ముందు సహాయంచేస్తా" అంటూ వారిమీద భక్తి భావాన్ని ప్రకటిస్తాడు. పడుచువాళ్ళను ముందు పంపిస్తే బావి బావురుమంటుందని అసలు అభిప్రాయం.

మనకో మంచి పాతపాట వుంది.—భల్ మోహనరంగా పల్లవిలో. ఎందరో—

"మరు మల్లె తోటలోన
మంచినీళ్ళ బావికాడ
నీ చెంగుగోంగట
ఎరిపిస్తివి ఎదిరా
ఓ నా మోహనరంగా
ఏడు గిరాటీ
పెరిమెస్తిని ఎదిరా"

— అని పాటలో ఒక భాగమిది. చూడండి, ఎంత అందమైన సాంకేతికమో. మరుమల్లె తోటకంటె అందమైన తావు ఏం వుంటుంది? వెన్నెల రంగిరాలు మరిచి వచ్చాననే సాకు. దాంతో సరసం—పుష్పాలోని పేటు పసందుచెప్పి మల్లెపూల తెప్పమీద తేలి పోదామని చెప్పారు. నీమానాకూ జోడు కలసిందని ఏదో పెద్ద సత్యం చెప్పి ఒప్పించడం. పాట అంతా పూల పరిమళం. స్పందించిన లేతహృదయంలో చిందించిన మధురవళి. ఎంతకళా జ్యోత్స్న వెదజల్లాడు రసికుడు ఈ మాటలో! రచించి జానపద జీవనానికి అంకితం చేశాడు!

గ్రామ జీవనంలో ఎటు తిలకించినా కళలు, గానం, నృత్యం దర్శనమిస్తాయి. ఊరిలోవున్న గుడిదగ్గర కెడదాం. గుడి చుట్టూ పచ్చగన్నేరులు. ఒకప్రక్క పొన్న. ఒకప్రక్క మారేడు మరొకప్రక్క వేలేను. సింహద్వారానికి రెండుప్రక్కలా బావంచెట్లు. వెతుక్కోకుండా దేవుడి ప్రసాదానికి పచ్చని పళ్ళాలందిస్తాయి బాదంచెట్లు. అక్కడవున్న ప్రతిచెట్టూ పువ్వులు, పత్రి, ఆకులు దైవార్చనకు అందించి పుణ్యం సంపాదించుకుంటాయి.

ధ్వజస్తంభం చిరుగంటలు గాలికి కదిలి కమ్మటి ధ్వనులంది స్తాయి గుడిలో గంటలు మనసుల్ని స్వామివైపు మళ్ళిస్తాయి. గాలిగోపురం మీద జంటలు జంటలుగా వ్రాలిన రామ చిలుకలు పచ్చని రెక్కలు విప్పుకుని ఏటోరహస్యాల్ని చెప్పుకొంటూ వుంటాయి. మరోప్రక్క గువ్వల గుసగుసలు, మధ్యమధ్య పాల పిట్టల పల్కులు ఈ సుందర దృశ్యాలు కవనానికి పంటలు. చిత్ర కారుని బొమ్మకు రంగులు. గాయకునకు గొంతులో మెదిలే రాగ మాలికలు.

ఉభయ సంధ్యలలో చక్కటి భజనలు, అంతులేని భక్తి పార వశ్యాలు, ఆలయంలో నిలిచి ఆలకించే స్వామికి ఆభ్యర్ధనలు. గుడిచుట్టూ ఆగానాయి పదయాలు తిరిగి చీకటి హృదయాలను కూడా చీల్చుకొని రోవం ప్రవేశిస్తూ వుంటాయి. జన్మరాహిత్య తత్వానికి చిత్తగాలు వేస్తూ వుంటాయి.

## పరమాత్ముని తో బాంధవ్యముద్రి

యొగపుటెక్కు చిగురు రంగులు పూసుకొనక ముందే భక్తులు మండపంలో చేరి తాళాలు చేత పట్టి

"ఎడమున్నాడో వాని
జాడతెలియగ రాదు
నాడు గజేంద్రుని

కీడు బాపిన సామీ ॥ ఎడ
వాపాలి రంగడు
నను కన్న తండ్రీ ॥ ఎడ ॥
పాంచాలి సభలోన
భంగమొందిన నాడు
వంచనా లేకను
వలువ లిచ్చిన సామి ॥ఎడ ॥

అనే పాట పాడుతూ తాళాలు మారుసూ తన్మయత్వంలో పడుతూ భజన చేస్తుంటే ఊరంతటినీ మేల్కొలిపినట్లు, భగవంతుని అన్వేషణలో పాల్గొనమని హెచ్చరిస్తున్నట్లు ప్రతి హృదయంలో అమృతం చిలికిస్తున్నట్లు పరమాత్మునితో బాంధవ్య ముద్ర కల్పించు కొంటున్నట్లు ఎంత హాయిగా వుంటుంది! ఆలయంలో భజనలు గ్రామానికి శ్రీరామ రక్షలు.

వర్షకాలంలో వ్యవసాయపు పనులు తగ్గి భగవంతునివైపు మనసు మొగ్గి, రాబోవు పంటలలో రాలుబడికి చేసే ప్రార్థనలాగా రాత్రిపూట మసు వెన్నెలలో గ్రామస్థులు చెక్క భజనలు, కోలాటాలూ సాగిస్తూ వుంటారు—

దణ్ణాలు దణ్ణాలు
నీకు రామయ్యా !
సీతమ్మా !
చల్లంగ చూడాలి
రామయ్యా !
చక్కంగా బ్రోవాలి
సీతమ్మా !
పంటల్లు పండాలి
బంగారు రామయ్యా !
మా యిల్లు నిండాలి
సింగారి సీతమ్మా"

అంటూ ఎంతో శ్రద్ధగా పాటలుపాడుతూ వుంటే ఆ చిరతల చప్పుళ్ళ గుచ్చెళ్ళతో ధాన్యం తెచ్చి అక్కడ గుమ్మరిస్తున్నట్లే వుంటుంది. మనస్సు భక్తితో అటువైపు వ్రాలుతూనే వుంటుంది.

## సమూహగానంలో మోహన వంశీరవాలు

ఒకొక్కప్పుడు చెక్క భజనలు చేస్తూవుంటారు. ఆధ్యాత్మ రామాయణ కీర్తనలు ఎంతోహాయిగా పాడుతూవుంటారు. ఆ సమూహగానంలో వంశీమోహనుని మురళీధ్వనులు అప్పుడప్పుడు వినిపిస్తూవుంటాయి. అన్నిదిక్కులకు మధుర మురళీ రవళిని మోసకు పోతూవుంటాయి. ఆ గానంలో గ్రామం హాయిగా ఊగి ఊగి నిద్రపోతూవుంటుంది. ఎంత మధురగానం! నిజంగా అది ఒక మధురస్వప్నం. గ్రామజీవనంలో ఒక స్వర్ణాధ్యాయం.

ఎక్కడ చూచినా సౌందర్యంగా, గానం అల్లిబిల్లిగా అల్లుకుపోతాయి జానపద జీవితంలో. పనులు చేస్తుండగా చక్కని పాటలు. వాటిలో చక్కని వేదాంతం. తెల్లవారుఝామున గృహిణి లేచి చల్ల చిలికేటప్పుడు ఎంతచక్కగాపాడుతుంది!

"గుమ్మడేడే కన్నతల్లి
గుమ్మడేడే గోపిదేవి
గుమ్మడిని చూపించ
గదవమ్మా అమ్మ గోపమ్మా"

అంటూ పాడేపాటలో కృష్ణలీలయూ, కృష్ణావతార మహిమలు అన్నీ ద్యోతక మవుతాయి. బాలకృష్ణుడు బానలోనుంచి నవనీతం ఎత్తుకుపోరాదనీ అతణ్ణి భయపెట్టడానికి అందులో గుమ్మడున్నదని చెపుతుంది. అవిశ్వ పురుషుడితోనా ఆటదాలు! అతడు అవతార మహిమలన్నీ చెప్పి గుమ్మడనేవాడిని ఎక్కడా చూడలేదు చూపించ మంటాడు. పాపం యశోద అబద్ధమాడినందుకు ఎంతో నొచ్చుకుంటుంది. అతణ్ణి పిలిచి ముద్దాడి వెన్నముద్దలందించి మురిసి పోతుంది.

ప్రత్యూష సమయంలో పరమాత్ముని అవతార వర్ణనలెంత అద్భుతంగా వుంటాయి! ఎలాటి అమృతాన్ని చిలకరిస్తాయి!

ఈ నాడెక్కడ వినిపిస్తున్నాయి ఇలాటి పాటలు? అసలు పాడి కల సంసారా లెన్ని వున్నాయి? పాలు చిలికే తల్లు లెక్కడ వున్నారు?

ఇది పాలపీపాల యుగం. డిపోలయుగం. సీసాలయుగం. చిద్విలాసాలయుగం. శ్రీకృష్ణుడీనాడు అవతరిస్తే తెలిసేది ఆయన గారి నవనీత చోరత్వం. ఈ నాగరిక యుగంలో పాతపాటలకు, సంప్రదాయాలకు హుళక్కి.

గ్రామజీవనంలో గృహాలు చాలా అలంకారంగా వుండేవి. తలుపులకు కిటికీలకు స్తంభాలకు జేగుర్లు, గుమ్మాలకు పసుపు కుంకుమలు, పైన పువ్వుల తోరణాలు, ఇంట్లో నవ్వుల తోరణాలు, ముంగిట్లో అందమైన ముగ్గులు అన్నిటిలో కళకు సంబంధించిన నిగులు, వాకిట్లో పాదులు చెట్లు పూలమొక్కలు విచ్చిన బీరపువ్వులు గోడపై పెచ్చిన గుమ్మడి పూలు గోడవెంబడి రకరకాల బంతి పూలు, ముద్దు కాంత పువ్వులు తెల్లవారేటప్పటికి విచ్చి వినూత్నకాంతులతో మిలమిల్లుతూ వుంటాయి విభావరిని ఆహ్వానిస్తూ వుంటాయి.

## అపురూపపు కొంటుల్లో అరవిందస్తోత్రం

చూడండి, అలాటి సమయంలో ఒక ముసలిముత్తైదు, తూర్పు దిక్కున బండి చక్రమంత ప్రొద్దు ఉదయిస్తుంటే నుదురున రూపాయంత కుంకుమ బొట్టు దిద్దుకొని, పరికిణీ వల్లె వాటుతో పడుచుల నానికి స్వాగతమిచ్చే మనుమరాలిని తోడు చేసుకుని బాలభానునిగురించి యుగగీత మెలాపాడుతున్నదో—

" పుట్టేటి భానుడా, పుష్యరాగపుఛాయ
శ్రీసూర్యనారాయణా!
పుష్యరాగము మీద పొంగు బంగరు ఛాయ
శ్రీసూర్యనారాయణా!
జామెక్కి భానుడూ జాజి పువ్వుల ఛాయ
శ్రీసూర్యనారాయణా!
జాజిపూవులమీద సంపెంగపువ్వు ఛాయ
శ్రీసూర్యనారాయణా!
మధ్యాహ్న భానుడా మల్లెపూవుల ఛాయ
శ్రీసూర్యనారాయణా!
మల్లెపూవులమీద మంచి వజ్రపు ఛాయ
శ్రీసూర్యనారాయణా!
మూడ్జాముల భానుడా మునగపూవుల ఛాయ
శ్రీసూర్యనారాయణా!
మునగపువ్వుల మీద ముత్యాల పొడి ఛాయ
శ్రీసూర్యనారాయణా!
క్రుంకేటి భానుడా గుమ్మడీ పువ్వు ఛాయ
శ్రీసూర్యనారాయణా!
గుమ్మడీ పువ్వుమీద కుంకంపు పువ్వుఛాయ
శ్రీసూర్యనారాయణా!
ఆయురా రోగ్యములు ఐశ్వర్యముల నిమ్మ
శ్రీసూర్యనారాయణా!"

ఈ ఆదిత్యుని ప్రార్థనలో అద్భుతమైన భావన, అతి మధురమైన ఫణితీ, ఆర్ద్రత కల్పించే అనునయం అల్లి బిల్లిగా అల్లుకొని వుంటాయి.

ఆపూలవన దృశ్యంలో ఆ మగువల గొంతులనుంచి వెలువడే మధుర స్వనాలు మింటికి అందావా అనిపిస్తుంది. ఇలాటి పాటలు రేడియోలలో, సినిమాలలో ఎక్కువగా వినియోగిస్తే ఎంత సంతోషంగా వుంటుంది!

ఇళ్ళల్లో ఎక్కడ చూచినా కళాలక్ష్మి దర్శన మిస్తుంది. నిత్యం ఉపయోగించే పరికరాలలో 'దిసి' తనం ఎక్కడా కనిపించదు. అన్నిటా శిల్పం గోచరిస్తుంది. అందువల్లనే ఒక విదేశస్థుడు ఉప్పొంగి యిలా చెప్పాడు. "శిల్పం భారతీయుల నిత్యజీవితంలో ముప్పిరి గొన్నది. కంటికీ మనస్సుకీ ఎంతో శాంతి నిస్తుంది. కొన్ని కొన్ని సందర్భాలలో కవిత్వ తరంగాలు సృష్టిస్తుంది. కొన్ని సందర్భాలలో గొంతెత్తి పాడాలని పిస్తుంది. అన్నిటా కళాలక్ష్మి మూగగా దాగి దోబూచులాడుతుంది" అని.

ఇంటి గుమ్మాలకు లతలు, పద్మలు, చారలు ఎన్నో చెక్కి వుండేవి. ఇంటి దూలాలకు పద్మాలు, చిలకలు కనిపించేవి. చెంబాల మీదా, గిన్నెల మీదా, బిందెల మీదా పువ్వులు, చిలకలు, సన్నని గీతలతో అలంకారాలు — ఎంతగానో మురిపించేవి. పవళించే మంచానికి ఎన్నో శిల్పాలు, పువ్వుల గుత్తులు, ద్రాక్షగుత్తులు, కొన్ని కొన్నిటి మీద దశావతారాలు, అవి దంపతులచిత్రాలు, కృష్ణ లీలల చిత్రాలు ఎన్నో కనిపించేవి.

ఎటు చూచినా శిల్పం. జీవితంలో శిల్పం ఒక సత్యాన్ని ఋజువు చేస్తూండేది. అడకత్తెరలో ఎంతశిల్పం! పైన చక్కటి చిలుక. పోకల్ని చిలుక కత్తిరిస్తోందా, అలి వేణి కత్తిరిస్తోందా అన్నట్లుండేది. స్నానం చేసే కుర్చీపీట మీద శిల్పం. ధ్యానం చేసే పీటనిండా శిల్పం. ఎక్కడోలేదు శిల్పం ప్రతిప్రవృత్తిలో శిల్పం ఒక ఉత్తమ పదవి నలంకరించి కళాలక్ష్మికి ఉడుగరలందిస్తూ వుండేది.

సంసారాలలో ఎప్పుడూ ఎన్నో పకపకలు, నడకల్లో అంతులేని చకచకలు శ్రమ జీవితంలో వరాలుగా భావించవచ్చు. ప్రతి స్త్రీకి కొన్ని పాటలు నోటికి వచ్చి తీరేవి. ఆ పాటల కోసం పెద్దలవద్ద శిక్షణ పొందేవారు. ఒక్కొక్క పాట ఆనాడు ఒక ముత్యాల మూట.

ఒకసారి పొరుగూరిలోవున్న బంధువుల యింటికి వెళ్ళాను. సందె దాటి చలువ వెన్నెల కురియ నారంభించే వేళఅది. వారింటి పెరటిలో అడుగు పెట్టాను. లోపలనుంచి యీ పాట వినిపించింది.

లోకమ్మువారికీ రెండు కన్నుల్లు
లోకరక్షక నీకు వేయి కన్నుల్లు
ఇద్దరూ పెళ్లాలు ఈశ్వరుడ నీకు
పలువరుస చక్కనిది పార్వతీ దేవి
కన్నుల్లు చక్కన కనకదుర్గకును
ఇద్దరూ పెండ్లాము లేలయ్య నీకు
ఎద్దెక్కి తిరిగేవు ఈశ్వరుడ నీవు
బిచ్చమెత్తిందాక బిడ్డలకులేదు
అడిగి తెచ్చిందాక ఆలికీలేదు

## గుండెల్లో వెన్నెల వాన
## మనసులోన మల్లెల సోన

పాటంతా విన్నతర్వాత లోపలికి వెళ్ళాను వారు దిగ్గున లేచి పలుకరించారు. వారి పాటను నేనెంతో అభినందించాను. 'ఇదేం గొప్పపాట, రోజూ పాడుకొనేదే. మాకేం సంగీతశాస్త్రం వచ్చా? చక్కని గొంతుకలున్నాయా? ఏదో, తోచక పాడుతూ వుంటాం. ఆపరమేశ్వరుణ్ణి గురించిన పాట గనుక పాపాలు తొలగి పోతాయని పాడుకొంటాం" అని ఎంతో నమ్రతగా చెప్పారు. వారేమి చెప్పినా ఆపాట మనసులో వెన్నెల వాన కురిపించింది అలాటిదివ్యమైన సంస్కృతి మన జానపద జీవితంలో నిండుగా గోచరిస్తుంది. ప్రతిరోజూ మనకు పండుగ చేస్తుంది.

జానపద గేయాలు అమాయక హృదయాలలో నుంచి ఉప్పొంగే అమృత తరంగాలు. సరళమైన భాషా, భావనా బలమే

యీ గేయాలకు జీవం. ఇవి నిత్య జీవితానికి నిలువు టద్దాలుగా నిలుస్తాయి. సాంఘికాచారాలు, ధర్మాలు, అనుభూతి, ఆనందం విరహం, వియోగం, వలపూ, పిలుపూ, హాస్యం. శోభ్యం యీ గేయాల్లో ప్రతిబింబిస్తాయి.

చిన్నతనంలో మా మేనమామగారి పూట వెడుతూ వుండే వాణ్ణి. వారి యింటికి దగ్గరగా వేణు గోపాలస్వామి ఆలయం వుంది. సాయంత్రం పూట అందరూ వెళ్ళి అరుగుల మీదా, మండపం మీదా కూర్చునేవారు. ఒక్కొక్క రోజున ఒక ముసలి తాత వచ్చి మండపం మీద కూర్చుని క్షేత్రయ్య పదాలు పాడుతూ వుండేవాడు. ఆయన కంఠంలో ఎంతో మాధుర్యం తొణికిసలాడేది. ఆగానం విని ఎంతో పులకించి పోయే వాళ్ళు అక్కడున్న వారంతా.

॥ఇంతింత మోహ మేమిరా
ఇందరి కంటె ఇంతి చక్కని దేమిరా
సుంత సేపు దాని చూడకుండగ లేవు ॥ఇంత॥

అంతరంగము తెలుప వదియేల ?
మువ్వ గోపాలా ॥ఇంత॥

నీ కెదురుగ వచ్చునా!
నెనరూనగ నిండు కౌగిటజేర్చునా !
ఆకు మడుపు లిచ్చునా
తన చెలిమివైనవాడవని మెచ్చునా, తమిహెచ్చునా
ఏక చిత్రమున మీ రిద్దరు
ఇంపు సొంపుగ నున్న ముచ్చట
నాకు కన విన వేడు కయ్యెరా
ఇపు దాన తీరా ॥ఇంత॥

మోవి పానక మిచ్చునా.
కొసరి కొసరి ముద్దులాడ నిచ్చునా !
తావి పువ్వుల దెచ్చునా
తన సొగసుకు తగిన వాడవని మెచ్చునా, మనసిచ్చునా !
దేవరే మగడు కావలెనని
భావజుని పూజ లొనరించునా
యా వనిత పేరేమి తెలుపీయరా ! సిగ్గేలరా, రారా ॥ఇంత,

—ఈ చక్కనిపాట ఆ తాతగారి నోటవెంట మొదటి సారిగా విన్నాను. ఆ తాతగారినే వెంట పెట్టుకొని మువ్వగోపాలుని దర్శనమునకు వెళ్ళాను. ఆ తర్వాతా ఆపాట ఎన్నో సార్లు శ్రీ శ్రీపాద సత్యనారాయణ గారు పాడగా విని, తన్మయము చెందుతూ ఆ తాతను, క్షేత్రయ్యను తలచు కొన్నాను.

జానపద జీవితంలో అంతటి మధుర గాయకులు అనేకులు దర్శన మిచ్చేవారు. వారు ధన్య జీవులు.

*

---

## గిరిజన పట్టభద్రులకు ఉపాధి లభించేవరకు రొక్కం గ్రాంట్లు

"గిరిజన పట్టభద్రులు, యితర సాంకేతిక అర్హతలుగల వ్యక్తులకు ఉపాధిలభించేవరకు రొక్కం గ్రాంట్లు" యిచ్చే పథకాన్ని ప్రభుత్వం మంజూరుచేసింది.

ఈ పథకాన్ని అనుసరించే షెడ్యూలు తెగలకుచెందిన పోస్ట్ గ్రాడ్యేట్లు, పట్టభద్రులకు ప్రభుత్వ ఉద్యోగంకానీ, ప్రవేటు పబ్లిక్ రంగాలలో ఉద్యోగం కానీ లభించేవరకు నెలకు వరసగా రు. 150 లు, రు. 100 లు రొక్కం గ్రాంటు పొందడానికి అర్హులవుతారు. 1972 ఫిబ్రవరి నుండిగానీ గిరిజన సంక్షేమశాఖ డైరెక్టరువద్ద పేరు నమోదు చేయించిన నెలనుండిగాని ఏదిముందు అయితే ఆ నెల నుండి యీ గ్రాంట్లు లభిస్తాయి.

ఈ రొక్కం గ్రాంటు పొందదలచిన వ్యక్తి ప్రథమంగా తన పేరును ఉపాధికల్పన శాఖలో నమోదుచేయించి ఆ తర్వాత తన విద్యార్హతలు, వయస్సు, షెడ్యూలు తెగల సర్టిఫికెటు, ఉపాధికల్పన శాఖలో నమోదు చేయించిన వివరాలతో కూడిన దరఖాస్తును, రొక్కం గ్రాంటు నిమిత్తం గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టరుకు పంపాలి.

గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టరు అర్హతగల అభ్యర్థుల వివరాల పరిశీలన జరిపిన తర్వాత రొక్కం గ్రాంటును మంజూరుచేస్తారు.

అభ్యర్థులు పేరు నమోదు చేయించిన తర్వాత ఆరునెలలలోగా వారికి ప్రభుత్వ ఉద్యోగం కానీ, పబ్లిక్, ప్రైవేటు రంగాలలోగానీ ఉద్యోగం లభించేవిధంగా గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టరు జిల్లా కలెక్టరు, ఉపాధికల్పన శాఖ సహకారంతో కృషిచేస్తారు.

ఈ అవకాశాన్ని వినియోగించ నిరాకరించే అభ్యర్థులకు రొక్కం గ్రాంటు నిలుపుచేస్తారు.

దరఖాస్తుదారు తన పేరును నమోదు చేయించిన నెలనుండి ఆరు నెలల వరకు మాత్రమే రొక్కం గ్రాంటు లభిస్తుంది. ఈ ఆరు నెలలలోపుగానే ఉపాధి లభించే పక్షంలో గ్రాంటు నిలిపివేస్తారు.

# ఆంధ్రప్రదేశ్‌లో సస్యవిప్లవం

భారతదేశంలో ఆహారధాన్యాల ఉత్పత్తి తక్కువగా వుండి ఏటేటా సాలీనా విదేశాల నుంచి భారీ యెత్తున ఆహారధాన్యాలు దిగుమతి చేసుకోవడం అవసరమవుతూ వుండేది. వ్యవసాయోత్పత్తులను అధికం చేసి ఆహారవిషయంలో స్వయం సమృద్ధి సాధించడం జాతీయ లక్ష్యంగా నిర్ణయించబడింది. మన ప్రణాళికలలో ఈ విషయానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వబడింది. మనం వ్యవసాయరంగం అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించటం జరుగుతున్నది. అయినప్పటికీ, జనాభా విపరీతంగా పెరుగుతూ వుండడం వల్ల ఆహార ధాన్యాల లోటు ఏర్పడుతూనే వున్నది. భారత వ్యవసాయరంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొని వచ్చి వ్యవసాయోత్పత్తులను అధికం చేయడానికి ప్రభుత్వం అనేక కృషి జరుపుతున్నది. సేద్యయోగ్యమగు భూమి పరిమితంగా వుండడంవల్ల, ఉన్న భూమిలో తీవ్రోత్పత్తి ద్వారా అధిక ధాన్యాలు పండించడానికి శాస్త్రీయ పద్ధతులలో కృషి జరుగుతున్నది. మేలు రకం విత్తనాలు కనుగొని వాటిని ఉపయోగించడం వల్ల దిగుబడి స్థానిక పంటలకన్నా 10 నుంచి 15 శాతం హెచ్చుగా వుంటున్నది.

ఇప్పుడు దేశంలో 'సస్య విప్లవం' ఉధృతంగా కొనసాగుతున్నది. దీనివల్ల వ్యవసాయంలో పురోభివృద్ధికరమైన మార్పులు వచ్చాయి. సైన్సు, టెక్నాలజీ సహాయంతో సస్యవిప్లవం కొనసాగుతున్నది. వ్యవసాయ పరిశోధనలు కొనసాగుతూ వుండినప్పటికీ ఇటీవలి వరకు వాటి పద్ధతులు రైతులకు అందుబాటులో వుండేవి కావు. ఎంతో శ్రమ పడి పరిశోధనలు చేసిన ఫలితంగా, తక్కువ కాలంలో, యెక్కువ దిగుబడి నిచ్చే విత్తనాలు రూపొందించబడినాయి. వివిధ భూసార, వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన అనేక రకాల విత్తనాలు కనుగొనబడినాయి. వీటితో దేశంలో వ్యవసాయ పద్ధతిలో విప్లవాత్మకమైన మార్పు వచ్చింది. సేద్యానికి ఈ మేలు రకం విత్తనాలు ఉపయోగించడంవల్ల ఆహారధాన్యాల లోటును తీర్చడానికి మహత్తర అవకాశాలు ఏర్పడుతున్నవి. పంజాబ్‌లో గోధుమ విప్లవం వచ్చినట్లుగానే మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా బియ్యం విషయంలో విప్లవం సాధించడం జరుగుతున్నది. మన రాష్ట్రం దక్షిణ భారత దేశపు ధాన్యాగారమని ప్రసిద్ధి చెందినది కదా!

ఇప్పుడు యెక్కువ దిగుబడినిచ్చే స్వల్పకాలిక వరివంగడాలు రూపొందించబడినాయి. కనుక సాలుకు మూడు, నాలుగు పంటలు కూడా పండించడానికి అవకాశాలున్నాయి. దీనివల్ల రైతులకు నికర ఆదాయం మూడు నాలుగు రెట్లు పెరగడానికి వీలు ఏర్పడుతున్నది. పంటల మార్పిడి పద్ధతి, ఎక్కువ దిగుబడి నిచ్చే వంగడాలు, సస్యరక్షణ కార్యక్రమం మున్నగు ఆధునాతన పద్ధతులు ఇప్పుడు బహుళ ప్రచారంలో వున్నాయి. వాటి వివరాలు దిగువ పేర్కొనబడినాయి.

ఎక్కువ దిగుబడినిచ్చే విత్తనాలు రాష్ట్రంలో 1966-67 లో ప్రవేశపెట్టబడినాయి. వీటిని ఉపయోగించడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు.

ఐ ఆర్. 8 వంగడం ప్రవేశ పెట్టడంలో పంట దిగుబడి చాలా హెచ్చింది. [illegible] 29 జయ, హంస అనే ఇతర మేలు రకం వరి వంగడాలు కూడా ఇప్పుడు ప్రచారంలోకి వస్తున్నాయి. ఇవే కాకుండా మన రాష్ట్రంలో ఇప్పుడు జగన్నాథ పంకజ ఐ.ఆర్. 20, కావేరి, విజయ, రత్న, పద్మ, ఏడిటి-27 అనే రకాలు కూడా పండించబడుతున్నాయి. ఇవి స్వల్ప కాలిక పంటలు. అంతేకాకుండా మామూలు రకం విత్తనాల కంటే ఈ విత్తనాలవల్ల పంట దిగుబడి సుమారు రెండున్నర రెట్లు వుంటుంది.

1966 నుంచి మన రాష్ట్రంలో మొక్కజొన్న యెక్కువగా సాగు చేస్తున్నారు. డెక్కన్, గంగా-3, గంగా-5 సంకర మొక్కజొన్న విత్తనాలు ఉపయోగించబడుతున్నవి. నూతన పద్ధతులు తెలుసుకొని వాటిని ఆచరణలో పెట్టడానికి మన రైతులు అత్యంత శ్రద్ధా సక్తులు చూపుతున్నారు. రైతులకు తగినన్ని మేలురకం విత్తనాలు సరఫరా చేయడానికి వ్యవసాయ శాఖ 5,000 యెకరాలు గల 30 వ్యవసాయ క్షేత్రాలలో విత్తనములు పండిస్తున్నది.

నాల్గవ ప్రణాళికలో వరి పంటలను 36 లక్షల యెకరాలలోను, సంకర జొన్న పంటలను 7 లక్షల యెకరాలలోను, సంకర సజ్జను 1.50 లక్షల యెకరాలలోను, సంకర మొక్కజొన్న 1½ లక్షల యెకరాలలోను పండించడానికి ప్రతిపాదనలు రూపొందించబడినాయి, 2 లక్షల యెకరాల మెక్సికన్ గోధుమకూడా పండించాలని సంకల్పించబడినది. ఈ 54 లక్షల యెకరాలలో సుమారు 30 లక్షల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాలు పండగలవని ఆశింపబడుతున్నది. 71-72 సంవత్సరంలో 22 లక్షల యెకరాలలో వరి 3 లక్షల యెకరాలలో సంకర జొన్న, 2.40 లక్షల యెకరాలలో సంకరసజ్జ, లక్ష యెకరాలలో గోధుమ పండించాలని సంకల్పించ

బడింది. ఈ పథకాల ఫలితంగా 71–72లో వ్యవసాయ శాఖ కార్యక్రమం ద్వారా మాత్రమే 13–28 టన్నుల ఆహారధాన్యాలు అదనంగా పండించ బడుతాయి.

స్వల్ప కాలంలో ఫలితము నిచ్చే మేలురకం విత్తనాలు వాడటం వలన ఒక సంవత్సరంలోనే ఇతర పంటలు కూడా పండించడానికి అవకాశాలు ఏర్పడుతున్నాయి. అయితే నీటి పారుదల సౌకర్యాలు వున్న ప్రాంతాలలో మాత్రమే ఈ విధంగా అనేక పంటలు పండించవచ్చు. ఈ పథకం 1969–70లో మన రాష్ట్రంలో ప్రవేశ పెట్టబడింది. ఈ పథకం క్రింద 2.25 లక్షల హెక్టార్ల భూమి సాగు అయింది. ఈ కార్యక్రమం ఫలితంగా అదనంగా 78,750 మెట్రిక్ టన్నుల ఆహారేతర పంటలు అదనంగా పండించడం జరిగింది. 1970–71లో అదనంగా 1.5 లక్షల హెక్టార్ల భూమిలో అనేక పంటలు సాగుచేసే కార్యక్రమం అమలు పరచబడింది. దాని ఫలితంగా 52,500 మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు 2.500 ఆహారేతర పంటలు అదనంగా పండించ బడినాయి. 1971–72లో 2.25 లక్షల హెక్టార్ల భూమిలో ఈ కార్యక్రమం అమలు పరచడానికి ప్రతిపాదించబడింది. ఈ పద్ధతి ప్రకారం సాగు చేయడం వల్ల కలిగే అనేక లాభాలను రైతులకు తెలియబరిచే వుద్దేశంతో కేంద్ర ప్రభుత్వ సహాయంతో పశ్చిమ గోదావరి జిల్లా పెదపలి బ్లాకు, కర్నూలు జిల్లా నంది కొట్కూరులోను, కరీంనగరు జిల్లా మెట్టపల్లిలోను మూడు ప్రదర్శన వ్యవసాయ క్షేత్రాలు నిర్వహించ బడుతున్నాయి.

నాల్గవ ప్రణాళికలో ఈ పథకం క్రింద 25 లక్షల యెకరాలు సాగు చేయడానికి సంకల్పించబడింది. దీనివల్ల ఆహార ధాన్యాలు, ఆహారేతర పంటలు కలసి మొత్తం 5 లక్షల టన్నులు అదనంగా పండించబడగలవని ఆశింపబడుతున్నవి.

భారత దేశంలో విరివిగా రసాయనిక ఎరువులు వాడే ముఖ్యమైన రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి. రాష్ట్రంలో రసాయనిక ఎరువుల వినియోగం క్రమేణా హెచ్చుతున్నది. 56–57లో 0.93 లక్షల టన్నుల నైట్రజని ఎరువులు వినియోగించబడినాయి. వీటి వాడకం 1970–71లో 10.41 లక్షల టన్నులకు పెరిగింది. ఫాస్ఫేటు ఎరువుల వాడకం 1956–57లో 0.27 లక్షల టన్నుల నుంచి 1970–71 లో 3.68 లక్షల టన్నులకు పెరిగింది. పొటాష్ ఎరువుల వాడకం 1966-67లో 1.55 లక్షల టన్నుల నుంచి 1970–71 సంవత్సరంలో 1.30 లక్షల టన్నులకు పెరిగింది. పొలాలకు సరియైన రసాయనిక ఎరువుల వాడకం చాల లాభమని రైతాంగం ఇదివరకే గుర్తించింది.

స్వల్పకాలిక మేలురకం పంటలకు రసాయనిక ఎరువులు వాడినట్లయితే పంట యెక్కువగా పండుతుంది. అందువల్ల నాల్గవ ప్రణాళిక కాలంలో 70 లక్షల టన్నుల నత్రజని ఎరువులను 11.70 లక్షల టన్నుల ఫాస్ఫేటు ఎరువులను వాడడానికి ప్రతిపాదించ బడింది.

## సస్యరక్షణ

స్వల్పకాలిక మేలురకం విత్తనాలకు తెగుళ్లు రోగాలు వచ్చే ప్రమాదం వుంది. కనుక వ్యవసాయ కార్యక్రమాలలో సస్యరక్షణ కార్యక్రమం ప్రాముఖ్యత మరీ హెచ్చింది. కనుక 1971–72లో 212 లక్షల యెకరాలలో సస్య రక్షణ కార్యక్రమం అమలు జరుప డానికి ప్రతిపాదించబడింది.

నాల్గవ ప్రణాళికలో 32 లక్షల టన్నుల నూనె విత్తనాలు, 20 లక్షల టన్నుల చెరకు, 0.94 లక్షల బేళ్ళ ప్రత్తి ఉత్పత్తి చేయాలని లక్ష్యం నిర్ణయించబడింది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా వున్నాయి. రైతులు సకాలంలో సస్యరక్షణ కార్యక్రమాలు చేపట్టి, పొలాలకు అవసరమైన మోతాదులలో రసాయనిక ఎరువులు వేసినట్లయితే, మనం నిర్ణయించుకొన్న ఈ లక్ష్యాలు సాధించడం కష్టంకాదని చెప్పవచ్చు. ★

---

ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గారి శతజయంత్యుత్సవాల సందర్భంగా ప్రకాశం జీవిత చరిత్ర ''బొమ్మల సీరియల్''గా ఆంధ్రప్రదేశ్ పత్రిక (అన్ని భాషలలో) 1972 ఏప్రియల్ సంచిక నుండి ప్రకటింప బడుతుంది. సుప్రసిద్ధ కార్టూన్ చిత్రకారుడు శ్రీ 'బుజ్జాయి' యీ సీరియల్ నిర్వహిస్తున్నారు.

మీ కాపీ ముందుగా రిజర్వు చేసుకోండి.

ప్రధాన సంపాదకులు
"ఆంధ్రప్రదేశ్"

---

# తూర్పుగోదావరి జిల్లాలో కుటుంబనియంత్రణ

— శ్రీ రావుల శ్రీరామచంద్రమూర్తి

స్వాతంత్ర్యానంతరం భారత దేశంలో సాంఘిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో అనేక మార్పులు వచ్చాయి. మన రాజ్యాంగంలో జాతి, కుల, మత, లైంగిక వ్యత్యాసాలతో సంబంధం లేక పౌరులందరికీ సమాన హక్కులు, విధులు పేర్కొనబడ్డాయి. సంక్షేమ రాజ్య స్థాపనకు పంచవర్ష ప్రణాళికల ద్వారా ప్రభుత్వం అభ్యుదయ పథకాలను నిర్వహిస్తోంది. గత మూడు పంచవర్ష ప్రణాళికలలోను సాంఘిక సంక్షేమం, విద్య, ఆరోగ్యం, రవాణా సౌకర్యాలు, విద్యుచ్ఛక్తి తదితర కార్యక్రమాలతో కొంతవరకు అభివృద్ధి సాధించినప్పటికి నానాటికి పెరుగుతున్న జనాభా ప్రజల జీవన ప్రమాణాన్ని మెరుగు పర్చడానికి, జాతీయాదాయాన్ని పెంచడానికి చేస్తున్న కృషికి అంతరాయం కలిగిస్తోంది.

## ఉద్దేశం

ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కలగజేసినంత మాత్రాన సాంఘికాభివృద్ధిని నెలకొల్పడం అసాధ్యమని ప్రభుత్వం గుర్తించింది. పెరుగుతున్న జనాభాను అదుపులో పెట్టాలనే ఉద్దేశంతో పంచవర్ష ప్రణాళికలలో ఆరోగ్య కార్యక్రమాలలో భాగంగా కుటుంబ నియంత్రణ కార్యక్రమం ప్రారంభించింది. 1961 జనాభా లెక్కల ప్రకారం 45 కోట్లు ఉన్న మన దేశ జనాభా ఇప్పుడు 54 కోట్లకు పెరిగింది. ప్రతి సంవత్సరం మన జనాభా 2.3 శాతం చొప్పున పెరుగుతోంది. సంవత్సరానికి 1000 మంది భార్యా భర్తలకు 38 మంది శిశువులు జన్మిస్తున్నారు. ఆ జననాలను వచ్చే 10 సంవత్సరాలలో 25 కు తగ్గించాలనేదే ప్రస్తుత కుటుంబ నియంత్రణ కార్యక్రమ లక్ష్యం.

## జాతీయ కార్యక్రమం

కుటుంబ నియంత్రణను జాతీయ కార్యక్రమంగా రూపొందించి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఈ కార్యక్రమ నిర్వహణకు అయ్యే పూర్తి ఖర్చును భరించి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖల ద్వారా అమలు పరుస్తోంది. ప్రతి రాష్ట్రంలోను రాష్ట్ర స్థాయి మొదలుకొని గ్రామ స్థాయివరకు అనేక మంది సిబ్బంది నియమించబడ్డారు. కుటుంబ నియంత్రణ కార్యకర్తలు ప్రభుత్వ అన్ని శాఖల సిబ్బంది, స్వచ్ఛంద నాయకుల సహకారంతో పట్టణాలలోను, గ్రామీణ ప్రాంతాలలోను సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.

అన్ని రాష్ట్రాలలో పాటు ఆంధ్రప్రదేశ్‌లో 1965 వ సంవత్సరం కుటుంబ నియంత్రణ విభాగాన్ని పునర్వ్యవస్థీకరించడం జరిగింది. పట్టణాలలోను, మారుమూల గ్రామాలలోను కుటుంబ నియంత్రణావశ్యకతను ప్రజలకు తెలియజేయడానికి, అర్హులైన భార్యా భర్తలలో ఏ ఒక్కరైనా శస్త్ర చికిత్స చేయించుకోవలసిందని ప్రోత్సహించడానికి విస్తరణ సిబ్బందిని నియమించారు. ప్రతి జిల్లాలోను వైద్య, ఆరోగ్య శాఖాధికారుల ఆధిపత్యం క్రింద ఉంటున్న కుటుంబ నియంత్రణ విభాగాలలోని సంచార శస్త్ర చికిత్సా బృందాలు శిబిరాలను ఏర్పరచి వంధ్యాకరణ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నాయి. కుటుంబ నియంత్రణలో సఫలితాలను సాధించిన రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా ఉంటున్నది.

## జిల్లాలో కేంద్రాలు

తూర్పు గోదావరి జిల్లా జనాభా 32 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ జిల్లాలో గల 14 తాలూకాలలో 20 పంచాయితీ సమితులు ఉన్నాయి. 12 పట్టణ కుటుంబ నియంత్రణ కేంద్రాలు, 27 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా కుటుంబ నియంత్రణ సంస్థలో గల 5 సంచార శస్త్ర చికిత్స బృందాలు, రాజమండ్రిలో ఉన్న రైల్వే ఆసుపత్రి, జిల్లాలోని ప్రైవేట్ వైద్య కేంద్రాలు శస్త్ర చికిత్సలు చేస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుబంధంగా 216 కుటుంబ నియంత్రణ ఉపకేంద్రాలు పని చేస్తున్నాయి.

## సిబ్బంది

జిల్లా స్థాయిలో కుటుంబ నియంత్రణాధికారి, సమాచార ప్రచార శాఖాధికారి, ఇద్దరు విస్తరణాధికారులు సమితి స్థాయిలో 54 మంది వైద్యాధికారులు, 28 మంది విస్తరణాధికారులు, 54 మంది హెల్త్ విజిటర్లు, ఉపకేంద్రం స్థాయిలో 117 మంది కుటుంబ నియంత్రణ పర్యవేక్షకులు, 216 మంది ఆక్జిలరీ నర్సులు ఈ జిల్లాలో పనిచేస్తున్నారు. వీరు గాక శస్త్ర చికిత్సా శిబిరాలు ఏర్పాటు చేయబడిన సమయాలలో ఇతర వైద్య, ఆరోగ్య సిబ్బంది సేవలను వినియోగిస్తున్నారు.

## ప్రచారం

కాకినాడలో గల భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచారశాఖ, జిల్లా సమాచార, పౌర సంబంధ శాఖ, జిల్లా కుటుంబ నియంత్రణ

లాలు ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. కుటుంబ నియంత్రణావశ్యకతను వివరించే చలన చిత్రాలు పట్టణాలలోను, గ్రామాలలోను ప్రదర్శించ బడుతున్నాయి. పండుగ సమయాలలోను, తిర్నాళ్లలోను కుటుంబ నియంత్రణ ప్రదర్శనలు ఏర్పాటు చేయడం జరుగుతోంది. రెండు ఏక్స్టెన్షన్ దళాలుకూడ పనిచేస్తున్నాయి. సమితి సహాయ పౌరసంబంధ శాఖాధికారులు, కుటుంబ నియంత్రణ విస్తరణాధికారులు ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

## శస్త్ర చికిత్సలు

1970_71 ఆర్థిక సంవత్సరానికి ఈ జిల్లాలో 82,998 వేసక్టమీలు, 22,164 ట్యూబెక్టమీలు చేయబడ్డాయి. 1961 ఆర్థిక సంవత్సరం నుంచి 1970 వరకు 75,961 వేసక్టమీలు చేయగా 13 538 ట్యూబెక్టమీలు మాత్రం చేయబడ్డాయి. వీటినిబట్టి ఈ జిల్లాలో శస్త్ర చికిత్సలు చేయించుకోవడానికి పురుషులు ముందంజ వేస్తున్నారని చెప్పవచ్చును. అయితే 1969_70 సంవత్సరంలో జరిగిన 10,180 వేసక్టమీలు, 8,379 ట్యూబెక్టమీలు, 1970_71లో చేసిన శస్త్ర చికిత్సలనుబట్టి చూస్తే స్త్రీల నుంచి కూడ ఈ కార్యక్రమానికి ప్రోత్సాహం లభిస్తుందని గ్రహించ వచ్చును. జిల్లాలో 1971 ఆర్థిక సంవత్సరంలో 399 వేసక్టమీ శస్త్రచికిత్సలు నిర్వహించి ఊబలంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రథమ స్థానాన్ని, 398ల తో రాజానగరం, 328 లతో అనపర్తి కేంద్రాలు ద్వితీయ, తృతీయ స్థానాలను పొందాయి.

## శిబిరాలు

అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రతినెల 6 నుంచి 10 గ్రామాలలో వేసక్టమీ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాయి. శిబిరాల నిర్వహణకు పదిరోజులు ముందు ఆయా గ్రామాలలో కుటుంబ నియంత్రణ కార్యకర్తలు సామూహిక ప్రచార కార్యక్రమాలతో పాటు గృహసందర్శనల ద్వారా ఇద్దరు, అంతకంటె ఎక్కువ మంది పిల్లలున్న భార్యాభర్తలను తమ కుటుంబ సంక్షేమానికి ఎండ్యాంరణ శస్త్రచికిత్స చేయించు కోవడం మంచిదని తెలియజేస్తున్నారు. గ్రామాలలోని వ్యవసాయ కూలీలకు, రైతులకు ఎక్కువగా పని ఉండే జూలై, ఆగస్టు, డిసెంబరు మాసాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పని చేస్తున్న కొంతమంది సిబ్బందిని పట్టణాలకు పంపించడం వలన పురపాలక సంఘ ప్రాంతాలలో ఎక్కువగా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయబడుతున్నాయి.

ఈ జిల్లాలో కుటుంబ నియంత్రణ కార్యక్రమం ప్రారంభించిన తరువాత 1969 వ సంవత్సరం జూలై నెల వరకు ట్యూబెక్టమీ శిబిరాలు ఏర్పాటు చేయబడలేదు. దీనికి గత సంవత్సరాలలో స్త్రీల కంటె ఎక్కువగా పురుషులు ముందుకు రావడమే ముఖ్య కారణం. ట్యూబెక్టమీ పెద్ద ఆపరేషనని, అది అనారోగ్యానికి దారితీస్తుందని స్త్రీల అపోహ. ముందుగా అపనమ్మకాలను తొలగించనిదే శిబిరాలను నిర్వహించడం మంచిది కాదని గుర్తించిన అధికారులు విస్తరణ విద్యా విధానాల ద్వారా ప్రజలకు ట్యూబెక్టమీ గురించి వివరించమని ఆదేశించారు. 1969 వ సంవత్సరం ఆగస్టు_నవంబరులలో కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో దారి పెట్టిన నిర్వహించిన మొదటి ట్యూబెక్టమీ శిబిరంలో 3106 శస్త్ర చికిత్సలు చేయబడ్డాయి. ఈ శిబిరం జయప్రదంలో ఇటీవల రాజమండ్రి, ఊబలంక, అనపర్తి, అమలాపురం, పిఠాపురం, తుని, రామచంద్రపేట, ద్రాక్షారామేశ్వరంలో శిబిరాలను ఏర్పరచి లక్ష్యాలను మించి శస్త్ర చికిత్సలు చేశారు.

## అవరోధాలు

ఈ జిల్లాలో కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని మరింత విస్తృతంచేయడానికి కొన్ని సమస్యలు అవరోధంగా ఉంటున్నాయి. ఈ జిల్లాలో సెంట్రల్ డెల్టా, మెట్ట, ఏజెన్సీ ప్రాంతాలలోని ప్రజల సాంఘిక, ఆర్థిక పరిస్థితులలో అనేక వ్యత్యాసాలున్నాయి. ఆర్థికంగా వెనుకబడివున్న మెట్ట ప్రాంతం, ఏజెన్సీలలో కంటె సెంట్రల్ డెల్టా ప్రాంతంలో ఎక్కువగా శస్త్ర చికిత్సలు చేయబడ్డాయి. దీనికి సెంట్రల్ డెల్టా ప్రాంతంలో కూలీలకు, రైతులకు ఎక్కువగా పని ఉండడమే కొంత వరకు కారణం. ఆర్థిక స్తోమత మెరుగుగా ఉన్నప్పటికి తల్లి ఆరోగ్యం కాపాడుకోవడానికి, పిల్లలను ఆరోగ్యవంతులుగా చేయడానికి కుటుంబ నియంత్రణ పద్ధతులను అనుసరించడం మంచిదని గుర్తించిన ఈ ప్రాంతంలోని ప్రజలు ఇప్పుడు శస్త్ర చికిత్సలు చేయించుకోవడానికి ముందుకు వస్తున్నారు.

కుటుంబనియంత్రణ మన ఆచారానికి వ్యతిరేకమని, ఎక్కువగా హిందువులే ఈ ఆపరేషనులను చేయించు కొంటున్నారు గాని, ముస్లిములు, క్రైస్తవులు ముందుకు రావడంలేదని, మన దేశంలో కొన్ని సంవత్సరాలకు వారి జనాభా హెచ్చవుతుందని కొందరి విశ్వాసం. ఆపరేషను చేయించుకొంటే అది అనారోగ్యానికి దారితీస్తుందని, దురదృష్టవశాత్తు పిల్లలు మరణిస్తే తిరిగి సంతానం కలగదని కొంతమంది అభిప్రాయం. "మా చిన్నతనంలో సంతానాన్ని ప్రసాదించమని భగవంతుని మొక్కుకొనే వాళ్ళం" అంటూ కుటుంబాలను పరిమితంచేయడం పాపకార్యమని కొంతమంది భావిస్తున్నారు.

కుటుంబ నియంత్రణకు కేటాయించిన నిధులను పరిశ్రమల అభివృద్ధికి, బంజరు భూములను సాగుచేయడానికి వినియోగిస్తే నిరుద్యోగ సమస్య తీరడమే గాక దేశాభివృద్ధికి తోడ్పడునని కొందరి వాదన. మనకు గల వనరులు తక్కువ గనుక ఎంత ధనాన్ని వ్యయం చేసినా మన సమస్యలు సమసిపోవు. అధిక సంతానం ఉన్న వారు వ్యక్తిగత, కుటుంబ సమస్యలను రూపుమాపడానికి అవకాశముండదు, కుటుంబ సంక్షేమానికి మార్గం కుటుంబ నియంత్రణమే.

కుటుంబ నియంత్రణ కార్యకర్తలు ప్రజలలో ప్రబలి ఉన్న అప నమ్మకాలను తొలగించడానికి చేస్తున్న ప్రయత్నాలలో స్థానిక స్వచ్ఛంద నాయకులు భాగస్వాములు కావలసిన అవసరం ఉంది. ముందు ముందు కూడా, తల పెట్టిన లక్ష్యాలను సాధించడంలో జిల్లాలోని ప్రజలు ప్రభుత్వానికి చేయూతనిచ్చి, ఈ కార్యక్రమాన్ని ఇతోధికంగా ప్రోత్సహించి దేశాభ్యుదయానికి తోడ్పడుతారని ఆశిద్దాము. ★

# ప్రజా ప్రతిజ్ఞ

ఎల్. మాలకొండయ్య

విన్నారా పగవాని విమాన దాడులు
అకస్మాత్తుగా కల్పించిన
ఆకాశ యుద్ధం !
శత్రుత్వం కోరలేదు మనం
మిత్రత్వమే చాటించాం ఎల్లప్పుడూ.
శాంతి ప్రియులం భారతీయులం
క్రాంతి పథం మన వెలుగుబాట.
మనం చేయవలసిన కృషి నేడు పోరాటం
మనం కోరవలసిన విజయం, విశ్వశాంతి.
శత్రుత్వమే కావాలని కవ్వించే
శత్రువులకు ఎలా కాగలం మిత్రులం—?
ఆత్మగౌరవం, దేశభక్తి, ఐకమత్యం
నిప్పులుగా, బాంబర్లుగా, యుద్ధనౌకలుగా చేర్చుకొని,
శత్రువులను పేల్చివేద్దాం
శత్రువిమానాలను కూల్చివేద్దాం
పాటన్ టాంకుల పాతి పెడదాం
థార్ ఎడారి ఇసుక దిబ్బల్లో.
లేవండి! నడుం కట్టి ముందుకు నడవండి
శని విరగడ చేసుకుందాం
శత్రుశేషం లేకుండా—
మళ్ళీ మళ్ళీ మనపై
కయ్యానికి కాలు దువ్వేపని
పగవానికి లేకుండా—
పక్కలో బల్లాన్ని
పర్మనెంటుగా తొలగిద్దాం—
అజాగ్రత్తవల్ల పరిణామం
అసమర్థతకంటే అనర్థకం
"శత్రువును నమ్మరాదెన్నడు" అన్న
సత్యాన్ని తెలుసుకున్నాం నేడు—
యుద్ధకాలంలో ఉండాలి జాగ్రత్తగా ప్రతి పౌరుడూ
ఇంటిదొంగలను వేయికళ్ళతో కనిపెడుతుండాలి
పిరికితనాన్ని ప్రచారంచేసే వాళ్ళను,
సమరానికి సహాయం నిరాకరించేవాళ్ళను,
శత్రువులకు రహస్యాలు అందించే దేశద్రోహులను,
ధాన్యాన్ని, కిరసనాయిల్‌ను దాచేవాళ్ళను,
నిత్యావసర వస్తువుల ధరలు పెంచేవాళ్ళను,
అక్కడికక్కడ పట్టివేయడం,
ప్రభుత్వానికి అప్పగించడం,
ప్రతి పౌరుని కర్తవ్యం.
విజయసాధనకు ప్రజాప్రతిజ్ఞ.
పగవాణ్ణి పారద్రోలే కృషిలో
సగభాగం పంచుకోవాలి— జవాన్‌తో కిసాన్—
జవాన్ పోరాడితే యుద్ధరంగాలలో
కిసాన్ శ్రమపడాలి పంటపొలాలలో.
ప్రతి భారతీయుడు ప్రతిజ్ఞ చేయాలి—
అత్యధికంగా పంటలు పండిస్తానని
అసలు ధరలకే సరకుల్ని అమ్ముతానని
ప్రభుత్వానికి అండగా నిలుస్తానని
హెచ్చు పన్నులైనా చెల్లిస్తానని
తినుబండారాలను దాచుకోవటం
పేదలను దోచుకోవటం— అరికడతానని
ప్రతిపౌరుడు ప్రతిజ్ఞ చేయాలి—
విజ్ఞానీ, విద్యార్థీ,
వ్యాపారీ— అధికారీ
కర్షకుడూ, కార్మికుడూ,
విరోధిని ఎదిరిస్తానని
విజయం సాధిస్తానని శపథం చేయాలి.

జై జవాన్ — జై కిసాన్,
జై వ్యాపారి — జై అధికారి
జై విద్యార్థి — జై విజ్ఞానీ,
జై కర్షకా — జై కార్మికా,
జై భారతీయ జనకోటి... జై జై !!

కథానిక

# స్వయంకృతము

- కొసనం మహేశ్వరరావు

ఆకాశం అదురులోంది. వేటగానిపై తిరగబడిన వ్యాఘ్రంలా గాండ్రిస్తోంది. భీకర సంగ్రామం జరుగుతున్నట్లుగా ఉంది వాతావరణం. బాంబులు కురుస్తున్నట్లు చెవులు చిల్లులు పడుతున్నాయి. కళ్ళు మూసుకున్నా కళ్ళలోకి దూసుకుపోవడానికి యత్నిస్తోన్న మెరుపులు. ఉండి ఉండి పిడుగుల భీకర ధ్వనులు, పిశాచి నవ్వులా ఎడాపెడా కొడుతున్న గాలికి తోడు హోరున వర్షం.

ఎంత గుండె నిబ్బరం గలవాడినైనా అదరగొట్టి బెదరగొట్టి భయభీతుణ్ణి చేసేట్లున్నది వాతావరణం.

జానకి పసిపాపను గుండెలకు హత్తుకొని భయపడుతూ నలువైపులా చూస్తున్నది.

తలుపులు వేసిఉన్నా వాటి సందుల్లోంచి రివ్వున గాలి, పాము బుసలా ఇంట్లోకి దూసుకువస్తున్నది. సూదులతో పొడిచినట్లు ఉండి ఉండి వెలుగులు చీల్చుకొస్తున్నాయి. పిల్లలు నలుగురూ దగ్గరదగ్గరగా పడుకొని నిద్రపోతున్నారు. మధ్యమధ్య దులుతున్నారు.

లైటు ఆరిపోయింది. ఎక్కడో పెద్ద పిడుగు అరిచింది. నలుగురు పిల్లలూ, ఒడిలోని పిల్లా 'అమ్మో' అంటూ కెవ్వుమన్నారు.

'పడుకోండి బాబూ...... ఎక్కడో పిడుగుపడింది...... అంతే...' చీకట్లో తడుముకుంటూ పిల్లల దగ్గరగా వెళ్ళి వాళ్ళ వీపు చరిచి దుప్పటి సరిచేసింది. ఒడిలో పాప మాత్రం ఇంకా ఏడుస్తూనే ఉంది. పండుకేసి జోకొట్టబోతే వదల్లేదు. అంటిపెట్టుకుని ఏడుస్తూనే ఉంది.

జానకి జోలపాట పాడబోయింది. గొంతు పెగలటంలేదు. ఒక మాటన్నా బయటి వాతావరణం వేయింతల గొంతుచేసుకొని అరుస్తున్నది. అయినా జోకొడుతూ పాడటానికి ప్రయత్నించింది. పాప ఊరుకోలేదు. లేచి నిలబడింది. లైటు వెలిగి ఆరిపోయింది. 'ఆ లైటు అయినా అలాగే వెలుగుతూ ఉంటే ఎంతో ధైర్యంగా ఉంటుంది అనుకుంది. ఆశగా చీకట్లో బల్బు ఉన్నవైపుకు ఒక క్షణం చూచింది. పాప కెవ్వుమంటూనే ఉంది. అలాగే ఊపుతూ అటు రెండడుగులు, ఇటు రెండడుగులు వేసి మధ్యమధ్య ఆశగా వీధితలుపువైపు చూస్తున్నది.

పాప ఏడ్పు ఆగిపోయింది. వాన జోరు తగ్గింది. ఉరుముల మెరుపుల హోరూ తగ్గింది. కానీ జానకి గుండెల్లో భయం అలాగే ఉంది. గిల్లిగిల్లి తనను మరింత భయపడేట్లు చేస్తున్నది. ఒకసారి వీధి తలుపు దగ్గరగా వెళ్ళి సందులోంచి బయటకు చూసింది. నీళ్ళు గలగలా పారుతున్న శబ్దం వినిపించింది. తలుపు తీద్దామనుకుంది. భయం తీయనీయటంలేదు. 'ఈ ప్రళయంలో ఆయన ఎక్కడ ఉన్నారో......, అనుకుంది. ప్రక్కవాటాలో పిల్లల ఏడుపు వినపడటంతో జానకికి కొంత ఊరట కలిగినట్లయింది.

“ఈ వర్షం ఆగిపోయిందే... ఇంకా బాగా కురిసి ఆ వరదలో మమ్మల్ని తీసుకుపోతే ఎంత హాయిగా ఉండును. ఇలా నిత్యమూ, అనుక్షణమూ బాధపడుతూ, సుఖానికి దూరమై బ్రతుకు సాగించేకంటే వీటన్నిటికీ దూరంగా, దారిద్ర్యానికి అందని చోటుకు పోతే ఎంత బాగుంటుంది.... అనుకొని ఒకసారి పిల్లలవైపు చూసింది జానకి. మళ్ళీ గుండెల్లో ఆశ కదిలింది. మమత అదిలించింది. పిరికితనం హేళన చేసింది. ‘‘మా బ్రతుకులేం కాను?’ అని ఐదుగురు పిల్లలే గాక కడుపులో రూపు దిద్దుకొంటున్న పిండం కూడా నిలేసి అడిగినట్లయింది. జానకికి జవాబు దొరకలేదు. పేలవంగా నవ్వు కదిలింది. కర్మ గుర్తుకొచ్చింది. ఋణానుబంధమని తనలో మరొకరెవరో చెబుతున్నట్లనిపించింది.

జీవితం ఒక నాటకం!

చావుపుట్టుకల మధ్య జరిగే సంఘర్షణ!

సుఖదుఃఖాలు కావడికుండలు!

సుఖానికి సంతోషించి, దుఃఖానికి విచారించడం అవివేకం!

నీ కర్మను నిర్వర్తించడానికి నువ్వు పుట్టావు, అనుభవించు సుఖమో దుఃఖమో విచారించకు.

నీవు నామ మాత్రమే. అన్నిటినీ అనుభవించేది నేను...!

మనస్సులో ఘర్షణ, మస్తిష్కంలో సంఘర్షణ: ఘర్షణకు, సంఘర్షణకు ఉపశమనం కలుగజేసే తత్త్వబోధ. ఆధ్యాత్మిక సదానందాన్ని వివరించే భాష్యం,

చుక్కాని విరిగిపోయిన నావ, నది సముద్రంలో భీకర తుఫానులో కొట్టుమిట్టాడుతున్నప్పుడు కలిగే భావన.

ఒడ్డు చేరుతుందా, చేరుతుందన్న ఆశ లేశమాత్రం కలుగని స్థితి. కడలిలో కరిగిపోవడం తథ్యమన్న స్థితి.

అయినా ఆశ ప్రాణం కొనఊపిరిలో కొట్టుమిట్టాడుతున్నా ఆశ వదలదు. ఆశను ప్రాణం వదలదు. ఇంకా అస్థిత్వంకోసం ఆశ. ఆశతో అవ్యక్తమైన పోరాటం ... ఆఖరి శ్వాసవరకు పోరాటం.

జానకి నవ్వింది. అలా నవ్వినందుకు ఆమెకే మళ్లీ నవ్వు వచ్చింది,

వక్షానికి మరింత హత్తుకొన్న పాప ఇనుపపెనంలా కాలుతున్న పాప శరీరం. 'అబ్బ! జ్వరం మరీ ఎక్కువయినట్లుంది...' జానకి యధార్థ స్థితికి వచ్చింది.

ప్రక్క వాటాలో గడియారం గంటలు కొట్టింది. అతి శ్రద్ధగా విన్నది...... ఒకటి...... రెండు... లెక్కపెట్టింది. 'అబ్బ పది గంటలే...... రెండు గంటల కాలం ఒక యుగం అనిపించింది.

ఏదో పెద్ద ధ్వని వినిపించింది. ఆ ధ్వనితోపాటు ఆర్త నాదం వినిపించింది. కంగారుగా లేచి పిల్లల దగ్గరకు వెళ్ళి చీకట్లోనే తడివి చూచింది. 'హమ్మయ్య' అనుకుంది, మా ఇల్లుకాదు. చుట్టూ ఒకసారి చూచింది.

ప్రాణాలమీద ఆశ, లీపి. తనపిల్లలు. ..... తను . భర్త... ...సంసారం...ప్రేమ, మమకారం. ఆశ-అనే వలలో బంధీలై బ్రతుకుతున్న మనుషులు. బ్రతుకు అనే పడవలో చిక్కుకొని, సంసారమనే సుడిగుండంలో అలాగే తిరిగి తిరిగి చివరికి అందులోనే కరిగి కలిసిపోయే బ్రతుకులు!

కిటికీ తలుపు కొట్టుకొంది. 'ఎలా తలుపు కొట్టుకుంది? గడియ వేశానుగదా అనుకుంది. అంతలోనే 'గడియఊడింది...దీనికీ ఆలోచనే, అనుకొంటూ కిటికీ దగ్గరకు వెళ్ళి నిలబడింది.

మబ్బులు అలసిపోయినట్లు కదలటంలేదు. పౌర్ణమి చంద్రుడు నల్లని దుప్పటి కప్పుకొని నిద్రపోతున్నట్లున్నాడు. దూర దూరంగా కార్లధ్వని అప్పుడప్పుడూ వినవస్తున్నది. తన కొంప కూలిపోయిందో ఏమో గబ్బిలమొకటి రయ్యిన కిటికీగుండా దూసుకువచ్చింది.

'అమ్మో' జానకి భయపడింది. కెవ్వు మంది.

సరిగ్గా పది సంవత్సరాలక్రితం ఘటన మదిన కదిలింది.

మాధవరావూ తనూ విహారానికి వెళ్లారు. ఆ రోజు ఇలాగే వాతావరణం భయంకర రూపం దాల్చింది. ఒక పాడుబడిన ఇల్లు ఆశ్రయమయింది. ఆనాడు ఆవాతావరణం తనకు గానీ మాధవరావుకు గానీ భయమనిపించలేదు. ఆ వాతావరణం ఇద్దర్నీ ఒకటి చేసింది. తను అతని బాహుబంధాల్లో కరిగిపోయి బాహ్య ప్రపంచాన్నే మరచి మధురానుభూతుల్ని చవిచూచింది. అతని స్థితీ అలాగే ఉంది.

ఆ నాడూ ఇలాగే ఒక గబ్బిలం తనమీదుగా పోతే తను అతనిలో మరింత ఒరిగిపోయింది.

ఆనాటికీ ఈనాటికీ ఎంత తేడా. ఈ నాడు తనకు ఇంత భయం కలగటానికి కారణం ఏమిటి?

మాధవరావు తనను ప్రేమించాడు. తనూ అతన్ని ప్రేమించింది. ఇద్దరూ మొదట్లో ఒకర్ని విడిచి ఒకరు క్షణం కూడా ఉండలేని స్థితి. ఏదో ఆనందం, సుందర స్వప్నాలు. జీవితం అలాగే గడిచిపోతుంది అనుకున్నారు ఇద్దరూ.

కాలంతో పాటు పరిస్థితుల్లో మార్పు వస్తూ వచ్చింది. ఇప్పుడు తనకు అతన్ని చూస్తే భయం. తనను చూస్తే అతనికి భయం. ఊహ కందని మార్పు!

హాయిగా ఏలోటూ లేకుండా జీవితాలు గడిచేవి. మరి ఇప్పుడు ఏ అవసరమూ తీరక కటిక దారిద్ర్యం అనుభవించాల్సి వస్తున్నది. మొదటి ఇద్దరు పిల్లలు పెరిగినప్పటివరకు బాగానే గడిచింది. ఆ తరువాతనుంచే ఈ మార్పు. వచ్చే జీతం చాలడంలేదు, సగం వడ్డీలకే చాలడంలేదు. ఎప్పుడూ అప్పులవాళ్ల గొడవే. పాలవాడు, ఇంటి అద్దె, బట్టల కొట్టు, వెచ్చాల దుకాణం... ఎటు చూచినా అప్పులు. అప్పులవాళ్ల ఆశీర్వాదాలు, బెదరింపులు...అబ్బా! ఇంతకంటే వేరే నరకం ఉండదేమో. వీటికితోడు రోగాలు; ఎప్పుడూ ఎవరికో ఒకరికి. ఈ పరిస్థితులకు కారణం మేమేనా?-జానకి తనలో తానే అనుకుంటున్నది.

'పువ్వుల్లోపెట్టి పూజిస్తాను, నాహృదయపీఠంలో నిన్ను ప్రతిష్ఠించి జన్మజన్మాలకీ నీవే నా భార్యవు కావాలని ఆ భగవంతుణ్ణి వేడుకొంటున్నాను...నీవే నా ప్రాణం జానకీ...నీవు నా అదృష్టం కొద్దీదొరికావు జానకీ...' అని తనను గాఢ పరిష్వంగంలో బిగించేవాడు అతను. తనూ అలాగే అనేది. అది ఒకప్పటి మాట. మరి ఇప్పుడో... ప్రాణం తీయడానికి దాపురించావని ఒకరినొకరు తిట్టుకోవటం జరుగుతున్నది. కాలంతోపాటు రూపాలు కూడా మారాయి. అకాల వృద్ధాప్యం ఇద్దర్నీ ఆవహించింది. వేళకు సరియైన తిండి లేదు, వంటికి సరియైన బట్ట లేదు. ఏమిటి దారి భగవంతుడా,...' జానకి భగవంతుని తలచుకుంది 'ఇకనుంచైనా మాకష్టాలు గట్టెక్కేట్టు చేయి భగవంతుడా...'

ప్రాణం తూలిపోతున్నది. అలాగే కూర్చుండి పోయింది. ''ముప్ఫై సంవత్సరాలన్నా నిండలేదు. ఐదుగురు బిడ్డల తల్లిని, ఆరో బిడ్డకు తల్లిని కాబోతున్నాను. మేము తినలేక చిన్న పిల్లలకు పెట్టలేక సతమతమవుతుంటే మరోబిడ్డ తమ దారిద్ర్యంలో పాలు పంచుకోవడానికి రాబోతున్న ది'' అని నిట్టూర్చింది.

''మొదట్లో తాను గర్భిణి అయినప్పుడు ఎంత సంబరపడింది. తల్లిని కాబోతున్నా నని ఎంత గర్వపడింది. పుట్టింటివాళ్ళు ఎన్ని సూడిదలు చేశారు. ఎంత వేడుక చేశారు. ఆయనా ఎంత ఆనందించారు. తనవైపు ఎంత గర్వంగా చూచారు... ఆ మధుర క్షణాలు, ఆ రోజులు తన జీవితంలో స్థిరంగా ఉంటే

ఎంత బాపుండేది. మరి ఆ పిల్లలంటే ఇప్పుడు ప్రత్యేకించి ఏ ఆప్యాయతా లేదు. సరియైన పోషణ లేదు. పైగా శనిలా దాపురించారని తిట్టడం జరుగుతున్నది. కొట్టడం మామూలయి పోయింది. దేవుడిచ్చిన పిల్లలు అని వారూ వీరూ అనగా విని మొదట్లో అంతే కాబోలు అనుకుంది. సరిగా పోషించలేని స్థితిలో ఈ పిల్లలు ఇంతమంది ఎందుకు ? అని తనను తానే అనేకసార్లు ప్రశ్నించుకుంది. ఇద్దరు పిల్లలే ఉండి ఉంటే ఎంత బావుండేది. ఇన్ని కష్టాలు పెరిగేవా ? ఈ విషయానికి ప్రాముఖ్యం ఇవ్వడం జరగలేదు. అతి ముఖ్యమైన విషయాల్లో అలక్ష్యం చేయడం వల్లనే ఈనాడు తమ సంసారం ఇంత హీనస్థితికి దిగజారిపోయింది. చేయకూడని పని చేయబోతున్నట్లు, సిగ్గుపడి అశ్రద్ధ చేయడం జరిగింది. అలా జరక్కుండా ఉంటే ఎంత బావుండేది... జానకి ఇలా అనుకుంటూనే ఉన్నది. ఎప్పుడు పట్టిందో నిద్ర పట్టింది.

జీతపు రోజంటే మాధవరావుకు పెద్ద గండంలా ఉంటుంది. ఇవ్వవలసినవాళ్ళకి 'జీతం రాగానే ఇచ్చేస్తా' అని హుందాగా చెప్పి తప్పించుకునే అవకాశం మిగతా రోజుల్లో ఉంటుంది. ఇంకా అప్పులు కావాలన్నా అలా చెప్పి తీసుకోవటానికి ప్రయత్నం చేయడానికి ఆస్కారం వుంటుంది. కానీ ఆ జీతపు రోజున ఏదో ప్రళయం ముంచుకొచ్చినంత యాతన పడాల్సి వస్తున్నది.

జీతం తీసుకుని బయట అడుగు పెట్టేసరికి అప్పులవాళ్ళు ముసురుకునేవారు. వాళ్ళు అతనిపాలిట యమదూతల్లా కనిపించేవారు. ఒకసారి అతనికి ఏడుపొచ్చినంత పనయేది. 'నా ప్రాణం తీసుకొండి...పీడా విరగడవుద్ది...' అనేవాడు, 'భలేవాడివయ్యా...తీసుకునేప్పుడు కాళ్ళా వేళ్ళాపడి తీసుకుని ఇవ్వాల్సి వచ్చేసరికి ఇదటయ్యా నీవు మాట్లాడేది...పైగా చస్తానంటావా... చస్తే చచ్చేవుగానీ అప్పతీర్చి మరీ చావు బాబూ... పుణ్యముంటుంది. లేకపోతే అసలుకే మోసం...' అనేవాళ్లు కొందరు అప్పులవాళ్ళు. ఆ వ్యూహం నుండి ఎలాగో బయటపడేసరికి తలప్రాణం తోకకు వచ్చి సముద్రాన్ని లంఘించినంత పనయేది. మొదట్లో బాగా బాధ అనిపించినా రానురాను అలవాటు అయిపోయింది మాధవరావుకి. అయినా బా(?)లు రోజు రోజుకీ మరింత కృంగదీస్తున్నాయి. లెక్కలోకందని అప్పులు, అప్పుల తాలూకు అసలు కన్న ఊహకందని వడ్డీలు. అతని మొండితనాన్ని సహనాన్ని అగ్ని పరీక్షలకు గురిచేసినప్పుడు, నలుగురిలో కొత్తరకం అవమానం జరిగినప్పుడు 'ఎందుకీ పాడు బ్రతుకు, చస్తే...పీడ వదుల్తుంది' అనుకొనేవాడు. తిరిగి సంసార బంధం, భార్య, పిల్లల ఆర్తనాదం అతని పిరికితనాన్ని అపహేళన చేస్తూంటే దిగ్భ్రమ చెంది జుట్టుపీక్కుని కొంత సేపు ఎవరికీ కనిపించకుండా ఏడ్చేవాడు. ఏమైనా జీతపు రోజంటే మహా భయంకరమైన రోజు మాధవరావుకు. చాలా మందికి ఆ రోజు పండగయితే మాధవరావులాంటి వాళ్ళకి దరిద్రపు రోజు.

* * * *

ఆ రోజు మాధవరావు జీతం తీసుకొని తన సీటులో కూర్చున్నాడు. కాగితం కలం తీసుకున్నాడు. అత్యవసరంగా తీర్చవలసిన బాకీల సూచీ తయారు చేయడం ప్రారంభించాడు. ఎంత వేసినా లెక్క కుదరటంలేదు. ఒకదాని కొకటి తోడవుతూ కళ్ళెపల్లి చేంతాడంత లెక్కయింది. చేతికొచ్చింది రాసుకున్నాడు. పెదవి విరిచాడు. జేబు ఒకసారి తడివి చూసుకున్నాడు. గట్టిగా నిట్టూర్చాడు. తల పట్టుకున్నాడు. నుదిటిని కొట్టుకున్నాడు.

ఆఫీసులో అందరూ వెళ్లిపోయారు. తానూ లేవబోయి కూర్చుండిపోయాడు. బయటికి వెళ్ళాలంటే భయం వేస్తున్నది. రాబందులూ, తోడేళ్లూ గుర్తొచ్చాయి. 'చంటిదానికి జ్వరం ఎలాగుందో...' అనుకుంటూ డాక్టరు వ్రాసిచ్చిన మందు చీటీ జేబు నుంచి తీసి చూచి తిరిగి పెట్టేశాడు. 'పాపం జానకి ఎంత బాధ పడుతున్నదో...మందు తెస్తానని ఎదురు చూస్తూ ఉంటుంది... నేను వెళ్ళేసరికి చంటిదానికి జ్వరం తగ్గితే బావుంటుంది...' మాధవరావు అనుకుంటున్నాడు.

నలువైపులా చీకటి కమ్ముకుంటున్నది. చీకటిని చీల్చుకుంటూ లైట్లు వెలుగుతున్నాయి. 'మాధవరావు బాబూ ! ఇంకా ఇక్కడే ఉన్నారా...' కాపలావాడు లైటు వేసి ఆశ్చర్యంగా అడిగాడు. 'వర్షం వచ్చేట్లుంది బాబూ... త్వరగా ఇంటికెళ్ళండి... మబ్బులు బాగా కమ్ముకొస్తున్నాయి...' కిటికీ తలుపులు వేస్తూ! అన్నాడు కాపలాదారు-రంగయ్య. మాధవరావు ఏమీ మాట్లాడలేదు.

'ఏవిటో బాబూ మీ వాలకం చూస్తుంటే నాకేమీ అర్థం కావటమే లేదు. ఎలా ఉండే వోరు ఎలా ఉండేవోరు...రాజుబిడ్డలా. ఒకసారి డాక్టరుకు చూపించుకొండి బాబూ..., ప్రాణం బాగుంటేనే కద బాబూ ఏదయినా...అశ్రద్ధచేయకండి బాబూ...' రంగయ్య అన్నాడు.

ఒకసారి తనను చూచుకోవడానికి ప్రయత్నించాడు. బుగ్గలు తడుముకున్నాడు. ఒకప్పుడు నున్నగా మెత్తగా ఉండే బుగ్గలు ఎండి, బొమికలు పొడుచుకు వచ్చాయి. 'ఊరుకో రంగయ్యా నీవు మరీను. నాకేం బాగానే ఉన్నాను' మాధవరావు హేళనగా నవ్వుతూ అన్నాడు.

'ఏం ఉన్నారో బాబూ...మిమ్మల్ని చూస్తుంటే గుండె తరుక్కుపోతున్నదంటే నమ్మండి. జీవితమన్నాక ఏవో బాధలు అవీ తప్పవనుకొండి...ఎదో ధైర్యంగా నెట్టుకు రావాలి గానీ మీకింకా అనుభవం తక్కువ చిన్నోరు...' రంగయ్య అన్నాడు.

'చిన్నోణ్ణట చిన్నోణ్ణి...బుల్లిపాప అన్నాడు గాదు...ఆరో బిడ్డకు తండ్రిని కాబోతుంటేను...' తనలో తానే అనుకున్నాడు. 'రంగయ్యా కాఫీ తెచ్చిపెట్టు...నీవు కూడా త్రాగిరా...'అంటూ డబ్బులిచ్చాడు రంగయ్యకు.

'సరే బాబూ...' అంటూ రంగయ్య వెళ్లిపోయాడు.

లేచి కిటికీ సందులోంచి బయటకి చూచాడు. 'అమ్మయ్య ఇవాళ్టికి గండం గడిచింది...యమదూతలు ఎవరూ లేరు. అందరూ వెళ్లిపోయినట్లున్నారు...'గట్టిగా నిట్టూర్చి కొంత భారం దిగినట్లు తిరిగి కుర్చీలో కూర్చున్నాడు.

'ఈ భయం బ్రతుకు ఎన్నాళ్ళు ? తనను తానే ప్రశ్నించుకున్నాడు. తానూ జానకి ఎంత అన్యోన్యంగా ఉండేవాళ్ళు. చూచేవాళ్ళ కళ్ళు కుట్టుకు తినేవి. భవిష్యత్తు మరింత అందంగా, సుఖప్రదంగా, ఆనందదాయకంగా ఉంటుందని ఆశించిన తమ జీవితాలు కటిక దారిద్ర్యంలో ప్రగ్గి పోతున్నాయి.

జీతంలో ప్రతినెలా కొంత మిగిల్చి బ్యాంకులో వేసేవాణ్ణి. స్నేహితులకు అప్పులు కూడా ఇచ్చేవాణ్ణి. అలాంటి నా స్థితి ఇంత దిగజారిపోయిందే?

సైకిలు ఉండేవి, దాని బదులు స్కూటరు కొనాలని డిపాజిటు కట్టి రిజిస్టరు చేయించీ, చివరికి ఆ డిపాజిటు తిరిగి తీసుకోవటమే గాకుండా ఉన్న సైకిలూ తాకట్టు పెట్టి తిరిగి విడిపించుకోలేక పోయాను, ఎందుచేల్ల ?

అంతా నా దురదృష్టం. నా అదృష్టం బాగుంటే నేనను కున్నట్లే మా రోజులు బాగుండేవి. అంతా కర్మఫలం. తప్పదు అనుభవించాల్సిందే, ఎన్నాళ్ళో అన్నాళ్ళు తప్పదు.–తనకు తానే జవాబు చెప్పుకోడానికి ప్రయత్నించాడు మాధవరావు.

"ఏమి కర్మఫలమో తలెత్తుకుని తిరగలేని స్థితి. ఇదీ ఒక బ్రతుకేనా. అగౌరవంగా బ్రతికేకంటే చావడం మేలు..." అతనిలో పౌరుషం వెక్కిరించింది.

''చావాలేను, బ్రతకాలేను. జీవచ్ఛవంలా బ్రతుకుతున్నాను. చీమూ నెత్తురూ లేనట్లూ గడుపుతున్నాను. హా భగవంతుడా..." తనలో తానే గింజుకున్నాడు. గడియారం టకటక కొట్టుకుంటూ తన పని తాను చేసుకుపోతున్నాది. కొన్నిక్షణాలు గడియారం వంక రెప్పార్పకుండా చూశాడు. 'ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు......ఏడు......ఎ...ని...మి...ది...'' గడియారంలోని అంకెలను లెక్కపెట్టాడు. ఎనిమిది అనేసరికి తన కుటుంబం గుర్తుకొచ్చింది. 'అవును తానూ, జానకీ, ఐదుగురు పిల్లలు...ఎనిమిదో...ప్రాణం పోసుకుంటున్న ఆరో బిడ్డ... మొత్తం తమ కుటుంబ సంఖ్య ఎనిమిదవుతుంది...' గుండె గతుక్కుమంది మాధవరావుకి. 'పరో ప్రాణం మాకు తోడు... ఉన్నవాళ్ళకే లేక చస్తుంటేను...నీకెక్కడ నుండి తెచ్చేది... ఆ వంటిదానికి జ్వరం వచ్చి డాక్టరు మందు లెమ్మంటే తేలేక తేల గుడ్లు వేసిన నేను నీకూ ఎక్కడి నుండి తెచ్చి పెట్టగలను...మాకే సరిగా లేకపోతే నాకూ భాగం ఇమ్మని కూర్చుంటే ఎలా ఇచ్చేది... వీల్లేదు...వీల్లేదు...నీకేమీ పెట్టను, నీకేమీ చూడను...నీకేమీ తేను...' మాధవరావు గొణుక్కున్నాడు.

'ఎందుకు పెట్టవు...చూస్తా లొట్టలేసి మరీ తింటాను... పీక్కుతింటాను... అంత పెట్టలేని వాడివి ముందే ఆలోచించుకో నక్కరలేదా...నేను పుట్టడానికి నీవేగా కారణం...ఎందుకు పెట్టవో చూస్తాను...పెట్టకపోతే అడుక్కుతింటాను...ఫలానా మాధవరావు బిడ్డ అని నలుగురూ అనుకుంటుంటే జవాబు చెబుదువుగానీ... అమ్మా !!! బాధ్యత నుండి తప్పుకోవాలని చూస్తున్నావే...?' నిలబెట్టి అడిగినట్లయింది. 'అవును అదీ నిజమే...తప్పంతా నాదే...తెలిసీ తెలియనట్లు ప్రవర్తించటమే పెద్ద తప్పు. అన్నీ తెలిసీ మూర్ఖునిలా ప్రవర్తించటం క్షమించరాని తప్పు. తప్పే కాదు పాపం కూడా ... చేయి కాలేక గానీ ఆకులు పట్టుకోం, ముందే జాగ్రత్త పడితే చేయి కాలేదనీ ఉండదు, ఆకులు వెదుక్కొనే పనీ ఉండదు...'అంటూ చెంపలు వేసుకున్నాడు. 'ఇప్పుడే ఇలాఉంది. పిల్లలు పెద్దవాళ్ళవుతుంటే ఖర్చు మరీ పెరుగుతుంది. వాళ్ళకు చదువులు చెప్పించగలనా ? మంచి భవిష్యత్తు చూపగలనా ??...' ఇలా అనుకుంటుంటే మాధవరావు గుండెలు మరింత వేగంగా కొట్టుకున్నాయి. 'మొదటి ఒకరిద్దరు పిల్లలతో సరిపెట్టుకుంటే తనకీనాడు ఇన్ని కష్టాలుండేవా ? తనకిన్ని అప్పులు ఉండేవా ?? ఇంత దారిద్ర్యాన్ని అనుభవిస్తూ ఉండేవారమా ? ఇదంతా స్వయం కృతాపరాధం...ఇంత విశాల దృక్పథంతో ఇంతకుముందు ఎందుకు ఆలోచించలేకపోయాను... కష్టాలను చేజేతులా 'కొని తెచ్చుకొన్నా. పుట్టిన పిల్లలకు కావలసినవి సమకూర్చలేక పోతున్నా. ఒక ముద్దూముచ్చటా లేదు ఇంట్లో...ప్రేమించి కట్టుకున్న జానకి అనరాని మాటలు ఇష్టం వచ్చినట్లన్నా. కలసిన మన హృదయాలలో అందని అఖాతాలు ఏర్పడ్డాయి. ఎలాంటి జానకి ఎలా అయిపోయింది...ఆనంద సీమగా, సౌఖ్యధామంగా ఉండవలసిన తమ సంసారం నరక ప్రాయమయింది. మాలాంటి సంసారాలు ఈ ప్రపంచంలో ఎన్ని ఉన్నాయో...!

తన సంసారం పెరిగినంతగా ఆదాయం పెరిగిందా... పెరిగినా బావుండును...ఏ లాటరీ అన్నా వస్తే బావుండును...ఎక్కడైనా లంకె బిందెలు దొరికితే బావుండును... ఛ! ఏమిటి ఆలోచనలు మరీ పిచ్చిగా వస్తున్నాయి....మాధవరావు అనుకున్నాడు. రంగయ్య కాఫీ తీసుకొచ్చాడు.

'తడిసి పోయినట్లున్నావే...' మాధవరావు అడిగాడు కాఫీ గ్లాసు తీసుకుంటూ. 'ఫరవాలేదు బాబూ నేను ఇక్కడే ఉంటానుగా...మీరు ఇంటికెట్లా వెళతారు...మా జోరుగా కురిసేట్టున్నది బాబూ...' చొక్కాతీసి ఆరేస్తూ అన్నాడు రంగయ్య. 'ఏమి ఇల్లో...' మాధవరావునిట్టూర్చి కాఫీ చప్పరించాడు. వర్షం పెద్దదయింది. గాలి జోరు తీవ్రతరమైంది. తలుపులన్నీ వేశాడు రంగయ్య. 'ఏమిటి బాబూ అలా అంటారు...అందులో ఇవాళ జీతాల రోజు. అమ్మాయి పిల్లలు ' రంగయ్య అన్నాడు,

'ఏమిటో రంగయ్యా మహాబాధలు పడిపోతున్నాం...వచ్చే జీతం దేనికీ చాలటంలేదు... ఏంచెయ్యాలో ఏమో తోచటమే లేదు...' మాధవరావు నిట్టూరుస్తూ అన్నాడు. 'అంతేబాబూ ఏం జేస్తాం, సంసారం పెరుగుతున్నకొద్దీ ఇబ్బందులు తప్పవు బాబూ...మంది పెరిగితే మజ్జిగ పల్చనవుద్దని మా అమ్మా అంటుండేది...ఆ మాటలోని అర్థం ఇప్పుడిప్పుడే తెలుస్తున్నది..." రంగయ్య అన్నాడు, 'అవును' అన్నాడు మాధవరావు. వాతావరణం భీకరంగా మారిపోయింది. గాలి, వాన, పిడుగులు, మెరుపులు...' ఈ వర్షానికి కొన్ని కొంపలు కూలిపోతాయి తప్పదు, ఎందరో నీడకోసం వెదుక్కుంటూ ఉంటారు. ఇంటి దగ్గర జానకి, పిల్లలు ఎంత ఇదయిపోతున్నారో...తను త్వరగా ఇంటికి వెళ్ళినా బావుండేది ' మాధవరావు అనుకున్నాడు,

'మంది ఎక్కువయితే మజ్జిగ పల్చన' అన్న రంగయ్య మాటే ఒకటికి పది సార్లు మనసులో కదులుతున్నది. 'పాపం జానకి మనసు ఎంత బాధ పడుతున్నదో. మనసు కంటె శరీరం ఎంత కృశించి పోయింది. ఈ మాత్రమైనా బ్రతికి దానికి, జానకి మంచితనం, ఓదుపు! సహనమే......... అనుకున్నాడు. జానకి మీద ఎక్కడలేని జాలి కలిగింది. ఏదో నిర్ణయానికి వచ్చినట్లు లేచి బయలు దేరబోయాడు.

ఎక్కడో పిడుగు విరుచుకు పడి చెవులు చిల్లులు పడేట్లు అరిచింది. అదిరిపోయాడు మాధవరావు. రంగయ్య చెవులు మూసుకుని 'అర్జున అర్జునా......' అంటున్నాడు.

'ఏమి వర్షం, కుండపోతగా కురుస్తోంది బాబూ......' రంగయ్య అన్నాడు. ఒకనాడు సినిమా జానకి షికారు కెళ్లినప్పుడూ ఇలాగే వర్షం, పిడుగులు...... మాధవరావుకు గత స్మృతి ఒకటి మనసులో మెదిలింది. జానకి అమ్మో అంటూ తనను పెనవేసుకు పోయింది. 'నేను ఉన్నాను. నీకేం భయం లేదు' అన్నట్లు ఆమె తల నిమిరాడు. ఆమె నవ్వుతూ చూచింది, తానూ నవ్వులో నవ్వు కలిపాడు. ఆమెను మరింత దగ్గరకు తీసుకున్నాడు.

'ఈ పిడుగు పాటుకు ఎంత భయపడిందో జానకి......అను కున్నాడు. అప్పుల వాళ్ళకి, దారిద్ర్యానికి జడిసి జీవితాన్ని దుఃఖ మయం చేసుకుంటున్నాను. ఈ అప్పులకు, దారిద్ర్యానికి కారణం నేనే. ఒక సారి జానకి 'ఇద్దరు పిల్లలు చాలండి మనకి. వాళ్ళనూ పైకి తీసుకురాగలం, మనకూ సుఖంగా ఉంటుంది, ఏమంటారు' అన్నది. కాని అప్పుడే జాగ్రత్త పడితే ఎంతో హాయిగా ఉండేది. ముందు చూపు లేక ఇప్పుడీ అవస్థ......' మాధవరావు అనుకున్నాడు. 'మరి ఎందువల్ల ఆచరించ లేకపోయాను......అవును సరేనంటూ దాటేస్తూ వచ్చాను ఎప్పటికప్పుడు...'నవ్వొచ్చింది అతనికి.

'ఏమిటి బాబూ నవ్వుతున్నారు ?' రంగయ్య అడిగాడు.

'నా తెలివి తక్కువకు రంగయ్యా... నాలో నాకు తెలియ కుండా దాగి ఉన్న బలహీనతకు, నాకు తెలియకుండా నాలో పని చేస్తున్న మూర్ఖత్వం నన్ను వంచించినందుకు..." మాధవరావు అన్నాడు.

'ఏమిటో బాబూ మీ మాటలు......'రంగయ్య బుర్ర గోక్కుంటూ అర్థంకానట్లు చూశాడు. లైట్లు ఆరిపోయాయి.

'మా ఇంటికాడెట్లా ఉందో బాబూ......గుడిసె కొట్టుకు పోయిందేమో......ఆళ్ళంతా ఏమయి పోనారో బాబూ......' రంగయ్య బాధపడుతూ అన్నాడు.

'ఏం కాదు రంగయ్యా......ధైర్యంగా ఉండు...'ధైర్యం చెప్పాడు మాధవరావు.

*　　　*　　　*　　　*

'జానకీ......జానకీ......'తలుపు కొట్టాడు మాధవరావు.

ఎటు చూచినా కీచురు మంటున్నది. నీళ్ల పారుతున్న ధ్వనులు. కరెంటు ఇంకా రాలేదు.

'జానకీ......జానకీ......'మళ్ళీ కొట్టాడు తలుపు.

గడియారం పన్నెండు గంటలు కొట్టింది. లోపల ఏదో పడిన చప్పుడయింది. ఎవరు...అంటూ జానకి తలుపు తీసింది.

'నేనే జానకీ... 'కళ్లింత చేసి చూచినా సరిగా కనపడటం లేదు.

'వచ్చారా......' తూలి పడబోయింది జానకి. మాధవ రావు పట్టుకున్నాడు.

ఆమె శరీరం వెచ్చగా తగిలింది. జ్వరంగానీ, రాలేదు కద జానక్కి కూడా...అనుకుని ఆ మాటే అడిగాడు. నాకేమందీ బాగానే ఉంది...చంటిదానికే...జ్వరం పేలిపోతున్నది......నాకు ఎప్పుడు పట్టిందో నిద్ర, మాయదారి దాన్ని...' విసుక్కుంది.

'మందు తెచ్చాను జానకీ...దీపం వెలిగిస్తానుండు...' అన్నాడు.

'దాంట్లో కిరసనాయిలు లేనట్లుంది...మైనపొత్తిముక్క ఎక్కడో ఉండాలి...' జానకి అంది. 'నేను చూస్తాను జానకీ నీవు కూర్చో...నిన్ను చాలా కష్టపెడుతున్నాను జానకీ...అంటూ మైనపు వత్తి ముక్క వెదికి వెలిగించాడు ఆతురతగా.

'పాపకు మందేద్దాం అంటూ పాపను తీసుకోబోయి 'ఒళ్లు బాగా చల్లగా ఉందే...జ్వరం ఏమీ లేదు...' అన్నాడు మాధవరావు ఆశ్చర్యంగా.

'ఆ...మీరు మరీను...ఇప్పటిదాకా పేలిపోతేనూ...నిప్పు ముద్దను పట్టుకున్నట్లుంది......అంటూ పాపను చేత తీసుకున్న జానకి '...పా...'అని కెవ్వుమంది. క్రింద పడిపోయి 'అమ్మో బాధ' అని మెలికలుతిరిగి పోతున్నది.

'జానకీ ! జానకీ ! ఏమిటి బాధ' మాధవరావు అడిగాడు.

కడుపులో బాధ...అబ్బా...అమ్మో 'జానకి సరకయాలన పడిపోతున్నది.

లైటు క్షణం మెరిగి ఆరిపోయింది. రక్తంలో జానకీ బట్టలు తడిచి వుండటం చూచిన మాధవరావు 'జానకీ !' అని అరచాడు. కర్తవ్యం గుర్తుకురాగా–నిన్నెలాగయినా బ్రతికించు కుంటాను. జానకీ ! డాక్టరును తీసుకువస్తాను ''అంటూ పరుగున బయలు దేరాడు.

# జాషువ కవితాకుమారి

సి. వి. సుబ్బన్న శతావధాని

"ఉపమ గలిగిన శయ్యల నొప్పియున్న అంధ్రభిభవుని కావ్యంబు గ్రాహ్యంబుగాదు"అని అప్పకవి ఘోషించినాడు, కాని చేమకూర వేంకన్న విషయంలో తానే పొరపాటుపడినాడు.

చేమకూర వేంకన్న బ్రతికియుండగా అతని కావ్యాలకు అంత ప్రశస్తి వచ్చినట్లు కన్పించదు పాపం. "ఏ గతి రచియించి రేని సమకాలమువారలు మెచ్చరేకదా" అని, మనిషి మొగంచూచి కావ్యాలను మెచ్చజాలరనే పెద్దమనుష్యులమీద ఆశ వదులు కొన్నాడు. "కాలో హ్యయం నిరవధి" అనుకొని ముందుచూపుతో నడిచినాడు. తరువాత అతనికి బ్రహ్మాండమైన కీర్తివచ్చింది.

జాషువకవి తనకాలంలోనే తాను మంచికీర్తి ప్రతిష్ఠలు సంపాదించుకొన్న భాగ్యశాలి. ఈయన "అంధ్రభిభవుడు" కాడు కనుక ఈయనకు అప్పకవిమాట అడ్డురాలేదు. పురాణగ్రంథాల ప్రకారం వర్ణములు నాలుగే అయిదవ వర్ణంలేదు. "పంచమకులము దెవ్వడమ్మా ! సవిత్రి" అని జాషువకవి ఎరతిమాత నడిగెను. ఆమె పలుకలేదు. అదేమి రహస్యం కాదు. ఆదికాలంలో అగ్రవర్ణుడు రాజద్రోహం చేస్తాడనుకోండి. లేదా ఖూనీలు చేస్తాడనుకోండి, ఆయనకు ఉరిశిక్షలేదు. తల గొరిగివేయరు. సగౌరవంగా ఊరి బయటికి పంపిస్తారు. అదే శిక్ష. ఆ బ్రాహ్మణుడు ఊరి బయటనే గుడిసె కట్టుకుంటాడు. సంసారం చేస్తాడు. అతడే పంచముడు, అతడు బ్రహ్మచండాలుడు. అతనికి పుట్టేవాళ్ళు చాండాలురు. పూర్వం బాగా బ్రతికిన వాళ్ళు గనుక వీళ్ళను "పెద్దింటి వాళ్ళు" అంటారు. ఎట్లైనా జాషువ అగ్రవర్ణుడు. అందుకే ఆయన కవితాకన్యలను అగ్రవర్ణస్తులే స్వీకరించినారు. వారి కన్యలనుగూడవాళ్ళే స్వీకరించి నారు.

నిజానికి కులాలులేవు. నిరాకారుడైన పరమేశ్వరునికి సంఘమే ఆకారమిచ్చింది. "ముఖం కిమస్యాసీత్ ?" "బ్రాహ్మణోస్య ముఖ మాసీత్" (యజుర్వేదము) నున మిలిటరీ అంతా భగవంతునిచేతులు—విమానదళం ఒకచెయ్యి, పదాతిదళం ఒకచెయ్యి, ఇట్లే తక్కిన అంగాలు. పరమేశ్వరుని ముఖంగా చలామణి అయ్యేజాతి ఉన్నదే—విద్వజ్జాతి—ఆ జాతికి చెందిన వాడు జాషువ.

జాషువ సిద్ధహస్తుడైనకవి. ఈయన పట్టినదంతా బంగారం. నిజమైన శిల్పికి తన శిల్పకళానైపుణి చూపడానికి వస్తువు ముద్దబంగారమే కావలెననిలేదు : బంకమట్టి అయినా సరే. జీవకళ ఉట్టిపడేలాగున దిద్ది తీరుస్తాడు.

"ముంతాజమహల్" కృతిలో జాషువ ఒక బైరాగిని ప్రవేశపెట్టినాడు. వాడు శ్మశానవాసి. బొమ్మలు చేస్తాడు, శిలతో కాదు. కొయ్యతోకాదు — బూడిదతో చేస్తాడు, శవభస్మంతో చేసిన ఆ బొమ్మకే పాటుపా పష్టపెట్రజా ప్రకటిస్తాడు, బంగారుతీవ్వల మొగాలు చెల్లవారెను.

అల్పాదికారు ఎందరో తెలుగులో పురాణపథలు వ్రాసి కాసోహస్తో పేరు సంపాదించుకొంటున్నారు. జాషువ ఆ త్రోవ పట్టలేదు. ఆయనకు అవసరం లేకపోయె.

ఈ విషయ మొక ఆట వెలది ఎంతచక్కగా వివరిస్తాడో చూడండి. "కవిత చెప్పగలుగు కథపేరు గలదైన కవికి కొంతకీర్తి కలుగవచ్చు ; తెలుగు తక్కువైన బలమైన రెండిటే నుసురు నిల్పుకొన్న ది నవోర."

ఈ పద్యం వేసిన పద్యాలతో కలిపితే గంగలో సరస్వతి కలంవలె కలిసిపోతుంది. పదాల ప్రోగులోనుంచి ఉసిరిక కాయలు ఎంచి పెట్టినట్టుండును, చిక్కని పాకము, అంతామాస్తే వేసిన యోగి కనిపిస్తాడు. ఉత్తరార్ధానికి ఉత్తరార్ధం, పూర్వార్ధానికి పూర్వార్ధం సరియైన దూరంలో ఉంది, ఉపమ పొంది పొసగిన దంటే యీ పద్ధతి కాదాసేయుం. వేయున్నకు కాళిదాస కావ్యం గురుపీఠం, జాషువ ఆపీఠ సంప్రదాయంవాడు.

జాషువ—"మొత్తముమీద, నాంధ్ర కవిముఖ్యులు పెంచిన కట్టువాట్లలో" నడిచినవాడు. "సువిస్తృత లోకపుదు కవిత్వపు నక్క అనాదరించెదన్" అన్నవాడు.

ఆంధ్రకవనంబు— "ఛందోబద్ధముగా ప్రవస్పుటముగా జాతీయశబ్దాలతో అందంబుగా తొలకాడ" నుండవలెనని యీయన సిద్ధాంతము. (రాష్ట్రపూజ)

ఇన్ని సద్గుణములు ప్రకాశించే ముగ్ధ జాషువ కవితా కుమారి, ఆమె అందచందాలు చూచి రసిక మహాశయులు ఎంతైన ఆనందించవచ్చు. కవి మొగంచూచి, "మీదే కులమన్న ప్రశ్న వెలయించి చివాలున లేచి"పోరాదు. పోతే "వాకున గ్రుమ్మినట్లగును" అనెంద ప్రవాశమైన కవికి చేసే సత్కారం అదేనా ? కాదు. తెలుగువారు సరసులు, ఉదారులు, ఏనుగు లెక్కిస్తారు. గండపెండేరం వేయిస్తారు.

జాషువకవి అమరుడు, వాఙ్మయ ప్రపంచంలో ఆయనకు మృతిలేదు.

# భావకవి చంద్రుడు బసవరాజు అప్పారావు

— శ్రీ చెకూరి చెన్నకృష్ణయ్య

ఆగ్రా నగరంలో ఒక నాడు పత్నీ సమేతముగ పండు వెన్నెలలో అప్పారావు గారు తాజ్‌మహలును తిలకించి పరవశించి పోయారు. రసాప్లుతమైన ఆనాటి వారి హృదయ స్పందనయే తాజ్‌మహల్ గేయముగ రూపొందినవి.

మామిడి చెట్టును అల్లుకొన్నది
మాధవీలతొకటి
యేమా రెండిట ప్రేమ సంపదా
ఇంతింతనలేమా

చూడలేని పాపిష్టి తూఫానూ
ఊడబీకె లతనూ
మోడై పోయి మామిడి చెట్టూ
మొగము వేలవేసి

..................................

మామిడి చెట్టూ మాధవి లతతో
మాయలో కలిసింది
కామిత మిచ్చే మామిడి పండూ
కవులకు మిగిలింది.

అకాల మృత్యువువాత ముంతాజ్ బేగము పడిపోయినదని కవి హృదయం ఆక్రోశించింది. షాజహాన్ చక్రవర్తి ప్రేమ చిహ్నమే తాజ్‌మహలుగ రూపుగట్టి సాక్షాత్కరిసుందిగదాయని ఊరట జెందినది.

అప్పారావు గారి జీవిత గాథకు ఈ గేయ పంక్తులు భాష్యముగ వరలు చున్నవి. మామిడి చెట్టుకు చుట్టుకొన్న మాధవీలతను పాపిష్టి తుఫాను పొట్టలో పెట్టుకొంటే, అప్పారావు జీవిత గాథలో మామిడి చెట్టునే కూకటి వ్రేళతో ఝుం ఝా మారుతము పెకలించి వేసింది. ముప్పది తొమ్మిది సంవత్సరములు నిండకనే కవి, విమర్శకుడునైన అప్పారావు గారు కన్ను మూసారు. (10, జూన్, 1933). ఆంధ్ర సాహిత్య లోకమునకు రసాల ఫల సదృశములగు వారి గేయములు, కథలు, వ్యాసములు మాత్రము మిగిలి పోయినవి.

అప్పారావుగారు పుట్టుభోగి. "మేక పిల్ల తోడేలుతో మించి పోరినట్టి మేల్ పోతుగడ మా పట్టణమ్ము" అని, ధీమాతో చెప్పుకొన్న నూజివీడు కవిగారి జన్మ భూమి. నూజివీడు సంస్థానములో దివానులుగ, దాన ధర్మ శీలురుగ పేరు వాసిన బసవరాజు గారి కుటుంబములో 13 డిసెంబరు, 1894 తేదీన అప్పారావు గారు జన్మించినారు. పుట్టిన రెండు సంవత్సరములలో మాతృమూర్తి వెంకమ్మ గారిని గోల్పోయినారు. తండ్రి గారైన పిచ్చయ్య గారు తిరిగి వివాహమును జేసికొనుటకు మనస్కరించక అప్పారావు, అతని అప్ప (నాలుగేండ్ల బాలికతో) విజయవాడకు మూడు మైళ్లలో నున్న పడమట గ్రామ మందలి అత్తగారింటికి కాపురం మార్చారు.

అప్పారావుగారి మాతా మహులు గోవిందరాజు వారు ఆగర్భ శ్రీమంతులు. జమీందారీ కుటుంబము. తల్లిలేని లోటు కాన రానీయక తాత, మేన మామగార్లు, అత్తలు, మిాదుమిక్కిలి అవ్వగారు అప్పారావు గారిని పెంచినారు. వీధి బడిలో విద్యాభ్యాసం జరిగింది. విద్యావంతులగు తాత గారు, మేన మామలు అప్పారావు గారి చదువు సంధ్యలలో అమిత శ్రద్ధ వహించి చక్కని పునాదులు వేసినారు.

వీధి బడి చదువు ముగిసినంతనే విజయవాడ సి. యమ్. ఎస్. స్కూలులో స్కూలు ఫైనలు చదివి, తర్వాత ఇంటరు నుండి బి. యల్. వరకు మద్రాసులో చదివారు. పాఠ్య భాగముల శ్రద్ధ వహించి చదివినది లేదు. కాని సాహిత్య గోష్ఠులలో ప్రొద్దులు పుచ్చెడి వారు. ప్రత్యేకించి విద్యా సంస్థగ పరిగణింప బడినారు. కురుగంటి సీతారామయ్య, రాయప్రోలు సుబ్బారావు, నండూరి సుబ్బారావు, పాటిబండ అప్పారావు, కోలవెన్ను రామకోటేశ్వరరావు, అడవి బాపిరాజు గారు మున్నగు సాహిత్య ప్రియులు, యువ కవులు అప్పారావు గారితో సాహిత్య గోష్ఠులలో పాల్గొనే వారు. ఇంటరు చదివెడి రోజులలో గేయములు, విమర్శన వ్యాసములు వ్రాయ ప్రారంభించినారు. ఆంధ్ర పత్రిక, గ్రంథాలయ సర్వస్వము మున్నగు పత్రికలలో వీరి కృతులు ప్రచురితములయ్యెడివి. దేశోద్ధారక నాగేశ్వర రావు గారిచే స్థాపింపబడిన 'భారతి' మాస పత్రికలో బి. యల్. చదువుచు సహాయ సంపాదకులుగ చేరి, సమర్థవంతముగ సంపాదకత్వం నిర్వహించినారు. ఆ రోజులలో అరేబియన్ నైట్సు కథలను తెలుగులో అనువదించినారు. ఆంధ్ర కవిత్వ చరిత్రను రచించినారు.

అప్పారావుగారు సాహిత్య వేత యే గాక దేశాభిమాని. మాతృ దేశ దాస్య శృంఖలముల ఛేదించి, దేశస్వాతంత్ర్యమును పునః ప్రతిష్ఠింప వలయునని ఉద్ఘాత లూగెడి వారు. ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాల కృష్ణయ్య గారితో చేతులు గలిపి, శక్తి వంచన లేక స్వాతంత్ర్య సమరములో పని జేసినారు. సహాయనిరాకరణో ద్యమమున మహాత్ముని పిలుపు ననుసరించి చీరాల, పేరాల గ్రామముల నుండి ప్రజలను యిసుక తిన్నలపై వెలసిన గుడారములకు మార్చిన దుగ్గిరాల వారికి చేదోడు వాదోడుగ నుండి అప్పారావు గారు సహకరించినారు.

దేశ నాయకులపై వారికి గల భక్తి ప్రపత్తులు వర్ణనాతీతము. నాయకులతో కలసి, వారి సేవలో, సంప్రదింపులలో, చర్చలలో కాలము గడుపుటకు ఉత్సహించుచుండెడి వారు. రసవత్తరములగు వారి గేయములు, వారు దేశ నాయకులచే ప్రభావితులై నపుడు వారి కలము నుండి జాలువారినవే. వారి జీవిత కాలములో జరిగిన కాంగ్రెసు సమావేశములన్నిటికి హాజరైనారు. నందికొండలలో [మైసూరు రాష్ట్రము] మహాత్ముడు విశ్రాంతి తీసుకొనుచుండగా, అచటికి సతీ సమేతముగ పోయి వారి సేవలో నిమగ్నులై నారు. గాంధీజీ పూత చరిత్రముతో ప్రభావితులై నందికొండల మీద నున్న నాళ్లలో ఎన్నియో గేయములు వ్రాసినారు.

చకచక నడిస్తేను
జగతి కంపించేను
పలుకు పలుకుతేను
బ్రహ్మ వాక్కేను —అనే గేయం.

కొల్లాయి గట్టితేనేమి మా గాంధి
కోమటై పుట్టితేనేమి—అనే గేయం

అనాడు వ్రాసినవే. కలకత్తా నగరములో చిత్తరంజన్ దాస గారిని సందర్శింప బోయినారు. అస్వస్థతతో డార్జిలింగులో ఆసుపత్రిలో చికిత్స పొందుచున్నారని తెలిసినది. అచటకి పోయి వారిని దర్శించినారు. అప్పారావుగారచ్చట నుండగనే చిత్తరంజన్‌దాసు గారు మరణించినారు. వారి శవముతో పాటు కలకత్తా చేరుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. ఆ సందర్భములో "ఊరేగింపు" అనెడి గేయము వ్రాసి తన హృదయావేదన వెలి బుచ్చినారు.

"ఊరేగు మన్మథా ఊరేగ వోయి"
పెండ్లి కొడుకులాగు పల్లకీఎక్కి—ఊరేగు

అనుచు ఆవేశమున గుండెలలోనుండి దుముకుకొని వచ్చెడి భావమునకు రూపు గట్టించినారు. ప్రాణాధికమిత్రుడగు ఆంధ్ర రత్న దుగ్గిరాలవారు పరమపదించగా వాపోయి "యమునా సాంత్వన" మనే గేయమును రచించారు. అప్పారావు గారు యమునా కల్యాణి రాగము శ్రావ్యముగ ఆలాపించెడి వారు. దుగ్గిరాల వారు అప్పారావు గారిని యమునా కల్యాణి రాగములో పాట పాడించి వినుచుండెడి వారట. అందులకే దుగ్గిరాల మరణించినపుడు యమునా సాంత్వనమును యమునా కల్యాణిలో ఆలాపించి విలపించినారు.

అలహాబాదునకు వెళ్లి మోతీలాల్ జవహరులతో సంప్రదించి నారు. శాంతినికేతనమునకుబోయి రవీంద్రనాథ్ టాగూరు గారితో సాహిత్య గోష్ఠిలో కాలము పుచ్చినారు.

జీవితములో అప్పారావు గారికి ధనలోపము గలుగలేదు. సాహిత్య లోకమున, స్వాతంత్ర్య సమరమున నిరంతర కృషి చేసియు పోరాడియు కీర్తి గాంచినారు. ప్రేమించిన మేనమామగారి కూతురు శ్రీమతి రాజ్యలక్ష్మమ్మగారిని వివాహమాడినారు. ఆయమను కవయిత్రిగ తీర్చి దిద్ది ఆనందించినారు. కాని ఒక్క లోపము వారిని కృంగ జేసినది. ప్రాణములను హరించినది. మంగళ ప్రద పుట్టిన సంవత్సరములో గతించినది. వేద్రాద్రి నృసింహుడు జన్మించి కవి హృదయం కరగించి, "దీపావళి" "జేజేలు" "పాపాయి లీలలు" మున్నగు గేయముల వెలయింప జేసినాడు. పది నెలలలో నృసింహుడు తరలి పోయినాడు. "ఉప శాంతి" "జీర్ణం జీర్ణం" గేయాలతో ఉప శాంతి జెందినారు అప్పారావుగారు. నవనీత సమానమైన కవి హృదయం ఈ సమ్మెట పోటు భరింప జాలక పోయినది. మనోవైకల్యం గల్గినది. చేయించిన చికిత్సలు వ్యర్థములైనవి. కుమ్మనూరను మారు మూల గ్రామములో నాటు వైద్యములో చికిత్స పొందుచు 10 జూన్, 1933 తేదీన దీర్ఘ నిద్ర జెందినారు.

ప్రత్యేకమైన శైలి నేర్పరచుకొని, సూటిగా, నగ్నంగా రచనలు సాగించే వారు. జిలుగు తళుకులకు వీరి కవిత్వములో తావు లేదు. కవి అంతర్ముఖుడై తన కోసమే రచన సాగించు నటుల గన్పించును. నవ్యకవులలో తలమానికమై, భావ కవులకు మార్గదర్శకుడై విరాజిల్లుచున్నాడు.

---

**దేశ రక్షణ నిధికి విరివిగా విరాళాలు యివ్వండి**

---

# వార్తలలో చిత్రాలు








## భగవంతునికి భక్త్యంజలి

భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి ఫిబ్రవరి 4వ తేదీన తిరుమలలోని శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయాన్ని సందర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు కూడా వీరి వెంట వెళ్ళారు. ప్రధాని ఆలయ సందర్శన దృశ్యాలు కొన్ని యిక్కడ ప్రచురిస్తున్నారు.

[ఫొటోలు: శ్రీధర్స్ ఎ.పి ప్రెస్ ఫొటో సర్వీస్, హైదరాబాదు.]








సీరియల్

# సోమదేవరాజు

## 3

సోమదేవరాజు ఏదో ఆలోచిస్తున్నాడు. అతడు యువకుడు ఆజానుబాహుడు చాల అందమైనవాడు. మెలిదిరిగిన కండరాలు కలిగినవాడు. నెమ్మోములో మంచి ఆకర్షణ వున్నవాడు.

సోమదేవరాజు ఆనెగొందిని పరిపాలిస్తున్నాడు. ఆనెగొంది చాల చిన్నరాజ్యం.

తుగ్లక్ దక్షిణాపథంమీదికి దండెత్తి వచ్చినప్పుడు అతని ధాటికాగలేక సోమదేవరాజు తండ్రి పరుగిడిపోయాడు. ప్రవాసంలోనే అతడు మరణించాడు. ఆ కాలంలో చిన్నవాడైన సోమదేవరాజు, అతని సోదరీమణియైన అన్నమాంబ చాల ఇడుములు బడ్డారు. కాని ఆ కష్టాలు వారికెన్నో గుణపాఠాలు నేర్పినవి.

తన తండ్రిగారు తాము ఒకచోటినుండి మరొక చోటికి మహమ్మదీయ సేనచేత తరుమబడుతున్నప్పుడు తిండిలేక తీర్థాలులేక తామెన్ని అవస్థలు పడ్డారో ఆ రాజు మరచిపోలేదు. ఒకచోటి నుండి మరొకచోటికి వెడుతున్నప్పుడు, పగళ్లనక రాత్రుళ్లనక నడవవలసినప్పుడు తన చెల్లి ఎంతగా కష్టపడుతుండేదో, ఆమె పాదాలు గుచ్చుకొని నెత్తురొచ్చినప్పుడతని గుండె యెలా చెక్కలయ్యేదో అతడిప్పటికీ మరచివుండలేదు. శత్రువుల బారినుండి తప్పుకోవడానికి తండ్రి, తాను, తన చెల్లి మారువేషాలు వేసుకొన్న విషయం, ఎన్నోచోట్ల దాక్కొన్న విషయం ఇప్పటికీ అతని కళ్లకు కట్టినట్లేవుంది. అన్నమాంబగూడ పురుషవేషంతో ముందు వెడుతుంటే తన్నుతానే చూచుకొన్నట్లుండేది ఆ రాజుకు. అతని తండ్రిగూడ తానెవరో, తనచెల్లి యెవరో గుర్తుపట్టలేకపోయేవాడు. తాను, తన చెల్లి కవలపిల్లలని చూచినవారందరూ భ్రమసిపోయేవారు.

అన్నమాంబ ఆడుబిడ్డ యైనప్పటికీ తన సోదరునికి తీసిపోయినదిగాదు. ఆమెగూడ చాల బలపరాక్రమాలు గలిగినది. ఆ కష్టకాలంలో ఆత్మరక్షణకోసమని ఖడ్గవిద్యతోపాటు విలువిద్యను గూడ నేర్చుకొన్నది. స్వారిచేయడంలో తన సోదరుణ్ణి మించిపోయింది. ఒకటిరెండు సార్లు శత్రువులతో పోరాడవలసివచ్చినప్పుడు తన ఖడ్గవిద్యా నైపుణ్యాన్ని చక్కగా ప్రదర్శించి, రెండవ రుద్రమ్మలాగా వెలసింది.

సోమదేవరాజు తన చెల్లెల్ని అన్నమదేవరాజని పిలిచేవాడు. ఆమె పురుషవేషంలో వున్నందువల్ల అందరూ ఆమె నాపేరుతోనే పిలుస్తుండేవారు. ప్రవాసం నుండి వారు ఆనెగొంది చేరి అచ్చట స్థిరనివాసం ఏర్పరచుకొన్న తరువాతగూడ ఆమె పురుషవేషంతోనే వుంది. అన్నమదేవరాజనే పిలువబడుతూవుంది.

సోమదేవరాజు ఆనెగొందిలో స్థిరనివాసమేర్పరచుకొని ఆ కోటను బలపరచుకొని పరిపాలన చేయడానికుపక్రమించినప్పటికీ శత్రుభయమింకా తొలగిపోలేదు.

ఒకవైపున దేవగిరిలో, మరొకవైపున ఓరుగల్లులో తుగ్లక్ సేనలు అప్రమత్తంగావున్నవి. ప్రక్కలోనున్న కంపలిలో సుల్తాన్ ప్రతినిధియైన మలిక్‌నబీ ప్రక్కలో బల్లెంగా వున్నాడు. అందువల్ల ఏనాడైనా మరొక ప్రతిఘటన తప్పనిసరి అనుకొంటున్నాడు సోమదేవుడు. అందువల్లనే తన చెల్లెల్నింకా పురుషవేషంలోనే వుంచి అన్నమదేవరాజనే పిలుస్తున్నాడు.

సోమదేవరాజు తండ్రి ఆనెగొందిని వీడి పారిపోయినప్పుడు ఆ పట్టణంలో వున్నవారందరూ వెళ్లిపోయారు. అప్పుడది నిర్మానుష్యమైపోయింది. ఇప్పుడచ్చటికి వచ్చినవారిలో చాలమంది కొత్త

వారు. ఇనుక వారికి సోమదేవరాజుకు సోదరుడున్నాడో, సోదరి వున్నదో అంతగా తెలియదు. ఆ విషయాన్ని గూర్చి ఎవరూ పట్టించుకోలేదు.

సోమదేవరాజు ఆలోచిస్తూనేవున్నాడు. దేవగిరి ఎలా పతన మయిందో, కంపలి ఎలా లొంగిపోయిందో అదంతా అతనికి కళ్లకు కట్టినట్లగుపడుతూనేవుంది.

దేవగిరి రాజులు సుల్తానునెదిరించారంటే అది సాధారణమైన విషయమే. యాదవరాజులు చాల బలీయులు. విస్తారమైన సేనా బలం కలిగినవారు. అందువల్ల వారు సుల్తాను నెదిర్చినా ఎదిరించ వచ్చు. కాని కంపలి చాల చిన్న రాజ్యం. అది పర్వతాల మధ్యలో వుంది. మగధరాజధానీనగరమైన గిరివ్రజం ఏ విధంగా పర్వత శ్రేణులచేత చుట్టబడి దుర్భేద్యంగా వుండేదో అలాగే కంపలి రాజ్యంగూడ కొండలచేత చుట్టబడి శత్రురాజులు దండెత్తడానికి చాల కష్టంగా వుండేది. ఆ రాజ్యంలో కంపలి, కొంకుమ్మటం, హోసదుర్గం అని మూడు దుర్గాలుండేవి. అవి చాల బలమైన దుర్గాలు. వాటినాక్రమించడం చాల కష్టం.

అనాడు కంపలి రాజ్యాన్ని కంపలి రాయడు పరిపాలిస్తూ వుండేవాడు. అతను పరాక్రమవంతుడు అతనికంటె అతని కుమారుడైన రామనాథుడు మరింత సాహసవంతుడు. అతన్నే కుమారరాముడనిగూడ ఆ రాజ్యప్రజలు అత్యంత ప్రేమతో పిలుస్తుండేవారు.

అల్లాఉద్దీన్ ఖిల్జీ కాలంలో మలిక్ కాఫర్ కంపలిమీద దండె త్తాడు. అసామాన్యుడైన ఆ మహమ్మదీయ సేనాని ఎన్నో యుద్ధా లలో గెలిచివున్నాడు. కాని కంపలిని పట్టుకోలేకపోయాడు. ఆ రాజ్యంలోవున్న ప్రతి పురుషుడు, ప్రతి స్త్రీ, ప్రతి యువకుడు, ప్రతి యువతి మహమ్మదీయ సేనల్ని ఎదుర్కొన్నారు. అందువల్ల ఆ ముస్లిం సేనాధిపతి కంపలిని వదలి వెనక్కి వెళ్లవలసివచ్చింది. ఆ యుద్ధంలో కుమారరాముడు వేసిన ఎత్తుగడలు, చూపిన కౌశలం మరువరానివి. ఆ విషయాన్ని యిప్పుడు గూడ కథలుగా అందరూ చెప్పుకొంటూవుంటారు.

కుమారరాముడు నిజంగా చాల గొప్పవాడు. ఆదర్శ ప్రాయుడు. అభిమన్యునిలాటివాడు. అందువల్లనే అతడు సోమదేవ రాజుకుగూడ ఆదర్శపురుషుడయ్యాడు. ఆ రాజుగూడ కుమార రాముని వలెనే మహమ్మదీయులతో పోరాడవలెనని, అతనివలెనే కీర్తిప్రతిష్ఠల్ని సంపాదించాలని అనుకొంటున్నాడు.

మలిక్ కాఫరును ఓడించకొట్టిన వీర కంపలి సరాసరా తుగ్లక్ దాడికి గురికావలసివచ్చింది. దానికి గొప్ప కారణముంది.

మలిక్ బహాఉద్దీన్ గుష్టాష్ప, తుగ్లక్ ప్రతినిధిగా సామ్రా జ్య సైన్యాధికారిగా దక్కనులో సాగర్ నుండి పరిపాలిస్తూ వుండే వాడు. కాని అతడొకమారు తుగ్లక్ మీద తిరుగుబాటు గావించి స్వాతంత్ర్యాన్ని ప్రకటించాడు. అందువల్ల తుగ్లక్ అతణ్ణి వెంటనే అణచివేయవలసివచ్చింది. అందుకని ఆ సుల్తాను గుజరాతు సైన్యా లను బహాఉద్దీన్ మీదికి పంపాడు. ఆ సైన్యాలకు ఖ్వాజాజహాను నాయకత్వం వహించాడు.

బహాఉద్దీను సైన్యాలు, ఖ్వాజాజహాను సైన్యాలు దేవగిరి వద్ద సంధించాయి. పోరు ఘోరంగా జరిగింది. ఆ పోరాటంలో బహాఉద్దీను ఓడిపోయి సాగరుకు పరుగెత్తాడు. కాని సుల్తాను సైన్యాలు అతణ్ణి వదలలేదు. అవి అతన్ని వెన్నాడుతూవెళ్ళాయి. అందువల్ల బహావుద్దీను భయపడి కంపలికి వెళ్ళి కంపలి రాముణ్ణి శరణుజొచ్చాడు. మహా పరాక్రమవంతుడైన కంపలి రాముడా మహమ్మదీయునికి ఆశ్రయమిచ్చాడు. అది ఢిల్లీ సుల్తానుకు కోప కారణమయింది. అతడు వెంటనే కంపలిని నేలమట్టం చేయమని ఖ్వాజాజహానుకు ఉత్తరువు పంపాడు. ఆ ఉత్తరువు ప్రకారం ముస్లిం సేనలు కంపలి రాజ్యాన్ని చుట్టుముట్టాయి.

చుట్టుముట్టడం సులభమయిందిగాని ఆ రాజ్యాన్ని జయిం చడం కష్టమయింది. నెలల తరబడి పోరు జరిగినా కంపలి లొంగలేదు. అందువల్ల ఒక వారంలోగా లొంగిపోవలసిందని, అలా చేయకపోతే పర్యవసానం చాల దారుణంగా ఉంటుందని ఖ్వాజా జహాను కంపలి రాయనికి వర్తమానం పంపాడు. ఆ వర్తమానం తీసుకొని వెళ్లిన రాయబారిని కంపలివారవమానించ డమేగాక అతడెక్కి వచ్చిన వ్యంకిసను కాల్చి అతణ్ణి తరిమి వేశారు. అది ఖ్వాజా జహానుకు చాల కోపకారణమయింది. అందువల్ల అతడు మరింత సైన్యాన్ని ఢిల్లీనుండి తెప్పించుకొని పోరును తీవ్రతరం గావించాడు.

కాలం ఎల్లప్పుడూ ఒకేవిధంగా వుండదు. జయలక్ష్మి ఎల్లప్పుడూ ఒకరినే వరించదు. ఈ మారు కంపలి సైన్యాలు వెనక్కి తగ్గవలసి వచ్చింది. హోసదుర్గం, కాకకుమ్మటం రెండూ కూలిపోయినవి. కంపలి రాయడు, కుమార రాముడు ఎంత పోరాడినా ప్రయోజనం లేకపోయింది. కడకు కంపలి కోట గూడ నేలమట్టమయింది. కంపలి రాయలేగాక, కుమార రాముడు గూడ ఆ యుద్ధంలో మరణించవలసి వచ్చింది. ఓటమి నిశ్చయమని తెలుసూనే బహాఉద్దీను ఆత్మహత్య గావించుకొన్నాడు. అంతలో కంపలిరాజ్య స్వతంత్ర భానుడు అస్తంగతుడయ్యాడు. ఆ రాజ్యం మీద మహమ్మదీయ పతాక రెపరెపలాడింది. ఆ రాజ్యానికి మలిక్ నబీ రాజప్రతినిధి గావించబడ్డాడు. అది ఆ నాటికి గూడ అతని పలుకుబడిలోనేవుంది.

సోమదేవరాజు కళ్లు చెమ్మగిల్లాయి. మరలా కంపలి హైందవుల స్వాధీన మయ్యేదెన్నడో దేవగిరి, కాకతీయ హోయసల రాజ్యాలు స్వాతంత్ర్యాన్ని సాధించేదెప్పుడో. అతనిలో వీరావేశం పెల్లుబికింది. అతడు పళ్లు పటపట కొరికాడు.

అంతలో ఒక భటుడచ్చటికి వచ్చాడు. రాజుకు నమస్క రించాడు. సాయణుడనే ఆచార్యుడు వచ్చాడని, రాజదర్శనం కోసం వేచివున్నాడని చెప్పాడు. వెంటనే అతణ్ణి తీసుకొని రమ్మన్నాడు సోమదేవరాజు. ఆలోగా అన్నమదేవరాజు (అన్న మాంబ) గూడ అచ్చటికి వచ్చాడు.

"రా సోదరా రా కూర్చో సాయణాచార్యులు వచ్చారని భటుడు చెప్పి వెళ్ళాడు. ఎందుకోసం వచ్చాడో తెలుసుకొందాం రా" అన్నాడు సోమదేవరాజు. అన్నమదేవరాజు చిరునవ్వు నవ్వుతూ వచ్చి కూర్చున్నాడు. అంతలో సాయణాచార్యుడు అచ్చటికి వచ్చాడు. సోదరులిద్దరూ లేచి ఆచార్యునికి నమస్కరించారు. ఆచార్యుడు వారిని దీవించాడు.

"రండి కూర్చోండి" అన్నాడు రాజు.

సాయణాచార్యుడు వచ్చి కూర్చున్నాడు.

"వేద భాష్యాలు వ్రాసినది మీరేగదా ?" ప్రశ్నించాడు రాజు.

"అవును" అంటూ నవ్వాడు సాయణాచార్యుడు.

"విద్యారణ్య యతీంద్రులు మీ సోదరులేగదా ?" ప్రశ్నించాడు అన్నమదేవరాజు.

"అవును" అన్నాడు సాయణాచార్యుడు నవ్వుతూ.

"వారు క్షేమంగా వున్నారా?" మరల ప్రశ్నించాడు అన్నమదేవరాజు.

"ఆ క్షేమంగానే వున్నారు. వారి వద్దనుండే నేనిపుడు వస్తున్నాను."

"అలాగా. మాతో ఏమైనా అత్యవసరమైన పనులున్నాయా?" ప్రశ్నించాడు రాజు.

"ఉన్నట్లయితే శిరసావహిస్తాము." అన్నాడు అన్నమదేవరాజు. అతడు కళకళలాడుతున్నాడు. అతని కనుసోగలు, చిరునవ్వులు ఎంతో అందాన్ని విరజిమ్ముతున్నాయి. సోమదేవరాజు ఎంత గంభీరంగా వున్నాడో అన్నమదేవరాజు అంత సుకుమారంగా వున్నాడు. "ఉన్నాయి. ఎన్నో అవసరమైన పనులున్నాయి" అన్నాడు సాయణాచార్యుడు.

"చెప్పండి వినాలనుంది" ప్రశ్నించాడు సోమదేవరాజు. సాయణుడేమి చెబుతాడో వినాలనుంది ఆ రాజుకు.

"దక్షిణాపథాన్నంతటినీ తురుష్కులాక్రమించారన్న విషయం మీకు తెలిసేవుంది. యాదవ, కాకతీయ, హోయసల, చోళ, కంపలి రాజ్యాలన్నీ వారి పాదాక్రాంత మయ్యాయని గూడ మీకు తెలిసేవుంది. ఆ రాజ్యాలు పడిపోవడమేగాక హైందవ మతమే నాశనం పొందే స్థితికి వచ్చివున్నది. అందువల్ల ఆ మతోద్ధరణకు విద్యారణ్య యతీంద్రులు ప్రయత్నం చేయాలనుకొన్నారు."

"మంచిదే"

"అందుకని మీతోడ్పాటు ఎంతవరకుందో వారు తెలుసుకొనగోరుతున్నారు."

"మా తోడ్పాటా ? వారికా ? హిందూ మతోద్ధరణ కావించవలసిన బాధ్యత మాకు లేదంటారా ? మేమున్నంతవరకు వారా ప్రయత్నం చేయనక్కరలేదు. వారి ఆశీర్వచనముంటే చాలు. వారనుజ్ఞ ఇస్తేచాలు. ఏమి చేయడానికైనా మేము సంసిద్ధముగా వున్నాము."

"మీరిలా అంటారనే యతీంద్రులు నన్నిచటికి పంపారు. మీరు తప్ప యీ సాహసకార్యానికి పూనుకొని గలిగిన వారు మరొకరు లేరని వారి విశ్వాసం"

"మేము ధన్యులం" అన్నాడు సోమదేవరాజు.

"మీరు రామలక్ష్మణులలాగా మహమ్మదీయులనే రాక్షస మూకల్ని చెండాడి హైందవ మతోద్ధరణం చేయాలని వారి ఆశ"

"అంతకంటె మాకు కావలసిందేమున్నది కాని మేము చిన్న రాజులము. మావల్లనయినంత వరకు ప్రయత్నిస్తాము. ఈ మహమ్మదీయ సుల్తానును ఎలా ఎదిరించడమా అని మేము గూడ ఆలోచిస్తూనేవున్నాము. ఇంతలో మీరు వచ్చారు. ఇది భగవత్సంకల్పమని మేమభిప్రాయపడుతున్నాము" అన్నాడు రాజు.

అతని మాటలతో ఏకీభవించినట్లుగా చిరునవ్వు నవ్వాడు అన్నమదేవుడు.

వారి మాటలు సాయణునికెంతో తృప్తిని కలిగించాయి.

"మీరిప్పుడు చిన్నవారే కావచ్చు. స్వధర్మ నిర్వహణలో మీకు తగినంత శక్తి గలుగుతుంది. దేవుడు మిమ్మల్ని ఆశీర్వదిస్తాడు.

ఆనాడు గూడ రామలక్ష్మణులిద్దరే గదా రాక్షసుల్ని చీల్చి చెండాడ గలిగింది. ఆ తరువాత వారికి వానర సైన్యం సాయమయింది. అలాగే మీకుగూడ భవిష్యత్తులో సాయం లభిస్తుంది. కావలసింది నిర్ణయమొక్కటే" అన్నాడు సాయణుడు.

"మీ యాశీర్వాదం ఫలించాలని నా కోరిక, మేమిద్దరం ఎలాటి త్యాగం చేయడానికైనా సిద్ధంగా వున్నాము."

"మరొకసారి శృంగేరికి వస్తే అచ్చట యీ విషయాలన్నిటినీ చర్చించుకోవచ్చు. భవిష్యత్కార్యక్రమాన్ని నిర్ణయించుకోవచ్చు" అన్నాడు సాయణుడు.

"అలాగే మాకుగూడ ఆ యతీంద్రుల్ని దర్శించాలనేవుంది. వారిని దర్శించి, వారి ఆశీర్వచనాన్ని పొందాలనే వుంది." అన్నాడు రాజు.


"మంచిదే. అలాగేరండి నేను మీరు చెప్పిన విషయాలను వారికి చెబుతాను. మీరు వచ్చినపుడు తక్కిన వివరాలు మాట్లాడుకోవచ్చు." సాయణుడన్నాడు.


"అలాగే"నన్నారు వారు.

వారి సెలవు తీసుకొని నిష్క్రమించాడు సాయణాచార్యుడు. ఆ యాచార్యుణ్ణి సాగనంపి తిరిగి వచ్చారు వారు.

"అన్నమా, వెంటనే మనకు చేతులనిండా పని తగిలేటట్టుంది." అన్నాడు సోమదేవరాజు.

(తరువాయి 44వ పుటలో)





# నగర వార్తా చిత్రాలు

ఎడమవైపు పైన : కేంద్ర రక్షణమంత్రి శ్రీ జగ్జీవనరామ్ జనవరి 22న ఫ్లైట్ లెఫ్ నెంట్ ఆఫీసర్ ఎస్. ముఖర్జీకి మజుందార్ ట్రోఫీని బహూకరించారు.

మధ్య : ఉత్తరప్రదేశ్ గవర్నరు డా. బెజవాడ గోపాలరెడ్డి ఫిబ్రవరి 11న జిల్లా అకాడమీ ప్రచురణలను ఆవిష్కరించారు.

క్రింద : కేంద్ర న్యాయశాఖామంత్రి శ్రీ హెచ్. ఆర్. గోఖ్లే ఫిబ్రవరి 12న తొలి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయవాదుల సమావేశానికి అధ్యక్షత వహించారు. భారత అటార్నీ జనరల్ శ్రీ నిరేన్‌దే దీనికి ప్రారంభోత్సవం చేశారు.

కుడివైపు పైన : రాష్ట్ర గవర్నరు శ్రీ ఖండూభాయ్‌దేశాయ్ జనవరి 18న జవహర్లాల్ నెహ్రూ పాలిటెక్నిక్ విద్యార్థి సంఘ సాంకేతిక సంఘానికి ప్రారంభోత్సవం చేశారు.

క్రింద : ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు శ్రీ ఎన్. నరోత్తమరెడ్డి జనవరి 27న, దక్షిణ భారత హిందీ ప్రచార సభ వారి సర్టిఫికెట్ల పంపిణీ సందర్భంగా సమావేశంలో ప్రసంగించారు.







# దేశభాషలలో శాస్త్రీయ పఠనము

— కీ. శే. కొమర్రాజు లక్ష్మణరావు

"1971లో పెద్దలు—విద్యాధికులు, విద్యార్థులు, అధ్యాపకులు ఆంగ్ల భాష బోధనా భాషగా అలవాటు పడిన కారణంగా, తెలుగు అధికార భాషగనే కాక, బోధనా భాషగా చేయటానికి అనేక సంశయాలు వెలువెరుస్తున్నారు. అందుకు పుస్తకాలున్నవా అంటున్నారు. వచ్చినవి వుంటే లోపాలు లేవా అంటున్నారు. వ్రాయడం సాధ్యమా అంటున్నారు. వ్రాసేవారు పదజాలం లేదంటున్నారు. ఉన్నవి సమంగాలేవంటున్నారు. అసలు మాతృభాషలోనే బోధనా భాష ఎందుకుండవలెనంటున్నారు. శాస్త్రీయ గ్రంథాలు, ఆర్థిక, రాజకీయాలు మీద తగు పుస్తకాలెక్కడివి అంటున్నారు.

ఇటు ప్రజానీకం, అటు అత్యుత్తమ విద్యా వేత్తలుగా పరిగణించిన కొఠారి కమీషన్ వారు బోధనా భాష తెలుగు లోనే వుండ వలెనని, అప్పుడే విద్యార్థి ప్రాభవం బయలు పడుతుందని వాదింపు తున్నా, పలుపురు అనేక సంశయాలను వెళ్ల బుచ్చు చున్నారు. ఆయా అధికార పదవులలో వున్న వారు దీనిని అమలు జరుప వచ్చేటప్పటికి ఎవరికి చేతనైనంత వరకు వారు అభ్యంతరాలు ఎవరి స్థాయిలో వారు పెట్టుతూనే వున్నారు. ఇది ఆంధ్రాభిమానం లేక పోవటమని అనటానికి సాహసింపను. కాని దృక్పథంలో—అలవాటులో పడి పోయినప్పుడు వచ్చిన ప్రమాదం.

ఈ విషయం గురించి శ్రీ కొమర్రాజు వెంకట లక్ష్మణ రావు గారు ప్రమాదీచ నామ సంవత్సరం అంటే ఇప్పటికి 58 సంవత్సరాల క్రితం కాకినాడలో వెలువడిన ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రికలో వ్రాసిన సుదీర్ఘ వ్యాసం ఆ నాటికే ఆంధ్రుల—ఆంధ్ర భాష యొక్క ప్రాశస్త్యాన్నే గాక దానిని బోధనా భాషగా ఎందుకు చేయవలెనో చేయుటలో, రానున్న సాధక బాధకాలు ఎన్ని వున్నవో—ఏ విధంగా అధిగమించ వలెనో సవివరంగా సహేతుకంగా వివరించి వున్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రజల వత్తిడి ఫలితంగా—పెద్దల ఆదేశాల ఫలితంగా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం యేర్పడ టానికి ప్రధాన ఆశయం అసలు జరపు వుద్దేశంతో—నత్తనడకతో నైనా సాగించిన ఈ ప్రయత్నం యొక్క అవసరం—అంతరార్థం వారి మాటల్లో తెలుసుకోవడం మంచిది కదా : అందుకే 58 సంవత్సరాల క్రితం వ్రాసినా ఈ నాటికీ ఆధునికంగా, అవసరంగా, హేతు బద్ధంగా వున్న ఈ వ్యాసాన్ని ప్రజలకు అంద జేయుటం ఉపయోగకారి కాగలదని ఆశిస్తున్నాను" అని తమ ఆశయం ప్రకటించారు శ్రీ వావిలాల గోపాల కృష్ణయ్యగారు యీ వ్యాసం ప్రచురణార్థం మాకు పంపుతూ, (సం)

తల్లిపాలు త్రావి పెరిగిన బాలునకును, దాదిపాలు త్రావి పెరిగిన బాలునకు నెట్టిభేద ముండునో స్వభాషయందు శాస్త్రాభ్యాసము చేసిన వారికిని పరభాషయందు జ్ఞానార్జనము చేసినవారికి నట్టిభేదమే యుండును. అన్యభాష మొదట నేర్చుకొని పిదప నాభాషయందు శాస్త్రముల గళల జదువుకొనుట ద్రావిడ ప్రాణాయామమువంటిది. కాని యిట్టి ప్రాణాయామమే మన దేశము నందు ప్రస్తుతము జరుగు చున్నది. తర్కవేదాంతాది పూర్వ శాస్త్రముల నేర్చుకొనవలయు నన్న సంస్కృతము నేర్చుకొనవలయును. రసాయనపదార్థవిజ్ఞానాది శాస్త్రముల నభ్యసింపవలెనన్న ఇంగ్లీషు నేర్చుకొన వలయును. ఈ భాషల నభ్యసించుటకు గొంత కాలము వ్యయపరుపవలెను. ఇవి మన మాతృభాషలు కానందున వీనిని జక్కగ నభ్యసించుటకు విశేషముగా పరిశ్రమము, కాలవ్యయమును, ధనవ్యయమును గలుగుననుటకు సందేహములేదు. స్వభాషయందే యన్ని విద్యల నేర్చుకొనుమార్గము ఉండినయెడల నీవ్యయ ప్రయాసములన్నియు

ర్చి పోవునుగదా. ఉన్నతశాలలో నేర్పబడు స్వభాషా విషయముగ వ్రాయబడుచున్నవి? చిన్న హైస్కూలులో ప్రవేశించునప్పటికి ... ఫిరంది యంతయు బంధించుడు కావచ్చును. ఆధునికమైన గ్రంథములైనను, ఎట్టివైనను, ఏవైనను, స్వభాషలో నుండెనేని వానినెవరైనను సుఖముగ తెలిసికొనగలరు. అంతియేకాదు, ఆ భాషనెరింగినవారియందరిలో నాయా విద్యలు త్వరితముగను ప్రసరించి జనుల యున్నత స్థితికి కారణభూతములగును.

స్వభాషయందు విద్యలు లేక పరభాష నభ్యసించి విద్యల సాధింపవలసిన వాడెంత సన్నముకై పొరుగిండ్లు తిరిగి యన్నమును సంపాదించినవానితో సమానుడు. మన దేశములో మనువు, అనగా బ్రాహ్మణులు మొదటి నుండియు నన్నమును గోరుట విహితమైన ధర్మముగ నున్నందున మనవారిది యొక గొప్పతప్పుగ గేంపబడి పోవచ్చును. కాని ప్రపంచములోనున్న పాశ్చాత్య దేశముల నొకటి జూడుడు, విద్యా విషయమున నితర దేశములందెవెను బడకుండుటకై వారు చేయు ప్రయత్నములు చూచిన నెవ్వరిమాకు నాశ్చర్యానందముల మునుంగకుందురు? విద్యావిషయమై వారి స్వేచ్ఛయేల! కారణము స్పష్టము నేడు ఫలసిన విద్యలన్నియు నేర్పు విద్యాలయములును, గ్రంథరాజములును ఇంగ్లండు దేశమునందున్నందున వేరు దేశములకు బోయి వేరుభాష నేర్చుకొనకయు వారి కన్ని విద్యలను, కళలను, వృత్తులను నేర్చుకొనుటకు వీలున్నది. వైద్యముయొక్క యత్యున్నత ఫలమైన శాస్త్రసంబంధమయిన ఇంగ్లీషు గ్రంథములన్నియు నేడొక్కపెట్టున నశించిన దనుకొనుడు. పాప మప్పుడు ఆ దేశమునకు నెప్పుడును రాకయుండునుగాక! వచ్చినయెడల ఇంగ్లీషువారి విద్యాభ్యాసస్థితి యేమగును? ఏ విద్య నేర్చుకొనవలెనన్నను పరభాషయైన జర్మనీ భాషనో ఫ్రెంచి భాషనో మొదట నభ్యసించి తద్ద్వారమున నిష్టవిద్యనుగాని, కళలనుగాని, వృత్తులనుగాని నేర్చుకొనవలెను. అప్పుడు వారిసాంపత్తిక స్థితి యిప్పుడున్నట్లుండగలదా. పొగబండి నడపు విధముల నేర్చికొనుటకు జర్మనీ దేశమునకు, వాస్తుశాస్త్ర మెరుంగుటకు ఫ్రాంసు దేశమునకు, నాకాశయానము నభ్యసించుటకు ఇటలీ దేశమునకు, 'దేహి' యని పోవలసిన ఇంగ్లీషువారు తమ దేశాభివృద్ధి యెట్లు చేయగలరు. కావున స్వస్వ మాతృభాషలలో సకల విద్యా సాధనములుండుట నాగరిక రాష్ట్రముయొక్క మొదటి లక్షణము.

## ఇంగ్లీషు నేర్చుకొనుట

అట్లని నెవ్వరును సంస్కృతమునుగాని యింగ్లీషునుగాని నేర్చుకొనగూడదనియు, నాయాభాషల నేర్చుకొని విద్యలను సాధించుటకు వీలున్నప్పుడు మాతృభాషలో లేవన్న చింత మనకేల యనియు గొందరడుగవచ్చును. సంస్కృత భాషనుగాని, ఇంగ్లీషు భాషనుగాని ఫ్రెంచి మొదలయిన యితర భాషలనుగాని చేతనయినవారు ధనమున్నవారు వీలుగలవారు నేర్చుకొన వలయు ననియే నాతాత్పర్యము. వానిలోను రాజభాష యయినందునను, లోకమందలి యితర భాషలకంటె నన్నివిధములను గ్రంథ భండారమునం దద్వితీయమైనదని ప్రఖ్యాతి చెందినదియు నగుటచే నింగ్లీషు భాషను నేర్చుకొనుట మన నాగరికతాభివృద్ధికిని దేశోన్నతికి నత్యంతావశ్యకమని నా యభిప్రాయము. కాని యది యెంతవరకు సాధ్యమో యని సామాన్యముగ నందరకు ఇంగ్లీషుభాష చక్కగ వచ్చుటయు నందు వారు సకల విద్యలను సాధింపగలుగుటయు నిక వేయి సంవత్సరములకయినను హిందూదేశమునందు సంభవించునా? ఎప్పటికిని సంభవింపనేరదు. అట్లే సంస్కృతము. ఇది దేవభాష యని మనకు భక్తియున్నను దేశమునందెందరు సంస్కృతపండితులు కలరు? సంస్కృతము దేశభాషాభివృద్ధికి సాయముగా నుండవలసినదే కాని మరల నది దేశభాషయగునన్నమాట కలలోనివార్త. సంస్కృతముగాని ఇంగ్లీషుగాని హిందూదేశములోని దేశభాషాస్థానము నాక్రమించుకొననేరవు. దేశభాషలలో విద్యనేర్చుటకంటె ఈ భాషలలో విద్యనేర్చుట యెప్పుడును నేర్చుకొనువారికి, నేర్పువారికిని నెక్కుడు కష్టముగా నుండగలదు. కావున నాయా భాషలవారికి నాయా భాషలలోనే విద్యావిధానము చేయు మార్గముల నిర్మించుట యావశ్యకము.

ఇప్పుడు మన దేశస్థులు వేరువేరు విద్యల సాధింపనెంచి కొందరింగ్లండునకును, కొందరు జపానునకును, కొందరమెరికాకును పోవుచున్నారు. దేశముయొక్క భావి పురోభివృద్ధికిది మంచి చిహ్నమే. కాని యాలాగున నెందరు పోగలరు? లక్షకొక్కడుగాని వెళ్ళగలడా? వేలకొలది ధనము వెచ్చించి యితర బాధలకోర్చి వెళ్ళివచ్చిన నేమి ప్రయోజనము? మిగిలిన తొంబదివేల తొమ్మిదివందల తొంబది తొమ్మిదికి వివిధ విద్యలబ్బుట యెట్లు? వీరిలో గొందరు కొంచెమింగ్లీషు నభ్యసించెదరనుకొందము. మిగిలినవారి గతి. వారికి జ్ఞానార్జనము చేయుదమన్న కోర్కె పొడముననుకొనుము. జ్ఞానము లభించు మార్గము లేదా? అట్టి సాధనముల నిర్మించుట దొరతనమువారియొక్కయు, విద్యాధికుల యొక్కయు, ధనాధికుల యొక్కయు, సర్వ కర్తవ్యముకాదా. ప్రజలందరకును విద్య నేర్చుకొనుటకు వీలయిన సాధనములను నిర్మించుట రాజధర్మము. ఈ యుద్దేశముతోడనే శ్రీ శ్రీ చక్రవర్తివారు పట్టాభిషేక మహోత్సవ కాలమందు ప్రాథమిక విద్యకై 50 లక్షల ధన మొసంగిరి కాని నీదనములో యెన్నవవంతు దేశాభివృద్ధికై ఖర్చుపడునో చూడవలసియున్నది. మనము కేవలము రాజసహాయ్యము నమ్మియే యుండగూడదు. వారు చేయు సాయమునకై కృతజ్ఞులమగుచు మనము స్వతంత్ర ప్రయత్నములను జేయుచుండవలెను. ఈ మార్గమున బోయిన బాగుగానుండునని ముందంజవేయుటకు విద్యావంతులును, విద్యావంతులచే నారంభింపబడిన కార్యములు శాశ్వతములుగ నుండునట్లు చేయుటకు ధనవంతులును సంసిద్ధులై యుండవలెను. శాస్త్రజ్ఞానాభివృద్ధికై మనదేశమునందు జరుగవలసిన పనినిగూర్చియు, జరుగనున్న పనినిగూర్చియు విచారించెదము.

## సాధనములు

దేశమందంతట శాస్త్రజ్ఞానాభివృద్ధి కావలయునన్న దేశభాషయందు గ్రంథములు, నాశాస్త్రములను బోధించుపాఠశాలలు నుండవలయును. కేవలము విద్యాపీఠములుండి గ్రంథములు లేకపోయినను ప్రయోజనము లేదు. కేవలము శాస్త్రములుండియు

చెప్పువారు లేనిచో యెంత యుపయోగము లేదు. ఇందుకు దృష్టాంతముగ నొక చిన్న యుదాహరణ మిచ్చెదను. చెన్నపట్టణమునందు నాయుర్వేద పాఠశాలయున్నదని మీకెరిగిన విషయమే. అందు ఇంగ్లీషుపద్ధతి ప్రకారము శారీరశాస్త్రము (Physiology and Anatomy) అను విషయమొకటి విద్యార్థులకు బోధించెదరు. కాని యీ విషయమును బోధించు గ్రంథము దేశభాషలందు లేనందున విషయబోధన చేయుటలో నుపాధ్యాయులకును, విషయమును బోధ చేసికొనుటలో విద్యార్థులకును మిక్కిలి పరిశ్రమ కలుగుచున్నది. తెలుగు నందు శ్రీ వీరేశలింగము పంతులుగారిచే చిన్న శారీరశాస్త్రము కలదు. కాని యది యీ తరగతికి చాలదు. ఇంకెంతో నెన్నియో సంగతులు విపులముగ వ్రాయబడిన గ్రంథము కావలయును. అట్లే శస్త్రవైద్యమును గురించిన గ్రంథము తెలుగులో లేనేలేదు. ఇతర దేశభాషలందును లేదు. కావున నది నేర్పుటయే యసంభవమైనది. ఆ విషయము నాయుర్వేద వైద్యశాలలో నేర్పు విషయములలోనుండి తీసివేసిరి. అట్లే యాయుర్వేద సంబంధమైన యుద్గ్రంథములు సంస్కృతమునందే కలవు. తెలుగునగాని యితర భాషలందుగాని లేవు. కావున సంస్కృతము చక్కగరాని వారికి నాగ్రంథములవలన విశేషలాభము కలుగదు. ఈయిక్కట్టు నాలోచించియే శ్రీభిషఙ్మణి పండిత గోపాలాచార్యులవారాయుర్వేద గ్రంథమాలనొకదానిని స్థాపించి గీర్వాణగ్రంథములను తెలుగుచేసి యాంధ్రుల కృతజ్ఞతకు పాత్రులైరి. మచిలీపట్టణములో స్థాపింపబడిన జాతీయ కళాశాలాధికారులుకూడ భిన్నభిన్న కళాకౌశల్యములు నేర్పుటకు తగిన గ్రంథములు లేనందున నేగ్రంథములు పఠనీయములుగా నేర్పరుపవలయునాయని త్రొక్కులాటపడుచున్నారు. ఇది, చదువు చెప్పువారుండి చదువుకొను గ్రంథములు లేనందున గలుగు నిబ్బంది. ఇట్లే కొన్నియెడల గ్రంథములున్నను వానిని చదువువారుగాని, చెప్పువారుగాని యుండరు. ఉపయోగము లేక పుస్తకములు చెదలు పట్టిపోవును. తెలుగులో బీజగణితము (Algebra)ఉన్నది. క్షేత్రగణితము (mensuration)ఉన్నది. అట్టి గ్రంథములకు విశేషప్రచారము లేక యవి ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమునందు మూలదాగి యేలయుండవలయును? వానినుపయోగించు గురువులు, నభ్యసించు విద్యార్థులు లేక అట్లగుటచే తెలుగులోగూడా అల్జిబ్రా చెప్పవచ్చునా? తెలుగులో జ్యామెట్రీ నేర్పగలమా? (Progressions)చెప్పిన ఇంగ్లీషులో జెప్పవలయునేగాని నేర్పుటకు వీలులేదు అని మనవారే వాదింపజొచ్చిరి! ఇంగ్లీషు గణితమునకు మారుగా లీలావతిగణితమునే మనపాఠశాలలో చెప్పుచుండినచో నిట్టి సంశయములు మనవారి కేలపుట్టును? ఇప్పుడు మనపిల్లవాండ్రు ఏఫ్. ఏ. తరగతిలో నేర్చుకొనుచున్న ప్రొగ్రెషనులు, పరముటేషన్ కాంబినేషన్‌లు మన పిల్లలు నాలుగవ యైదవ తరగతులలో శ్రేఢీవ్యవహారము. అంకపాశవ్యవహారము అనుపేళ్లలో నేర్చుకొని యుందురు. నాతాత్పర్యము పాశ్చాత్యగణితశాస్త్రముయొక్క క్షేత్ర మత్యద్భుతముగ వైశల్యము జెందినది యని నేనేఱుంగుదును. కాని యావిద్యయంతయు తెనుగున జెప్ప రాదా? జ్ఞాన మొకభాషయొక్క యబ్బసొమ్ముకాదు. ఏభాష మూలమునైనను దానిని సాధింపవచ్చును. ఎవరి మాతృభాషలో వారు సులభముగను గొలదికాలములోను, గొలది శ్రమలోపలను దెలిసికొనవచ్చును.

పరభాషలో నభ్యసించిన యెడల నెప్పుడును భ్రమయే. ఒక్కటి నిశ్చయముగ చెప్పగలను. ఎంతకఠినమైన యింగ్లీషువిద్యలన్నియు మనభాషలోనికి దెచ్చి బోధింపవచ్చును. అట్లు చేయక పరభాషలలో చెప్పుట స్వభాషాద్రోహము.

ఇక నిప్పటి విద్యాభ్యాస పద్ధతి చూతము. 1 వ ఫారముగాని 2 వ ఫారముగాని మొదలుకొని మనపిల్లవాండ్రకు భూగోళము, అంకగణితము రేఖాగణితము, పదార్థవిజ్ఞానము మొదలయిన విషయములన్నియు ఇంగ్లీషున జెప్ప ప్రారంభించెదరు. అప్పటికా బాలురకు నింగ్లీషుజ్ఞానము వ్రాయుసామర్థ్యము వాని కుండదు. ఉన్నను నన్నపాటి యూహాల నింగ్లీషునందు చెప్పజాలరు. అట్టివానికి ఇంగ్లీషునందు రేఖాగణితము చెప్పిన నేమి ప్రయోజనము? A point is that which has no dimension అను వాక్యమునకు నర్థము చక్కగ తెలిసికొనలేని వానికి 'యూక్లిడు' యొక్క యింగ్లీషున జెప్పుచుండిన బ్రయోజన మేమిటి? బట్టీపట్టుట. యనగా నర్థము తెలిసినను తెలియక పోయినను పఠించి యూచా తప్పకుండా నొప్పగించి పరీక్షలో కృతార్థులగుట యిందువలన సిద్ధించుచున్నది. చెప్పిన దానికి నర్థము తెలిసికొనుటగాని మనస్సునందలి యూహాలు చెప్పుటకుగాని తగినంత భాషాజ్ఞానము లేనివారు గుడ్డి పాఠములు చేయుట పరీక్షలో కృతార్థులగుటకు వీలున్నదా? లేదు. కావున ఇంగ్లీషులోని విషయములు నేర్పి మనము మన విద్యార్థుల యొక్క బుద్ధి వైభవమును తగ్గించుచున్నామని నా యొక్క దృఢనిశ్చయము. ఇప్పుడు ప్రవేశ పరీక్ష వరకు చదువుచున్న విద్యార్థుల యొక్క కాలమంతయు నింగ్లీషు భాషలో వల్లించుటయందే వ్యయమగుచున్నది. స్వభాషయందు వారికి విషయముల నేర్పిన నింతపరిశ్రమ యుండదుగదా. వారికి విషయము బహుసులభముగ బోధపడును. ఒక్కసారి బోధపడిన తరువాత విద్యార్థి గ్రంథమునంతయు వల్లింపబనిలేదు. ప్రశ్నలకు విద్యార్థి ప్రత్యుత్తరము చెప్పునపుడు తన మాటలలోనే చెప్పగలడు. తన మాటలలోనే వ్రాయగలడు. అందుకై వేరు పరిశ్రమగాని, ప్రయత్నముగాని యక్కరలేదు. వచ్చిరాని ఇంగ్లీషులో నేర్చుకొనుటకంటెను, బదులు చెప్పుటకంటెను నూరురెట్లు సులభతరము. ప్రతి పాఠశాలలోను ప్రవేశపరీక్ష వఱకును, నింగ్లీషు, సంస్కృతము మొదలగు వాఙ్మయ విషయములుతప్ప మిగిలిన విషయములన్నియు, అంకగణితము, రేఖాగణితము, క్షేత్రగణితము, పదార్థ విజ్ఞానశాస్త్రము, రసాయనశాస్త్రము మొదలయినవన్నియు బాలకుల మాతృభాషలయందు నేర్పిన యెడల నిప్పుడు బి. ఏ. వారికీవిషయములందు నెంత ప్రవేశము కలదో యంత ప్రవేశము ప్రవేశపరీక్షలోని విద్యార్థులకు గలుగుననియు, గనీసము, మూడు సంవత్సరముల కాలము కలిసివచ్చుననియు, నందుకయ్యెడు వ్యయప్రయాసలు తప్పుననియు నాయొక్క దృఢతరమైన యభిప్రాయము. బడి జీతములు భరించుటకు వీలులేకుండ పెరిగిన యీ కాలమున నొక్కొక్క విద్యార్థికి మూడు సంవత్సరములనగా వేయి రూపాయలని వేరుగా జెప్పనక్కరలేదు. నలుగురు పిల్లలు గలవారికి నాలుగు వేలాదాయము గదా!

మన యోజనము

వారు యిట్లు వ్రాసిరి. యింతవరకు నింగ్లీషు భాష మనవారికి బాగుగా నలవడలేదు. దానియందు మన విద్యార్థులకు గలిగిన యున్న ప్రజ్ఞా విశేషములు తగ్గును. అందుచే నింగ్లీషు భాషాభ్యాసమును తగ్గించి మనము నిప్పుడు గలుగుచున్న యత్యల్పమైన మాన సౌష్ఠవమును, నాగరికతను పొందుటకు మనము యెక్కువ హాని సంభవించుటను గాంచగలుగుచున్నాము. ఇంగ్లీషు వాఙ్మయము నదీకమయి విస్తరింపబడియున్నదనుట నాకును సమ్మతమే. ఆ యద్వితీయ వాఙ్మయ ప్రభావమును నేనెఱుంగుదును. దాని నభ్యసించి మనభాష నలంకరించుట యొక్కటయే విద్యాధికుల యత్యావశ్యకమని నా తాత్పర్యము. కాని యాభాషయందు గణితమును బీజగణితమును గిట్టించుటకును, నేర్చుకొనుటకు యాభాష చక్కగా రానిపోవునని నేను చెప్పను. కొందరు వ్యాసములను, లిపిలను, జరిత్రలను, రాజకీయోపన్యాసములను, నుద్గ్రంథములను, తత్వగ్రంథములను జదివిన వారి ప్రావీణ్యము బయలుపడునేగాని గణితాదికము చదివినందునగాదు. కావున నింగ్లీషు చక్కగా రావలయునన్న నిప్పుడింగ్లీషు వాఙ్మయము దినమునకు నొక్క గంట చెప్పుచున్న యెడల నిక ముందు రెండు గంటలు చెప్పవచ్చును. శాస్త్రములు తెలుగులో జెప్పవచ్చును. ఇట్లింగ్లీషు వాఙ్మయమును బాగుగ బూర్తిగ నేర్చుకొనవచ్చును. శాస్త్రములను సాధింపవచ్చును. ఇప్పుడితో భ్రష్ట స్తతో భ్రష్టఅన్నట్లు మన బాలకులకు నింగ్లీషు బాగుగ వచ్చుటలేదు. శాస్త్రములు చక్కగ తెలియుటలేదు. ఇకముందు నేను జెప్పినట్లేర్పాటు చేసిన యెడల ఉభయత్రప్రావీణ్యము నందును బొందిన వారగుదురు. ఇప్పుడు పరభాషలో శాస్త్రములు నేర్చుకొనుటకు బట్టుచున్న పరిశ్రమచే యింగ్లీషు వాఙ్మయమును వశపరుచుకొనుటకు నుపయోగించితిమేని యింగ్లీషు గ్రంథకారులతో తులతూగునట్టి యాంగ్లసాహితి మనకు దప్పక యలపడగలదు.

ఇంగ్లీషు విద్యను గఱపుబడులలోనే శాస్త్రములను తెలుగునందు జెప్పుచున్నప్పుడు ప్రాథమిక పాఠశాలల నన్ని విషయములను తెలుగునందే నేర్పవలెనని వేరుగ జెప్పవలెనా? ఇంగ్లీషు రాకయే మనవారు బీజగణితమందలి వర్గసమీకరణము (Quadratic Equation) అనేకవర్ణ సమీకరణము (Simultancous Equations) రేఖాగణిత మందలి వృత్త (circle) దీర్ఘవృత్త (Ellipse) సంబంధమైన సిద్ధాంతములను భౌతిక శాస్త్రమందలి విద్యుత్ప్రవాహకములను గురించిన సిద్ధాంతములను తేటతెలుగున నొకరితో నొకరు సంభాషించు సమయము తెనుగుదేశమున కబ్బెనేని యది మన దేశాభ్యుదయమునకు నిశ్చయమైన చిహ్నమని చెప్పవచ్చును. ఇది మనలో గొందఱకు విశేషముగా నింగ్లీషుభాషతప్ప జ్ఞానార్జనమునకు వేఱు సాధన ముందునాయని తలంచువారికి నేను గోరిన కోర్కె గొంతెమ్మ కోర్కెవలె దోచిన దోపవచ్చును. కాని మహారాష్ట్ర దేశమునకు వెళ్ళి చూచిన యెడల నందేమియు వింతలేనట్లు స్పష్టపడగలదు. నేను పదార్థవిజ్ఞానశాస్త్రమును మొదట మహారాష్ట్రము నందే చదివితిని. ఎఫ్. ఏ. పరీక్షకు జదువు విద్యార్థులకు బీజగణితమందలి కొన్ని లెక్కలను మరాటీబోధ చేయునట్టి యింగ్లీషు రానట్టి నార్మల్‌స్కూల్ మరాటీ విద్యార్థుల నేనెరుగుదును. కొన్ని దినముల క్రిందట విజ్ఞానసర్వస్వము యొక్క ద్వితీయ యోగ్యగణితమును గురించి కొన్ని సంగతులు తెలిసికొనుటకు నేను పట్టాభిరామయ్య ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమునకు పోవుట సంభవించెను.

బీజగణితములోని $\frac{(n+1)}{2}$ $\frac{n(a+e)}{2}$ అను సూత్రములను కాగితముమీద వ్రాసికొని లెక్కలు వేసికొనుచుండగా నొక్క వైష్ణవుడు వచ్చి యదియేమని నన్నడిగి విషయము కొంచెము తెలిసికొని వెంటనే వానితో సమానమైన సూత్రములను సంస్కృతమునందు జదివి నా కెంతయు విస్మయమును గలిగించెను! ఆ వైష్ణవున కింగ్లీషు రాదు—సంస్కృతము, అరవము, కొంచెము తెలుగు మాత్రము వచ్చును. ఆ బీజగణిత సూత్రములాతడు ఎచటినుండి నేర్చుకొనెనట! కావున నెట్టి కఠినమైన శాస్త్రమునైన నాంధ్రమున బోధచేయవచ్చును, ఆంధ్రమున వ్రాయవచ్చును.

కావున మొట్టమొదట చేయవలసినది స్వతంత్రముగ గ్రంథము నిర్మించుట. శ్రమపడి యిట్టి గ్రంథములను వ్రాసిన నేమి ప్రయోజనము? ఎవరు చదివెదరు? గ్రంథకర్తకేమి లాభము? అని కొందఱడుగవచ్చును. కాని మనవాండ్లు నష్టలాభములు గణించుచు నెన్నిదినము లుండవలెను? ఇట్లు నష్టలాభములు గణించువారెవరేమి యన్నను దానిని ఖండించుటకు సిద్ధముగా నుందురు. పాఠశాలలలో తెలుగున శాస్త్రములు జెప్పుడనినపుడు మీకు తెలుగులో శాస్త్రగ్రంథము లేవియని యడుగుదురు. శాస్త్రగ్రంథములు వ్రాయుడనగానె ఆ గ్రంథములు నుపయోగించు బళ్ళేవోయి యని వీరే మరల సిద్ధమువచ్చెదరు. వీరి సిద్ధాంత మనుసరించిన పిచ్చి కుదిరినగాని పెండ్లి కాదు, పెండ్లి యైనగాని పిచ్చి కుదురదు. వీరివాదము వినుచుండిన పిచ్చియు గుదురదు. పెండ్లియుగాదు. గావున పరస్పరాశ్రయ దోషదూషితమైన వీరి వాదమును చూచి మనము భయపడవలదు. ఇదియుగాక క్రొత్తగా నిర్మింపబడు గ్రంథములు వ్యర్థముగా మూలపడియుండునని గ్రంథకర్తలు తలపవలదు. దొరతనమువారివలన ప్రోత్సాహము కలిగినయెడల విశేషమే. అట్లు ప్రోత్సాహము కలుగక పోయినను బాఠశాలలలో బఠనీయముగా నియమింపబడకపోయినను యోగ్యతగల గ్రంథమును, అది నవలగానిండు, చరిత్ర గ్రంథముకానిండు, కఠినమైన శాస్త్రము కానిండు—ఆంధ్రలోకము తప్పక యాదరించుననియే నా తాత్పర్యము. ఇటీవల నాంధ్రదేశమునందు భాషాభిమానము గలిగినది. పూర్వమైతే సంవత్సరములో నొక గ్రంథముయొక్క 500 ప్రతులు అమ్ముడుపోవుట దుర్లభముగా నుండెను. ఇప్పుడొక్కొక్క గ్రంథముయొక్క 2000, 3000 ల ప్రతులు విక్రయమగుటయేగాక రెండు కూర్పులు, మూడు కూర్పులు అచ్చగుట తటస్థించుచున్నది. ఏ పాఠశాలయందును బఠనీయ గ్రంథములుగా లేకపోయినను విజ్ఞానచంద్రికా గ్రంథమాలలో నిదివరకు బదునొకండు శాస్త్రీయ గ్రంథములు ప్రకటింపబడినవనియు, నందు కొన్నిటికి రెండు సారులచ్చొత్తింపబడినవనియు, నే గ్రంథమును 3000 ల ప్రతులకంటెను తక్కువ యమ్ముడుపోలేదనియు, రసాయన శాస్త్రమువంటి కఠిన శాస్త్రము గూడా నింగ్లీషురాని స్వర్ణకారులు కొందరు చదివి యుపయోగించు

కొనుచున్నారనియు, నింగ్లీషురానివాండ్రు పెక్కండ్రు గవర్న మెంటు టెక్నికల్ పరీక్షలకై యీ గ్రంథములనుపయోగించుకొను చున్నారనియు సందరికిని బాహాటముగా తెలిసిన విషయమే. కావున గ్రంథములు ముద్రింపబడు నీటి గ్రంథకర్తలు మానవలయును. ఒకానొక పుస్తకము సంపాదించుకొనేని యది పరనీయ గ్రంథము కాక పోయినను ఆ గ్రంథము నుపయోగింప వద్దు. మాకిష్టమైన నీ గ్రంథమునే ఉపయోగింపుడని ఇన్‌స్పెక్టర్లు చెప్పుచున్నను నుపాధ్యాయులను, పిల్లలు నీ మంచి పుస్తకమునే తెప్పించి చదివెదరు. ఇన్‌స్పెక్టర్లు వచ్చినప్పుడు దాచిన దాచెదరేమోగాని యోగ్యమైన గ్రంథము చదువుట మానరు.

ఒకవేళ కొన్ని గ్రంథములకు లోకాశ్రయము లేకపోయినను, నాంధ్ర దేశమందలి రాజులు, మహారాజులు మొదలైనవారును శ్రీమంతులును, విద్యా సంఘములు నిట్టి గ్రంథకర్తకు సాయము చేసి వివిధ శాస్త్రములను గురించిన గ్రంథములను వ్రాయింప వలెను. భాషయందు ప్రబంధములు, నాటకములు, నవలలు మొదలయిన లలిత వాఙ్మయాభివృద్ధిజెందుట యొక యెత్తు, శాస్త్రజ్ఞానాభివృద్ధి కనుకూలములైన గ్రంథములు నిర్మాణమగుట యొక యెత్తు. ఇట్టి గ్రంథములు దేశ దారిద్ర్య వినాశకములు.

ఇప్పుడు మన దేశమునందు దేశభాషాభివృద్ధికి కొంత ప్రయత్నము జరుగుచున్నను, లలిత వాఙ్మయాభివృద్ధియందే యెక్కుడు ప్రచారము జరుగుచున్నది. ప్రకృతి శాస్త్ర నిర్మాణమునకు నొకటి రెండు సంఘములు తప్ప నితరములు ప్రయత్నించుట లేదు. ఇది యెంతయు శోచనీయము. భాషాభివృద్ధికై మనవారు చేయు ప్రయత్నములలో సగము ప్రయత్నము శాస్త్రజ్ఞానాభివృద్ధికిని, సగము ప్రయత్నము యితర లలిత గ్రంథాభివృద్ధికిని వ్యవహరించునట్లు చూచుకొనవలెను. ఒకానొక సంఘము పది గ్రంథములను ప్రకటింపదలచెనేని వానిలో నైదు భౌతికాది శాస్త్రపరిశోధకములును, మిగిలిన యైదు వేఱువిషయములను బ్రతిపాదించునవిగను నుండునట్లు చూచినయెడల మంచిది. ఒకానొక జమీందారుగారు గ్రంథకర్తలను బ్రోత్సహింప దలచినయెడల సగము ధనము శాస్త్రములకును, సగముధనము యితర విషయములకును బంచియీవలయును. శాస్త్రగ్రంథములు పదుల కొలది వెలువడిన తరువాత నీవిషయమును మనవారు శ్రద్ధతో బాటించినగాని యీదేశముయొక్క యార్థికావస్థ యభివృద్ధిజెందనేరదు. ఇప్పుడిప్పుడు కొన్ని ప్రకృతి శాస్త్రగ్రంథములు వెలువడినవి. కాని వెలువడినవి స్వల్పము. వెలువడవలసినవి యసంఖ్యములు. వేలకొలది గ్రంథములు పుట్టవలసిన చోట బది యిరువది పుట్టిననేమూలకు వచ్చును? బంగాళీభాష యందును మరాటీభాషయందును వ్రాయబడిన భౌతిక శాస్త్రగ్రంథములను జూచిన నెట్టివానికైనను విభ్రమము కలుగకమానదు.

## పారిభాషిక పదములు

దేశభాషలలో శాస్త్రీయ గ్రంథములు వ్రాయుటకు శాస్త్రీయ పదముల యథావమొక ప్రబలకారణమని కొందరు చెప్పుచున్నారు. కాని శాస్త్రీయ పదములకై యెవ్వరు నాగనక్కరలేదు. ఇదివరకు కొందరిచే నేర్పాటు చేయబడిన పదములుండెనేని వానినే స్వీకరించి గ్రంథము వ్రాయవచ్చును. ఇదివరకున్న పదములు బాగుగలేవు అని యెంచినయెడల పెక్కురుగలరు. ఒకప్పుడు శ్రీ గ్రంథకర్తయొకడు "The Twentieth Century English Maratta Dictionary (Literary, Scientific and Technical) అను మహాగ్రంథముయొక్క పీఠికయందు ప్రస్తావించి యిచ్చి యున్నాడు.

"It may be that a word newly coined by two or three experts may be found fault with as inaccurate by a fourth one. This fourth expert will offer his own coinage as an improvement forgetting all along that there will be others who will find similar fault with his own creation. What happens at present is that every new writer arbitrarily mints his own technical terms not taking pains to see what his predecessors in the same department have done. It is easy to say for one that a certain word is not an accurate rendering of its corresponding English word but if this very objector is requested to make his own suggestion and from every point of view a faultless one, he often finds himself unable to do it and then at once gives in his adhession to the old proposal."

ఇట్లువీరిపదములువారికి నచ్చరావు. వారి పదములు వీరికి నచ్చరావు. వీరిరుందఱకు నచ్చిన పదము లేర్పడువఱకు గ్రంథములువ్రాయకుండ గూర్చుండిన యెడల కాలాంతము వరకు నిద్రించుండవలెను. కావున బుద్ధిమంతులు చేయవలసినపని యేమనగా నిట్టి గ్రంథములు వ్రాయునప్పుడదివఱకు గ్రంథములు వ్రాసినవారిచే నుపయోగింపబడిన పదములనే వీలయినంతవఱకు వాడవలెను. అట్టి పూర్వ గ్రంథములు లేకపోయినపుడును, నితరులపదముల నుపయోగించుటకు నిష్టము లేనపుడును స్వయముగా పదముల నిర్మింపవచ్చును. అదియు నిదియు జేతకానప్పుడింగ్లీషు పారిభాషికపదములనే తీసికొని గ్రంథము వ్రాయవచ్చును. కాని పదములులేవని, శాస్త్రగ్రంథములు నిర్మించుట మానరాదు. శాస్త్రములు మొదట బుట్టును. పారిభాషిక పదములు పిదప స్థిరపడును. ఇదియే యితరదేశమందలి శాస్త్రవాఙ్మయాభివృద్ధియొక్క మర్యాద. పాశ్చాత్యదేశమందు జంతుశాస్త్రము మిక్కిలి యభివృద్ధినొంది, యందలి పారిభాషికపదములు పండిత పరిషత్తులచే నిర్ణయింపబడు చున్నవని మీరందఱు నెఱింగిన విషయమే. అట్టి శాస్త్రముయొక్క పారిభాషిక పదములు నప్పుడప్పుడు మాఱుచునేయున్నవి. 1766 లో లినాయిస్ అను శాస్త్రజ్ఞుడు జంతువుల వర్గీకరణ మేర్పఱచి యొక పరిభాష యేర్పఱిచెను. 1829 లో క్యువియర్ అనువాడు దానిని కొంతవఱకు మార్చి క్రొత్త పరిభాష నిర్మించెను. 1835 లో జీవన్ అను శాస్త్రజ్ఞుడు మరల వర్గీకరణమును దిద్దెను. 1848 లో ఆర్. ల్యూకార్డు అనువాడును, 1855 లో హెన్‌రిఎడ్‌వర్డ్ అనువాడును, 1859 లో ఆగాజిన్ అనువాడును, 1866 లో హెకల్ అను శాస్త్రజ్ఞుడును 1910 లో ల్యాంకెష్టరు అనువాడును మఱికొందఱును

జంతుశాస్త్రములందలి వర్గీకరణ పరిభాష నిష్టమువచ్చినట్లు మార్చిరి. తుదకు ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికాయొక్క 11 వ కూర్పునందు జంతుశాస్త్రమును ముఖ్యవ్యాసము వ్రాసిన లేఖకునకు నాశాస్త్రసంబంధమైన యితర వ్యాసములు వ్రాసిన లేఖకులకును వర్గీకరణమును గురించియు, పారిభాషిక పదములను గురించియు ఐకమత్యాభిప్రాయ భేదములు కలవు! కావున నేదే యందఱకు సమ్మతములైన శాస్త్రీయపదములు గూడినగాని గ్రంథములు వ్రాయవలెనుట గాని, వ్రాయవద్దనుట గాని వెఱ్ఱితనము. కావున శాస్త్రములందును, భాషయందును నభిమానముగలవారు నిర్భయముగా దమచేతనైనంత వఱకు శాస్త్రీయ గ్రంథముల నిర్మించి యితర గ్రంథకర్తలకును, నూతనముగా బుట్టుచున్న, పుట్టనున్న భాషావిషయక పరిషత్తులకును మార్గదర్శకులగుదురుగాక! యని నమ్ముచున్నాను.

పారిభాషిక పదములను గురించి యింకొక చిన్నసంగతి చెప్పవలసియున్నది. హిందూదేశమునందు ప్రస్తుతము శాస్త్రీయ పదములను సృజించుటకై మహాప్రయత్నములు చేయుచున్నవారు కాశీలోని నాగరీ ప్రచారిణీ సభవారు, రెండవవారు ట్వంటియత్ సెంచరీ డిక్షనరీ సంపాదకులును. మొదటిదానిలో ప్రొఫెసరు రే. ప్రొఫెసర్ బోస్, ప్రొఫెసర్ ఎల్ వంటి ఆంగ్ల, సంస్కృత భాషలయందును, పాశ్చాత్య శాస్త్రములయందును, మహా మహోపాధ్యాయులనిపించు కొనువారు కలరు. ట్వంటియత్ సెంచరీ డిక్షనరీలో ప్రొ. గజర్, డాక్టర్ సర్ బాలచంద్ర వంటివారును గలరు. కావున మనభాషలో నూతనముగా శాస్త్రవాఙ్మయమును బుట్టింప నెంచినవారు తప్పక యీ రెండు గ్రంథముల జూడనగును.

ఇంక నొక పూర్వపక్షమున్నది. కొందరు నూతనపదము లను మనము సృష్టింప నక్కఱలేనేలేదు: ఇంగ్లీషు పదములనే గ్రహించుట మంచిదని వాదించెదరు. కాని దీనికి నేను వేఱుగ జవాబు చెప్పనక్కఱలేదు. జర్మనీవారే చెప్పగలరు. యూరోప్ ఖండమునందిప్పుడు నిర్మింపబడుచున్న శాస్త్రీయ పదములు గ్రీక్ ల్యాటిన్ భాషలు దేవభాషలుగాగల జర్మనీవారికి వీని నంగీకరించుటకు నభ్యంతర ముండకూడదు కదా? వారి కదితరపదములకు దమభాషలో మారు పదములను గల్పించుకొని విద్యార్థుల నిమిత్తమై వ్రాయబడు పొత్తములలో వానినే వాడుచున్నారు! జర్మనీ దేశస్థులే యిట్లు చేయ, బూర్తిగా భిన్నభాషా సంప్రదాయముగల మన మా కర్కశ పదంబులనే సంస్కారమైన జేయక తీసికొనవలెననుట వింతగను, విపరీతంబుగను గన్పట్టుటలేదా? కావున మనము వీలయినంత వఱకు దేశ్యపదములను, వాడుకలోనున్న సంస్కృత పదములను వాడవలయును. అట్టి పదములు లేనప్పుడు సంస్కృత వాఙ్మయము నుండి సమానార్థకముల నిచ్చు పదముల నుపయోగించు కొనవలెను. అట్టి పదములను దొరకనప్పు డింగ్లీషు పదముల దీసికొనుట యపవాదము (Exception) గాను, స్వభాషపదముల నుపయోగించుట సామాన్యనియమము (General Rule) గను నెంచవలయును. అనగా విధిలేనప్పుడు మాత్రము న్యభాషా పదముల దీసికొన వలయును.

విద్వాంసులారా! భాషాభిమానులారా! మీరికనైన నౌదాసీన్యము మాని మహోత్సాహముతో శాస్త్రీయ గ్రంథరచనకు బూను కొనియెదరని వేడుచున్నాను.

---

## ఓరుగల్లు పునరాక్రమణ

(37వ పుట తరువాయి)

"అలాగేవుంచి అంటూ చిరునవ్వు నవ్వాడు అన్నమదేవుడు.

"మనమనుకొంటున్నప్పుడే యీ పిలుపుగూడ వచ్చింది. ఇది మన తలకు మించిన కార్యం అయినప్పటికీ నాకెందుకో చాల ధైర్యంగావుంది. ఏదో నాలో గొప్ప ప్రేరణ కలుగుతున్నది. తప్పనిసరిగా జయం చేకూరుతుందని అంతరంగం చెబుతూవున్నది. మనం మనమీద పెట్టబడనున్న గురుతర బాధ్యతను నిర్వర్తించ డానికి సిద్ధం కావడమే మంచిది."

"అలాగే అన్నయ్యా! ఈలాగా మహమ్మదీయ రాజ్యంలో ఒంటరిగా నిరంతర భయంతో బ్రతికేకంటే హిందూ రాజ్యస్థాపన చేయడమో, ఆ కార్యక్రమంలో వీరోచితంగా మరణం చెందడమో మంచిది. అంతేకాని మధ్యేమార్గంలేదు" అన్నాడు అన్నమదేవుడు.

అతని ధైర్యానికి మెచ్చుకొన్నాడు సోమదేవరాజు.

"మనం త్వరపడగూడదు. ముందుగా సైనిక శక్తిని సాధించుకోవాలి. తిన్నగా మన రాజ్యాన్ని విస్తరింపచేసుకోవాలి. తుంగభద్ర, కృష్ణానదుల మధ్యనున్న ప్రాంతాన్ని మొదట వశపరచుకోవాలి. ఆ తరువాత కంపిలిని పట్టుకోవాలి. అంత వరకు మలిక్ నబీని ఏమీ అనగూడదు" అన్నాడు రాజు.

"మంచిదే ఆలోచన. దేనికీమనం విద్యారణ్య యతీంద్రుల్ని కలుసుకొన్న తరువాత ఒక నిర్ణయానికి వద్దాము వారి యాశీర్వచనం పొందిన తరువాత కార్యక్రమానికి ఉపక్రమిద్దాము." అన్నాడు అన్నమ దేవరాజు.

"అలాగే చేదాము" అన్నాడు రాజు. (సశేషం)

# మహాభారతము

తెమ్మెగంటుల లక్ష్మణశాస్త్రి

## 55

ఒక మహాముని దేవేంద్రుని చూచి మిక్కిలి సంతసించి అర్ఘ్యాదులతో నాతిథ్యమిచ్చిన తరువాత ఇరువురకు నిట్లు సంవాదము జరిగెను :

ఇంద్రుడు : మహామునీ ! నీవు జన్మించి ఒక లక్ష సంవత్సరముల కాలమైనది కదా ! చిరంజీవులకు గల కష్టము లేవియో సెలవీయుడు.

బకుడు : దేవరాజా ! అప్రియులతో కలిసి యుండుట, ప్రియులతో విడిపోవుట, దుష్టజనుల సహవాసము, భార్యాపుత్రుల వినాశము, మిత్రబాంధవుల మరణము, జీవితము గడపుటకు గాను పరాధీనవృత్తిలో నుండుట, దరిద్రుడుగా నుండి. యితరుల యవమానమునకు గురియగుట, కులహీనుల యున్నతి, కులీనులకు నాశము, దేవదానవ మనుష్యులు విపరీతభావము పొందుట, కులహీనుల వశములో చిక్కి సత్కుల సంజాతులు క్లేశ పడుచుండుట. ధనవంతులు దరిద్రులను ఆక్రమించుకొని యుండుట లోకమునందు జరుగు ఈ విధమగు వైధర్మ్యము సర్వదా చిరంజీవి చూచుచుండవలెను. జ్ఞాన హీనులు ఆనందించుట, విజ్ఞులు క్లేశపడుట, మనుష్యులందరు బహు దుఃఖములతో క్లేశమునందుట చిరంజీవి చూడవలెను గదా !

ఇంద్రుడు:— మహామునీ! చిరంజీవులకు కలుగు సుఖములెవ్వియో వాటినిగూడ చెప్పుము.

బకుడు:— దేవేశ్వరా ! దుష్టమిత్రుల సహాయమును కోరకుండ తనకు గలిగిన దానితో దినములో నెనిమిదవ భాగములో గాని, పన్నెండవ భాగమునందు గాని శాకమును వండుకొని తృప్తిగా భుజించు వానిని చూచి యానందించుట చిరంజీవికి గలుగు సుఖములలో ముఖ్యమైనది. ప్రతి దినము అట్టివాడు అన్నముకొరకై పలుపాట్లు పడవలసిన యవసరముండదు గదా ! అతడే సుఖియనిపించుకొనును. దైన్యములేకుండా సంపాదించిన ఫలశాకములు గూడా శ్రేయస్సును గూర్చును. ప్రతిదినము అవమానము చెందుచు శ్రేష్ఠమగు పరాన్నమును భుజించువానికి శ్రేయస్సు చేకూరదు. అట్టివాని బ్రతుకు నెత్తురును నాకునట్టి కుక్క బ్రతుకుతో సమానమని పెద్దలు చెప్పుదురు. ఎవడు అతిథులకు, భృత్యులకు, పితరులకు అన్నముపెట్టి మిగిలినది తాను తినుచున్నాడో అది పవిత్రము, శ్రేష్ఠమునగు నన్నము మరియొకటి యుండదు సుమా! అతిథి భుక్తాన్న శేషమును భుజించువాడు, అట్టి అన్నమును ఎన్ని కబళములను తినునో అన్నివేల గోవుల దానము చేసిన ఫలమునందును. యౌవనమునందతడు చేసిన పాపములన్నియు నశించును. మంచి శ్రోత్రియ బ్రాహ్మణునకు భోజనము పెట్టి దక్షిణయిచ్చువాడు తత్కాలముననే సర్వపాపముక్తుడగును. దేవేంద్రా ! అట్టి మహనీయులను చూచుటకన్న చిరంజీవికి వేరొక సుఖమేమియుండును."

ఇట్లెన్నియో యితర కథలను బకమహాముని చెప్పగా విని యింద్రుడానందించి యతని సెలవు గైకొని తన లోకమునకు పోయెను.

### శిబి—సుహోత్రుల సంవాదము

బ్రాహ్మణుల మహిమను విని క్షత్రియుల మాహాత్మ్యమును జెప్పుమని ధర్మరాజు మార్కండేయ మహాముని నడుగగా నతడిట్లు చెప్పదొడగెను:— "రాజా! కురువంశములో నొకడగు సుహోత్రుడను రాజు ఒకప్పుడు మహామునులను సేవించి తిరిగి వచ్చుచూ తన రథమున గూర్చుండియే దారిలో 'శిబి' యను రాజన్యుని చూచెను. వారిరువురు నభిముఖముగా నిలచి పరస్పరము సన్మానములను జరిపికొని, వారిరువురు సమానగుణములు గలవారగుటచేత నొకరికి మరియొకడు దారి యీయలేదు. అప్పుడు నారదుడచటకు వచ్చి యేమియిట్లు ఒండురుల దారినడ్డగించి నిలుచున్నారు?' అని యడిగెను. దానికివారిట్లనిరి:—

"మహామునీ ! ధర్మవ్యవస్థచేయువారు అన్ని విషయములలో తనకన్న అధికుడగువానికి మార్గముతొలగ విడువవలెను' అని

చెప్పరి. మేమిరువురము సమానులమే. మాలో ఎవడు గొప్పవాడో మీరు నిర్ణయించి చెప్పుడు" ఆ మాటకు నారదుడిట్లనెను:— "కౌరవరాజా! తనతో మృదువుగా వ్యవహరించు వానియెడల క్రూరుడు గూడ మృదువుగానే యుండును. వాడు తన క్రూరత్వమును క్రూరుల యెడలనే చూపును. సాధువులు దుష్టుల యెడల గూడ సాధుత్వముతోనే వ్యవహరించెదరు. వారు సాధువులతో సాధువులుగా నుండుటను గూర్చి చెప్పనక్కరయే లేదుగదా? సుహోత్రా! మనుష్యుడు తనకు ఇతరులు చేసిన ఉపకారమునకు నూరురెట్లు అధికముగా ప్రత్యుపకారము చేసి తీర్చుకొనగలడు. దేవతలలోనే ఈ ప్రత్యుపకార భావము ఉండుననుటకు నియమములేదు. మనుష్యులలోగూడ నుండును. ఎన్ని చెప్పినను రాజా! ఉశీనరపుత్రుడగు ఈ శిబి నీకన్న స్వభావములో నెంతయో నుత్తముడు. ఇతడు పీనులను దానము చేతను. అసత్యవాదులను సత్యముచేతను. క్రూరుని ఓర్పుచేతను, దుష్టుని సాధుత్వము చేతను జయించును. కనుక మీ యిరువురిలో నుదారు లెవరో మీరే నిర్ణయించుకొని యెవరు శ్రేష్ఠుడో అతనికి ఇతరుడు దారి విడుపుడు" అని నారదుడు చెప్పి యూరకుండెను. అప్పుడు సుహోత్రుడు తన కుడివైపు శిబికి దారిని విడిచి యతని మహిమను పొగడుచు తన రాజధానికి పోయెను." ధర్మరాజా! క్షత్రియ మహిమను గూర్చి మరి యొక కథ చెప్పెదను వినుమని మార్కండేయ మహాముని యిట్లు చెప్పదొడగెను.

## యయాతి చరిత్ర

నహుష పుత్రుడగు 'యయాతి' దర్బారు దీరియుండగా నొక బ్రాహ్మణుడు గురుదక్షిణను యాచించుటకై వచ్చి 'రాజా! నేను గురువు కీయవలసిన దక్షిణా ద్రవ్యమును ఇమ్ము. దానికొక నియమముగూడ నున్నది' అనెను. ఆ మాటవిని రాజు 'భగవన్; ఆ నియమము తెలుపుడు' అనెను. ఆ మాటకు బ్రాహ్మణుడు 'రాజా! సాధారణముగా లోకమునందు వస్తువును యాచించు వారిపైన దాతలు ద్వేషము వహించెదరు. ఇప్పుడు నాకు ప్రియమైన వస్తువును నీవు ఏ విధముగా నిచ్చెదవు?' అనెను. ఆ మాట విని యయాతి, బ్రాహ్మణోత్తమా! నేనొక వస్తువును దానము చేసి దానిని గూర్చి మాటిమాటికి చర్చించను. నీవు యాచించుటకు తగని వస్తువేదియు నావద్దలేదు. కనుక యాచకుడగు నీవు అడిగిన వస్తువును ఇచ్చి మిక్కిలి సంతుష్టి చెందెదను. నీకు నేను ఎరుపు రంగుగల వేయి గోవులను ఇచ్చెదను. ఎందుకనగా, న్యాయ మార్గములోనన్ను యాచించు బ్రాహ్మణులు నాకు అత్యంత ప్రియులు. నా మనస్సులో యాచకుని యెడల నెప్పుడుగూడ క్రోధము కలుగదు. దానము నిచ్చి ఎప్పుడు గూడ 'ఆ వస్తువు పోయెనే' యని పశ్చాత్తాపపడను." అని చెప్పి యయాతి ఆ బ్రాహ్మణునకు వేయి గోవులను దానము చేసెను.

## సేదుక-వృషదర్భుల వృత్తాంతము

ధర్మరాజుకోరికపై మార్కండేయుడు క్షత్రియుల మహిమను గూర్చి యింకను నిట్లనెను :—"ధర్మరాజా! పూర్వము 'వృషదర్భుడు, సేదుకుడు' అను నిరువురు రాజులు నీతిమార్గ తత్పరులై సకల శస్త్రాస్త్ర కోవిదులై యుండిరి. వృషదర్భుడు బాల్యము నుండియే బ్రాహ్మణులకు వెండి బంగారము తప్ప ఇతర దానములు చేయకూడదను వ్రతమును రహస్యముగా నాచరించు చుండెను. ఆ విషయము సేదుక మహారాజునకు తెలియును. ఒకనాడొక వేదాధ్యయన సంపన్నుడగు బ్రాహ్మణుడు సేదుకుని కడకు వచ్చి 'గురుదక్షిణార్థమై తనకు వేయి గుఱ్ఱములను దానము చేయుమని వేడెను. 'అది నాకు సాధ్యము కాదు. ధర్మాత్ముడగు వృషదర్భుని కడకు పొమ్ము అతడు నీకిచ్చును!' అని సేదుకుడు బ్రాహ్మణునితో ననెను. అతడు వృషదర్భుని కడకు పోయి అట్లే యాచించెను. ఆ రాజు విని ఆ బ్రాహ్మణుని కొరడాతో కొట్టెను. 'నిరపరాధుడగు నన్నేల హింసించు చున్నావని బ్రాహ్మణుడు రాజును శపించబూనెను. అప్పుడు రాజు, 'దానమీయని వానిని శపించుట బ్రాహ్మణోచితకర్మమా!' అని యనెను. 'రాజా! నీ కడకు పోయి యాచించుమని సేదుకుడు చెప్పెను గనుక వచ్చి యాచించితిని'. అని బ్రాహ్మణుడనెను. అది విని రాజు, "నేడు నాకు వచ్చిన రాజకీయపు పన్ను ధనమంతయు రేపు ఉదయము నీకు గురుదక్షిణార్థమై యిచ్చెదను. కొరడాతో కొట్టిన వానికి దానమీయక వ్యర్థముగా నెట్లు పంపుదును." అని బ్రాహ్మణునకు ఆ నాటి ఆదాయమునంతయు నిచ్చెను.

(వృషదర్భుడు బ్రాహ్మణుని కొరడాతో కొట్టుటకు కారణమేమనగా, ఆ రాజునకొక కఠిన నియమముండెనట. ఏమనగా, అతడు వెండి బంగారములు తప్ప తదితర వస్తువులు బ్రాహ్మణులకు దానమీయకుండెను. తనను ఆ రెండు లోహము లడిగినవారికి సంతోషముతోనవి యిచ్చుచుండెనట. ఇతర వస్తువుల నడిగినవారు తన వ్రత భంగమును చేయుచున్నారని వారిని దండించుచుండెనట. 'ఈ బ్రాహ్మణుడు తాను స్వయముగా రాలేదు. సేదుకుడు పంపగా వచ్చినాడు గనుక తన వ్రత భంగమితడు చేయలేదని యతడు కోరిన అశ్వసహస్ర మూల్యము కన్న అధిక ధనము ఇచ్చి పంపెను) మార్కండేయుడు రాజుల మహిమ నింకను నిట్లు చెప్పెను :—

## ఇంద్రుడు-అగ్ని శిబిని పరీక్షించుట

"యుధిష్ఠిర మహారాజా! పూర్వము దేవతలు సభదీరి యుండి 'భూలోకమునకు పోయి యచట ఉశీనరుని పుత్రుడగు 'శిబి' యొక్క గొప్పతనమును పరీక్షించెదముగాక' యని నిర్ణయించుకొనిరి. ఆ పనికిగాను అగ్ని—ఇంద్రుడు భూలోకమునకు బయలుదేరిరి. అగ్నిదేవుడు పావురముగాను, దానిని తరుముచు నింద్రుడు డేగగాను రూపములు ధరించి పోయిరి. అట్లు తరుమబడిన పావురము భయము నభినయించుచు పరుగెత్తి పోయి శిబిరాజు నొడిలోపడెను. అప్పుడు పురోహితుడు "రాజా! ప్రాణ భయముచేత నీ కపోతము రక్షణార్థమై నిన్ను ఆశ్రయించినది. కాని, ఇట్లు కపోతము వచ్చి ఒడిలో పడుట భయంకరమగు ననిష్టసూచకమని పెద్దలు చెప్పుదురు. నీకు మృత్యువు సమీపించినది. ఈ అపాయమునుండి తప్పించు కొనుటకు శాంతి చేయవలసియున్నది. అధిక ధనమును దానము చేయుము." అని చెప్పెను. ఆ పావురమిట్లనెను :—

"రాజా! నేను దేగ వలని భయముచేత నిన్ను శరణు వేడితిని. నాకు ప్రాణదానము చేయుము. నిక్కముగా నేను కపోతము కాను. ఒక ముని నగుదును కపోత రూపమున తిరుగుచున్నాను. నన్ను రక్షింపుము. నేను బ్రహ్మచారిని. నిష్ఠతో వేదాధ్యయనము చేసినందున నా శరీరము కృశించినది. తపస్వి, ఇంద్రియ నిగ్రహము గలిగి గురువునకు ప్రతికూలము చేయనివాడను. పాప రహితుడను. ఇట్టి శ్రోత్రియుడనగు నన్ను దేగకు అర్పింపతగదు." అప్పుడు దేగ ఇట్లనెను:

రాజా! క్రమముగా అన్ని జీవులు పరస్పరం భిన్నభిన్న యోనులలో జన్మించుట సహజము. ఈ సృష్టి పరంపరలో నీవు గూడ నొకప్పుడు ఈ కపోత రూపములో జన్మించి యుండియుండవచ్చును. అందుచేతనే దీనికి ఆశ్రయము ఇచ్చితివి. నీవు నా భోజనమునకు విఘ్నము కల్పించకుము. దీనిని విడిచి నాకు ఆహారముగా నిమ్ము." ఆ మాటలు విని శిబి యిట్లు పలికెను:—

"ఆహా! ఎప్పుడైనను పక్షులిట్లు స్పష్టముగా మాట్లాడుట విన్నామా? విన్నావా? ఏమని న్యాయముగా వీటితో వ్యవహరించవలెను? ప్రాణసంకటములో వచ్చి ప్రాణరక్షణ కోరిన వారిని రక్షించని రాజుయొక్క దేశములో సకాలములో వర్షములు కురియవు. అతడు నాటిన బీజములు మొలకెత్తవు. శరణుజొచ్చిన వానిని శత్రువు చేతికి అందించిన రాజుయొక్క సంతానము చిన్నతనముననే గలవారగుదురు. వాని పితరులకు పితృలోకములో నెప్పుడును స్థానము లభించదు. అట్టి వాడిచ్చిన హవిస్సును దేవతలు గ్రహించరు. అతడనుభవించు ఐశ్వర్యానందములు వ్యర్థములగును. స్వర్గసుఖమునుండి భ్రష్టుడగును. ఇంద్రాదులతనిపై వజ్రాయుధ ప్రహారములు చేయుదురు." అని శిబి దేగతో నిట్లనెను:—
"శ్యేన రాజా! ఈ పావురమును విడువుము. నీ యాహారము కొరకు ఒక బలసిన వృషభమును అన్నముతో వండించి నీవున్న చోటికి పంపెదను. నీయిష్టము వచ్చిన చోటనుండుము." ఆ మాటకు దేగ "రాజా! నాకు వృషభము వలదు. ఇతర పశువేదియు లేనందున నేడు దేవతలీపావురమును నాకు ఆహారముగా పంపి నారనుకొందును. ఈ దేవదత్తమగు నా ఆహారమును విడువను." ఆ మాటవిని శిబి రాజు ఇట్లనెను:—

"వృషభమును, గొడ్డుటావును అన్నముతో వండించి నీకు పంపెదను. అవి యీ కపోతమునకన్న పుష్టికరములగు ఆహారము. నన్ను శరణుజొచ్చిన యీ పావురమును విడువుము. నేను నా ప్రాణములనైన విడిచెదను గాని దీనిని విడువను. ఇది మిక్కిలి సాధుజంతువని నీవెరుగవా? వ్యర్థముగా దీనికొరకై ప్రయాస పడకుము, దేగా! నన్ను దేశవాసులందరూ ప్రశంసించునట్లుగాను, నావలన నీకు ప్రియము కలుగునట్లుగాను నుండు కార్యమేదైనను చేసెదను, దానిని చెప్పుము." ఆ మాటకు దేగ యిట్లనెను:— రాజా! నీ కుడితొడ కోసి యీ పావురమెత్తు మాంసమును తూచి నాకిమ్ము. అట్లైనచో నిన్ను ప్రజలు ప్రశంసించెదరు. నా యిష్టార్థము కూడ పూర్తియగును.

అప్పుడు వెంటనే శిబి తన కుడితొడను కోసి మాంసమును తీసి తూచుటకు త్రాసు పళ్ళెములో నుంచెను. దానికన్న కపోతము భారముగా నధికమయ్యెను. రాజు క్రమముగా శరీరము నందలి మాంసమంతయు కోసి త్రాసులోనుంచినను అది అధికమయ్యెను. అప్పుడు రాజు తనే త్రాసులోనెక్కి కూర్చొనెను. అది చూచి దేగ అప్పుడు 'కపోతము రక్షింపబడెను.' అని చెప్పి యచటనే యంతర్ధానము చెందెను. అప్పుడు శిబి చక్రవర్తి పావురముతో "కపోతమా! ఈ ప్రజలందరు నన్ను పావురముగా భావించుచున్నారు. ఈ దేగ యెవరు? ఈశ్వరుడు తప్ప నితరులెవరుగూడ ఇంత చమత్కార కార్యమును చేయజాలరు" అనియనెను. అప్పుడు కపోతమిట్లనెను:— మహారాజా! నేను అగ్నిదేవుడను. ఈ దేగ ఇంద్రుడు. నీవు శ్రేష్ఠపురుషుడవు. మేమిరువురము నీ గొప్పతనమును పరీక్షించుటకు వచ్చినాము. నా కొరకు నీవు శరీరమంతయు కోసితివి. ఈ గాయము నిప్పుడే నయము చేసెదను. నీ చర్మము సుందరముగను, దివ్యమైన గంధముగను పవిత్ర పరిమళయుక్తముగాను చేసెదను. ఇది నీకు రాజచిహ్నముగా నుండగలదు. ఈ శరీరపు దక్షిణ పార్శ్వమునుండి ఒక పుత్రుడు కలుగును. అతడు ధర్మముతో ప్రజాపాలకుడై, దేవతలకు అత్యంత ప్రియుడుగా నుండగలడు. అతనికి 'కపోతరోమ' అను పేరు ఉండగలదు. అతడు నీ తొడను భేదించుకొని పుట్టును కనుక అతనికి 'ఉద్భిద' నామము గూడ ప్రసిద్ధమగును. అతని శరీరము నందు వెంట్రుకలు పావురపు వెంట్రుకలవలె నుండును. శరీరము వృషభ శరీరమువలె పరిపుష్టమై యుండును. యశస్వియగును సురథ వంశములో నతనిలో సమానుడు అంతటి వీరుడు శూరుడు మరియొకడు ఉండబోడు." ఇట్లు చెప్పి కపోత రూపధారియగు అగ్నిదేవుడు అంతర్ధానము చెందెను.

## శిబి మహిమ వర్ణనము

ధర్మరాజు కోరికపై మార్కండేయ మహాముని యింకను క్షత్రియుల మహిమను గూర్చి యిట్లు చెప్ప దొడగెనని వైశంపాయనుడు జనమేజయునకు చెప్పెను:— మహారాజా! విశ్వామిత్రుని పుత్రుడగు 'అష్టకుడు' చేసిన అశ్వమేధయాగములో సమస్తరాజులు వచ్చియుండిరి. అతని సోదరులగు 'ప్రతర్దనుడు వసుమనుడు, ఉశీనరపుత్రుడగు శిబి' అను వారలుగూడ వచ్చి యుండిరి. అష్టకుడు యజ్ఞము ముగించుకొని సోదరులతో రథములో పోవుచుండగా దారిలో నారద మహాముని కనపడగా నా ముప్పురు నారదునకు నమస్కరించి 'మహాత్మా! నీవుగూడ మా రథముపైకి రమ్ము' అనిరి. నారదుడు రథము నెక్కి కూర్చుండెను. 'మహాత్మా! మేము నలుగురము దీర్ఘాయుష్మంతులము గాను, సర్వగుణ సంపన్నులముగాను నున్నాము గనుక సర్వదా ప్రసన్నులమై యుండెదము. మేము నలుగురము గూడ చాల కాలము సుఖానుభవము కొరకు స్వర్గములోకమునకు పోవుచున్నాము కాని, మాలో నెవడు తొలుత భూలోకమునకువచ్చును? అని వారు నారదు నడిగిరి. నారదుడిట్లనెను. అందరికన్న తొలుత అష్టకుడు భూమిలో నవతరించును. దానికి కారణమేమనగా, ఒకనాడు నేను అష్టకుని యింటిలోనే ఉంటిని. ఆనాడు అతడు నన్ను రథము

వెందు ప్రసిద్ధుండెను. నేను దారిలో వివిధ వర్ణములుగల గోవులు వేలువేలుగా మేయుచుండుటను చూచితిని 'ఇవి యెవరి గోవులు?' అని అష్టకునడిగితిని. 'ఇవి నేను దానముగా నిచ్చిన గోవులు' అని యాతడనెను. ఈ విధముగా నతడు తాను జేసిన దానమును గూర్చిన ఆత్మస్తుతి చేసికొనెను. అందుచేత నితడు స్వర్గమునుండి మా యందరికన్న తొలుత దిగవలసినవాడగును. 'అతని తరువాత మా ముగ్గురిలో నెవడు స్వర్గమునుండి మొదలు దిగును' అని వారు నారదునడిగిరి. అతడు 'ప్రతర్దను'డనెను 'దానికి కారణము, పూర్వము నేనతనియింటిలో నున్నప్పుడతడు గూడ నన్ను తన రథములో త్రిప్పెను అప్పుడు నలుగురు బ్రాహ్మణులు ఒకరి తరువాత నొకరు వచ్చి 'నాకొక అశ్వము నిమ్ము' అని ప్రతర్దనుని వేర్వేరుగా వేడిరి 'నేను తిరిగి వచ్చి యిచ్చెద'నని ప్రతర్దనుడనెను. 'వెంటనే యిమ్ము' అని బ్రాహ్మణులనిరి. 'అట్లైనచో తీసికొనుడు' అని ప్రతర్దనుడు తన రథమునకు కట్టబడిన నాలుగు గుఱ్ఱములను వరుసగా నలుగురికి నిచ్చెను. అపుడా ప్రతర్దనుడే, రథ భారమును తన మూపుపైన మోసి, 'బ్రాహ్మణులిట్లు చేయుట తగదు' అని నిందగా పలికెను" అని చెప్పి నారదుడు, ధర్మరాజా! దానమునిచ్చి పిదప నిందింప గూడదు గనుక ప్రతర్దనుడు స్వర్గమునుండి తొలుత దిగిపోవును' అనెను.

'ఆ మిగిలిన యిరువురిలో నెవడు ముందుగా స్వర్గము నుండి భూమికి వచ్చును?' అని వారడిగిరి. 'వసుమనుడు' అని నారదుడనెను దానికి కారణమిట్లు చెప్పెను. 'నేను పూర్వమొకసారి వసుమనుని యింటికి పోయినపుడు అతనివద్ద నొక రథముండెను. అది పర్వతములు—ఆకాశము—సముద్రములు మొదలగు దుర్గమ ప్రదేశములలో సులభముగా పోయిరాగలదు. దాని పేరు 'పుష్ప రథము.' దానిని యాచించుటకే నేను ఈ రాజు కడకు పోయి యుంటిని. ఆ నాడు అతడు బ్రాహ్మణులతో నొక శుభ కార్యమును చేయుచుండెను. ఆ కార్యము ముగిసిన తరువాత బ్రాహ్మణులకు తన రథమును జూపెను. నేను దానిని మిక్కిలి ప్రశంసించితిని. 'మీకు యోగ్యమని తోచిన రథము మీదేయగుగాక' యనెను. ఇట్లే రెండవసారి వచ్చినప్పుడు గూడ నాతో నీరాజు అట్లే యనెను. మూడవసారి నేను స్వయముగా నీరాజు నింటిలో శుభ కార్యమును చేయించితిని. దానికి సంతుష్టుడై యితడు బ్రాహ్మణులతో 'ఈ యశ్వమును ఆశించి యున్నాడు గనుక నారదుడు నేడు నా శుభకార్యమును చక్కగా శ్రద్ధగా చేయించినాడు' అని కపటముతో ననెను. అందుచేత వసుమనుడు తొలుత స్వర్గమునుండి దిగిపోవును. అది విని వారు నారదునితో నిట్లనిరి :—

"అప్పుడు 'శిబి' ఒక్కడే మా నలుగురిలో నీతోనుండును గదా! అప్పుడు భూలోకములోనికి తొలుత నీవు దిగుదువా లేక శిబియా?". ఆ మాటకు నారదుడు ఇట్లనెను :—

'శిబి యొక్కడే స్వర్గమునకు పోవును. నేను భూమికి దిగెదను. కారణమేమనగా. నేనెప్పుడుగూడ శిబితో సమానుడను కాజాలను. ఎందుకనగా, శిబి వద్ద కొకనాడొక బ్రాహ్మణుడు వచ్చి 'అన్నము పెట్టు'మని యాచించెను. 'నీవు కోరిన ఆహారము నిచ్చెద'నని శిబి యనెను. నీ కొడుకగు 'వృషదర్భుని' చంపి అన్నము వండి సిద్ధముగా నుంచి నా కొరకు వేచియుండుము' అని బ్రాహ్మణుడనెను. 'అట్లే'యని శిబి బ్రాహ్మణుడు కోరినట్లే చేసి అన్నపు పళ్లెరము తలపైన నుంచుకొని బ్రాహ్మణునికై చూచు చుండెను. అప్పుడొకడు వచ్చి 'శిబిరాజా! నీ వెవనికై యీ యన్నము సిద్ధము చేసి వేచియున్నావో ఆ బ్రాహ్మణుడే నీ నగరములో ప్రవేశించి నీ యింటిని ధనాగారమును, ఆయుధశాలను, అంతఃపురమును, అశ్వశాలను, గజశాలను అన్నింటిని దహించు చున్నాడు' అనెను. అది విని శిబి ఏమాత్రము మనోవికారము చెందక అట్లు దహించుచున్న బ్రాహ్మణుని వద్దకు అన్నము తీసికొనిపోయి 'బ్రాహ్మణోత్తమా! ఇదిగో నీ కొరకు నీవు కోరిన యన్నమును సిద్ధముచేసి తెచ్చితిని. భుజింపుము'అని యనెను. అది విని బ్రాహ్మణుడేమి యనక తలవంచుకొనియుండగా, ద్విజోత్తమా! దయచేసి భుజింపు'మని మరల ననెను ఆ మాటకు బ్రాహ్మణుడు 'ఈయన్నమును నీవే తిను' మని శిబిని కోరెను. శిబి వెంటనే ఆ పళ్లెరమును ముందిడుకొని తినదలచెను. అప్పుడు ఆ బ్రాహ్మణుడు శిబి చేయిపట్టుకొని, 'శిబీ! నీవు క్రోధమును జయించినావు. బ్రాహ్మణుని కొరకు ఏ వస్తువునైనను నీవు సంతృప్తితో నీయగలవు.' అని శిబిని గౌరవించెను.


రాజు తలయెత్తి చూచునరికి పుత్రుడు సర్వాలంకార శోభితుడై యెదుట కనబడెను అంతటితో నా బ్రాహ్మణుడంతర్ధానము చెందెను. అతడు కేవల బ్రాహ్మణుడు కాడు. బ్రహ్మదేవుడే శిబిని పరీక్షించుటకు బ్రాహ్మణ వేషధారియై వచ్చియుండెను.

ఆ తరువాత మంత్రులు రాజుతో 'రాజా! నీవు ఏమికోరి యింతటి దుస్సాహసకృత్యము చేసితివి' అనిరి. ఆ మాటకు శిబి యిట్లనెను :— మంత్రులారా! నేను కీర్తిని కోరికాని, ధనము కొరకుగాని, సుఖేచ్ఛచేగాని దానము నీయను. దానము చేయుట ధర్మాత్ములు అనుసరించిన సన్మార్గము. పాపిష్ఠులు ఈ మార్గమును సేవించరు. ఈ కారణముచేత ఈ మార్గమును నేను అనుసరించితిని. సత్పురుషులు నడచు మార్గమే ఉత్తమము. అందులకే నా బుద్ధి సజ్జనుల మార్గమునే అనుసరించును." అని శిబి చెప్పిన మాటలను నారదుడు వారితో చెప్పెను. "కనుక ధర్మరాజా! శిబి సర్వోత్తమ మహిమగలవాడని నేను బాగుగా నెరుగుదును. కనుకనే అతని చరిత్రమంతయు నీకు తెలిపితిని" అని మార్కండేయ మహాముని ధర్మరాజాదులకు చెప్పెను.

( సశేషము )

# దేశంలోని ఏకైక కూర్మ దేవాలయం శ్రీ కూర్మం

—సి. ఎ. నరసింహారెడ్డి



ఆంధ్రప్రదేశం పుణ్యక్షేత్రాలకు పుట్టిల్లు. శైవము, వైష్ణవము, శాక్తేయము మొదలగు మత సంప్రదాయాలు ప్రబలినకాలది పూర్వపు రాజులు తమ తమ ఇష్టదైవములకు భక్తి ప్రపత్తులతో నిర్మించిన దేవాలయాలు వందలు, వేల సంవత్సరాలైనా చెక్కుచెదరకుండా భారతీయ వైదిక ధర్మ సందేశాలను చాటుతూ, తరతరాల నుంచీ తరగని సంపత్తిగా మన సంస్కృతికి ప్రతీకలై నిలచియున్నాయి.


హిందూమతంలో సర్వదేవతా గణానికి సంబంధించిన దేవాలయాలు రాష్ట్రమంతటా విరాజిల్లుతున్నవి. ముఖ్యంగా మూడు విచిత్రమైన దేవాలయాలకు ఆంధ్రప్రదేశ్ పేరుపొందినది. అలాంటి దేవాలయాలు మనదేశంలో చాలా అరుదు. అవి శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లి వద్దగల సూర్యాలయం. ఆదిలాబాదు జిల్లా బాసర్ గ్రామంలోనున్న సరస్వతి ఆలయం. శ్రీకాకుళం జిల్లాకు చెందిన శ్రీకూర్మంలోని కూర్మాలయం. అరుదైన సుప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు యివి

శ్రీకూర్మం పేరు వినగానే తాబేలు రూపంలో అవతరించి సముద్రంలో దేవదానవుల మర్థనలో మునిగిపోతూవున్న మంధర పర్వతాన్ని మోసిన శ్రీమహావిష్ణువు మన స్మృతిపథంలోకి వస్తాడు. శివునకు, విష్ణువునకు, రామునకు ఆలయాలెన్నియోకలవు కాని తాబేలు ఆకారంలో అవతరించిన విష్ణుమూర్తికి ఆలయం శ్రీకూర్మంలో తప్ప దేశంలో మరెక్కడాలేదు. విష్ణు భగవానుని రెండవ అవతారమైన కూర్మావతార రూపంలో ఇక్కడ మూర్తి వెలసింది. అందుచేత యీ గ్రామానికి శ్రీ కూర్మం అనే పేరు వచ్చింది. గుడిలో వున్న మూర్తిని శ్రీకూర్మనాథస్వామి అనే పేరుతో పిలుస్తారు.

శ్రీకూర్మం, శ్రీకాకుళానికి తూర్పున సుమారు 20 కిలో మీటర్ల దూరాన సముద్ర తీరానికి దగ్గరగావున్న మహాపుణ్యక్షేత్రం యాత్రికులు మదరాసు, కలకత్తా రైలుమార్గంలో వున్న 'శ్రీకాకుళం రోడ్డు' స్టేషన్‌లోదిగి బస్సుద్వారా శ్రీకూర్మం చేరుకోవచ్చు. ఇచ్చట వసతి సౌకర్యాలున్నవి.

## గంగరాజులు

శ్రీకాకుళం జిల్లా ఒకప్పుడు కళింగరాజ్యంలో అంతర్భాగంగా వుండేది నందరాజులు, మౌర్యులు, శాతవాహనులు,



గంగవంశీయులు యీ ప్రాంతాన్ని పరిపాలించారు. గంగవంశ రాజులు క్రీ.శ. [illegible] సంవత్సరంలో అధికారంలోకి వచ్చి క్రీ.శ. 1437 సంవత్సరం వరకు పాలించారు. వీరికాలంలోనే యీ ప్రాంతం మహోన్నత స్థితిలో వుండేదని చెప్పటకు తగిన చారిత్రిక ఆధారాలు ఉన్నాయి. శ్రీకూర్మ క్షేత్రం కూడా గంగరాజన్యుల పరిపాలనలో వెలసిందనీ. వారికాలంలోనే కూర్మాలయం నిర్మించబడిందనీ యిక్కడ దొరికిన కొన్ని శిలా శాసనాలు నిరూపిస్తున్నాయి.

## శిల్పసంపద

శ్రీకూర్మం అతిసుందరమైన శిల్పసంపదకూ, ప్రాచీన శిలా శాసనములకూ పేరుపొందిన దేవాలయం. ఇక్కడి శిల్పకళా ఖండాలు శిలాశాసనాలు కళింగుల నాటి రాజకీయ, సాంఘిక పరిస్థితులను తెలుపుతాయి. అందమైన రాతిస్తంభాలతో నిర్మించబడిన దేవాలయ మంటపాలు. చుట్టూ రాతిపై చెక్కబడిన శిల్ప కుడ్యాలు ఆనాటి జనజీవనానికి మచ్చుతునకలు. మన ప్రాచీన శిల్ప కళానైపుణ్యానికి అవి తార్కాణాలు. శ్రీకూర్మ దేవాలయ విమాన శిఖరం విశేషమైన చోళ శిల్పకళా శైలిలో నిర్మించబడింది. అయితే దేవాలయ ప్రాకారానికి ఆవలగల ద్వారాలు మాత్రం చోళుల కాలం తరువాత నిర్మించబడినవే. ఈ శిల్పాలలో జీవకళ ఉట్టిపడుతుంది. ఎంత సేపుచూసినా తనివితీరని శిల్పాలవి. ఈ ఆలయం మొదట శివాలయంగావుండేదనీ అతరువాత శ్రీరామానుజాచార్యులు దీన్ని వైష్ణవాలయంగా మార్చారని ప్రపన్నామృతమనే సంస్కృతగ్రంథంలో పేర్కొనబడింది.

శ్రీకూర్మంలో ఒక ముఖ్యమైన శిలాశాసనం ఉంది. ఇది ఆంధ్రమహాభారత, గ్రంథకర్తృ ఎవరనే వివాదానికి దారితీస్తుంది. చాళుక్యరాజవంశానికి చెందిన విజయాదిత్యుడనే రాజకుమారుడు క్రీ.శ. [illegible] సంవత్సరంలో వేయించిన శిలాశాసనం ద్వంద్వార్థాన్ని కలిగిస్తుంది దీనినిబట్టి తూర్పుచాళుక్యరాజైన రాజరాజనరేంద్రుడు మహాభారతాన్ని తెలుగు భాషలోకి అనువదించినట్లుగా ఒక అర్థం వస్తుంది. ఆంధ్రభాషలోకి కవులచే వ్రాయించాడనే మరొక అర్థం కూడ వస్తుంది. ఏదియేమైనను రాజరాజనరేంద్రుడు గొప్ప కళాపోషకుడు ఆయన ఆస్థానకవి నన్నయభట్టారకుడు. వీరి కాలంలోనే తెలుగు సాహిత్యం ఉన్నత శిఖరాలను అందుకున్న దనడంలో ఎటువంటి సందేహంలేదు.

## స్థలపురాణం

శ్రీకూర్మక్షేత్ర మహాత్మ్యము, దాని నిర్మాణ చరిత్ర, స్థలపురాణానికి సంబంధించిన గాథలు అనేకం ప్రచారంలో వున్నాయి. శ్రీహరి స్వయంగా దత్తాత్రేయ ఋషికి స్వప్నంలో దర్శనమిచ్చి ఆ పవిత్రక్షేత్ర పురాణమును వివరించినట్లు ఒకగాథ వుంది. గాథననుసరించి శ్వేతాచలమనే పర్వతమున్నట్లు అపర్వతము నుంచి సూతుడు అనేరాజు రాజ్యమును పరిపాలించినట్లు పేర్కొనబడి వుంది. ఆయన భార్య మహాభక్తురాలు. రాణి ఏకాదశవ్రతనిష్ఠాగరిష్ఠురాలట. ఒకనాడు భగవంతుని ధ్యానించే సమయంలో రాజు ఆమె వద్దకు వెళ్ళాడట. ఆమె వెంటనే తనవ్రతము భగ్నముకాకుండా చూడవలసిందని భగవంతుని ప్రార్థించెనట. అప్పుడు శ్రీకూర్మనాథస్వామి ఆమె యొక్క అభీష్టాన్ని తెలుసుకొని ఆమె వ్రతభంగంకాకుండా ఆరాజదంపతుల మధ్య గంగానది ప్రవహించేటట్లుగా చేశాడట. తద్వారా రాజు తపస్సులోనున్న రాణిని కలుసుకోలేక వంశధారనదీ తీరాన నివసించాడట. ఒకనాడు నారద మహాముని ఆ నదీతీరంలోవున్న రాజుకు కనిపించి రాజు తపస్సు చేసినయెడల శ్రీహరి అనుగ్రహం లభించగలదని చెప్పి, నారదముని సూతరాజునకు కూర్మమంత్రోపదేశం చేసినాడట నారదుని ఉపదేశంప్రకారం సూతరాజు కూర్మ మంత్రాన్ని జపిస్తూ, శ్రీహరి నామ స్మరణ చేస్తూ కఠోరమైన తపస్సుచేశాడట. తపసునకు మెచ్చి శ్రీహరి శంఖ చక్ర గధ పద్మ ధారియై శ్రీకూర్మావతారంలో దర్శనమిచ్చాడట. తరువాత నారదముని, సూతరాజు, శ్రీకూర్మనాథస్వామి యీ ముగ్గురూ పక్కనే ఒక పర్వతంపైవున్న వక్రాంగ మహాఋషి ఆశ్రమానికి వెళ్తుండగా దారిలో ఒక పవిత్రస్థలాన్ని చూసి మహావిష్ణువు తన చక్ర మహిమతో క్షీర సముద్రమనే తటాకాన్ని సృష్టించాడట. శ్రీమహాలక్ష్మి ఆ పవిత్ర స్థలానికి వచ్చి అక్కడే స్థిరపడిందట. ఈ పరమ పవిత్రస్థలమే శ్రీకూర్మమనే పేరుతోనూ. లేక కూర్మగుండమనే పేరుతోనూ వెలసింది. సూతరాజు, భక్తిభావంతో శ్రీకూర్మంలో ఒక దేవాలయాన్ని కట్టించాడట.


ఈ దేవాలయ నిర్మాణానికి సంబంధించిన మరొక గాథ ఉంది. ఇక్కడున్న క్షీరసముద్రంలో స్నానంచేసినట్లయితే సర్వ పాపాలు పోతాయనే విశ్వాసం ప్రజల్లోవుంది. ఒకప్పుడు ఒక భిల్ల వనిత ఆకలి దప్పులతో బాధపడుతూ క్షీర సముద్రానికి వచ్చి స్నానంచేసి అత్యున్నత స్థాయినందుకొన్నదట. తన అనుభవాన్ని ఆ భిల్లస్త్రీ భర్తకు విన్నవించగా అతనుకూడా వచ్చి క్షీరసముద్రంలో స్నానంచేసి భగవంతుని అనుగ్రహం పొందాడట. శ్రీకూర్మనాథస్వామిని దర్శించి స్వామివారి పరమభక్తుడై, ఒక ఆలయం కట్టించాడట. ఇవి శ్రీకూర్మక్షేత్ర మహాత్మ్యానికి సంబంధించిన స్థలపురాణాలు.

శ్రీకూర్మం నలుప్రక్కలా మరికొన్ని క్షేత్రాలు, తీర్థాలు ఉన్నాయి. పశ్చిమదిశలో పిప్పల అను గ్రామంవద్ద సుందరేశ్వర స్వామిపేర ఒక శివక్షేత్రము, తూర్పున వంశధారానదీ, సముద్ర సంగమస్థానంలో సుప్రసిద్ధ కొద్దుదేవాలయము, అక్కడనుండి పశ్చిమదిశన కోటీశ్వరాలయము మొదలగు పుణ్యక్షేత్రములు గలవు. తీర్థములలో చక్రతీర్థము అష్టతీర్థము, సుధాగుండము వక్రతీర్థము పేర్కొనదగినవి.

సముద్ర తీరానికి సమీపాన వున్నందుచేత యిక్కడి వాతావరణం చాలా ఆహ్లాదకరంగా వుంటుంది. దేవాలయంలో కూర్చొన్నంతసేపు మనస్సు ప్రశాంతగావుంటుంది.


ఇటు భక్తి ప్రపత్తులలోను, శిల్పకళానైపుణ్యంలోను, అటు చారిత్రికంగాను శ్రీకూర్మం పేరుపొందిన మహాపుణ్యక్షేత్రం.

# నగర వార్తా చిత్రాలు




కుడివైపు పైన : కేంద్ర పౌర విమానయాన, యాత్రావిషయాల మంత్రి డా. కరణ్‌సింగ్ హైదరాబాదు విమానాశ్రయంలో జనవరి 31న కొత్త టెర్మినల్ భవనానికి ప్రారంభోత్సవం చేశారు.


మధ్య : కేంద్ర పౌర విమానయాన, యాత్రా విషయాల స్టేట్ మంత్రి డా. సరోజినీ మహిషి సికింద్రాబాదు బోట్‌క్లబ్ వద్ద యువజన హాస్టలుకు శంకుస్థాపన చేశారు.



క్రింద : భారతీయ విద్యాభవన్ అధ్యక్షురాలు శ్రీమతి లీలావతి మున్షీ జనవరి 10వ తేదీన ఆనంద నిలయంలో ముఖ్యమంత్రికి ఒక సెట్టు పుస్తకాలను బహూకరించారు.

ఎడమవైపు క్రింద : హైదరాబాదు కలెక్టరు జనవరి 26న ముఖ్యమంత్రికి, రక్షణ నిధి విరాళాలుగా సేకరించిన రూ. 5 లక్షలకు చెక్కును బహూకరించారు.





# శ్రీ మంత్రాలయ క్షేత్రము

వారణాసి రామమూర్తి 'రేణు'

శ్లో. మూకోఽపి యత్ప్రసాదేన ముకుందశయనాయతే
రాజరాజాయతే రిక్తో రాఘవేంద్రం తమాశ్రయే

ఆంధ్రప్రదేశంలో అత్యంత మహిమాన్వితమైన హరిక్షేత్రం తిరుపతి అయితే అత్యద్భుతమైన గురుక్షేత్రం మంత్రాలయం. ఈ మంత్రాలయం గురుసార్వభౌములు శ్రీ రాఘవేంద్రస్వామి చరణుల పావన శిలాధామి: భక్తశిరోమణి ప్రహ్లాదుని యజ్ఞవాటిక. కర్నూలు మండలంలో ఆ నగరానికి దాదాపు 65 మైళ్ళ దూరాన రంగోత్తుంగ తరంగిణి తుంగభద్రానది తటాన విరాజిల్లే అద్వితీయ తీర్థరాజం. నేటికి 300 ఏండ్ల క్రితం మధ్వమతాధిపతులలో వరిష్ఠులయిన శ్రీరాఘవేంద్రస్వాములు ఆ ప్రదేశాన జీవసమాధి పొందటంతో దానికింత ప్రాధాన్యం యినుమడించింది. నేటికీ శ్రీ స్వామిపాదు లాక్షేత్రంలో బృందావనాంతర్గతులై తమ దివ్యమహిమల చేత సురధేనువువలె భక్తలోకానికి సేవిత మానవాళికీ సమానంగా కామ్యాలు వర్షిస్తూ భక్తి భాగీరథిని ప్రవహింప జేస్తున్నారు. శ్రీవారి ఆయు: ప్రమాణము 700 సంవత్సరములు. ఇంకనూ 4 వందల ఏండ్లు వారా దివ్యధామంలో విరాజిల్లి భక్తిజ్ఞానాల ప్రచారం సిరిసిగా చేయగలరు. గురు సార్వభౌముల జీవితగాథకు వలెనే వారి అద్భుత లీలలు గూడ చిత్ర విచిత్రాలు, ముగ్ధ మోహనాలు, ప్రాణ ప్రేరకాలు. తమ అనుగ్రహానికి పాత్రులయిన వారలకెందరకో ఆ మహానుభావుడు నేటికీ సోపాధికంగా దర్శనమిచ్చి కరుణిస్తున్నాడనేందుకు తార్కాణాలు కోకొల్లలు. శ్రీవేంకటాచలపతి వరప్రసాదియై యవతరించిన ఈ సాధుపుంగవుడా తిరుమలేశునకు వలెనే తనదయామృత వృష్టిలో ప్రపన్నలోకాన్నంతటినీ ముంచెత్తుతుంటాడు. వారి కృపాదృష్టి దేశ, కాల, జాతి, మత, వర్ణభేదాల కతీతమై సార్వకాలీనము. సార్వభౌమమూ, సార్వజనీనమూనైనది. "ఏనేనా హార్త్యేనా సమకబదిసాల హేమర:" అనే సత్యానికి చక్కని నిదర్శనము.

శ్రీ రాఘవేంద్రస్వామివారు పూర్వాశ్రమంలో మహాభాష్యం వేంకటాచార్యులుగా ప్రసిద్ధికెక్కారు. వీరి పూర్వీకులు సాహిత్య సంగీతాలలో అందెవేసిన విద్వత్కుటుంబానికి చెందినవారు. గౌతమగోత్రజులు, ఆంధ్రభోజుడు, శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో సంగీత విద్వాంసుడుగా పేరొందిన కృష్ణభట్టు మన కథానాయకునకు ప్రపితామహుడు. ఆయన కుమారుడు కనకాచలభట్టు వైణికశిఖామణి. ఆయన సుపుత్రుడు వీణావాదన తత్త్వజ్ఞుడు నయిన తిమ్మనభట్టు శ్రీ స్వామిపాదుల పూర్వాశ్రమ జనకులు. తళ్లికోట యుద్ధానంతరము విజయనగర ఆస్థానాన్ని ఆశ్రయించిన పండితులు కవులు కళాకోవిదులు తమ వైదుష్యాన్ని గుర్తించి ఆదరించే ఆశ్రయదాతల నన్వేషిస్తూ తలకొకదిశగా వెళ్ళారు. ప్రకృత్యా భక్తుడైన తిమ్మనభట్టు తన సహధర్మిణి గోపికాంబతో తమ దీక్షాగురువులు మధ్వమఠాధిపతులునగు శ్రీ సురేంద్రతీర్థుల నాశ్రయించారు.

ఆ పుణ్యదంపతులకు లేకలేక తిరుపతి వేంకటేశుని కృపాకటాక్షం వల్ల వేంకటాంబ, గురురాజు అనే పుత్రికా పుత్రులు కలిగారు. అంతటితో తృప్తిపడని తిమ్మనభట్టు అంతరాత్మ లోకోత్తరుడైన పుత్రుణ్ణి కాంక్షించి తపించసాగింది. భార్యాభర్తలు తిరుపతి వెళ్ళి నలుబది రోజులు ఏకాగ్రతతో ఆ సప్తశైలేశుణ్ణి ఉపాసించారు. స్వామి అనుగ్రహించినట్లు స్ఫురించగానే మహానందముతో తిరిగి తుండీరమండలం వెళ్ళి తంజావూరి నేలుతున్న చెవ్వప్పనాయకుని ఆస్థానవిద్వాంసుడయ్యాడు తిమ్మనభట్టు. ఆనాడు తంజావూరాస్థానం తాతాచార్యులు, విజయీంద్ర తీర్థులు, శ్రీమదప్పయ్య దీక్షితులు లాంటి భక్త విద్వద్వతంసుల క్రీడాస్థలిగా విలసిల్లింది. నవమాసములు మోసి క్రీ. శ. 1601 వ సంవత్సరములో శ్రీ గోపికాంబ ముద్దులు మూటకట్టే అద్భుత శిశువును ప్రసవించింది. జాతకర్మాదుల యథావిధిగా నెరపి, తిమ్మనభట్టు తమ యిలువేలుపగు శ్రీనివాసుని పేర, వేంకటనాథుడని నామకరణం చేశాడు. ఒకానొక అనిర్వచనీయమైన సంతృప్తితో, ఆనందంతో పొంగిపోయాడు.

తిమ్మన భట్టు స్వయంగా కుమారునకు విద్యాభ్యాసం చేయించి బాలుని కుశాగ్ర బుద్ధికి లోలోపల మురిసి పోయేవాడు. కుమార్తె వెంకటాంబను లక్ష్మీనరసింహాచార్యులనే ఉత్తమ వరునకిచ్చి వివాహం చేశాడు. ఆ అల్లుడు మహా మేధావి, పండితుడు. అప్పటికి మధ్వ పీఠాచార్యులయిన విజయీంద్రులు సిద్ధి పొంది శ్రీ సుధీంద్ర తీర్థులు ఆ ఆధిపత్యాన్ని తీసికున్నారు. సుధీంద్రులు తిమ్మన భట్టును మఠానికి మరల ఆహ్వానించారు. అప్పటికి విజయీంద్ర తీర్థుల పాండిత్య ప్రభావాల వల్ల వైష్ణవలోకంలో మధ్వ మఠానికి మంచి పేరు ప్రతిష్ఠలు లభించాయి. అందుచేత ఆ అవకాశాన్ని జారవిడవక తిమ్మన భట్టు సకుటుంబంగా కుంభకోణం వెళ్ళాడు. అక్కడ బాలుడైన వెంకటాచార్యుని ప్రతిభకు సుధీంద్ర తీర్థులు వెరగుపడి తిమ్మన భట్టును చక్కని పారితోషికము నిచ్చి గౌరవించి పంపారు.

వృద్ధాప్యంలో తిమ్మన భట్టు కుటుంబం దారిద్ర్య బాధకు గురి అయింది. కొంత కాలానికాయన మరణించడంతో పెద్ద కుమారుడైన గురురాజు మీద కుటుంబ భారం పడింది. అతడు వెంకటాచార్యునకు ఉపనయనం గావించి తన బావ గారైన లక్ష్మీనరసింహాచార్యుల వద్దకు శాస్త్రాధ్యయనానికై పంపాడు. అక్కడ కావ్య నాటకాలంకార వ్యాకరణ న్యాయ దర్శనాదులు క్షుణ్ణంగా అభ్యసించి మూల రామస్వామి పట్ల తీవ్రమైన భక్తి ప్రపత్తులను పెంచుకున్నాడా మహామాణవకోత్తముడు. సంగీతం, ముఖ్యంగా వీణా వాదనంలో చక్కని ప్రావీణ్యం సంపాదించాడు. సహజంగా సుందరుడైన ఆ రూప రాశికి యుక్త వయస్సు రావడం బంగారానికి పరిమళమబ్బి నట్లయింది. ఒకానొక ముహూర్తం చూచి సరస్వతి అనే సుగుణ ఖనినన్వేషించి గురురాజు తమ్మునికి వివాహం గావించాడు. వివాహమైన మొదటి కొలది దినాలు వెంకటాచార్యులు భార్యతో సుఖ జీవనం గడిపాడు. తర్వాత ఉదర పోషణం భారమైంది. ప్రకృత్యా ఆత్మాభిమాని కావడంతో యితరులను యాచించ లేక పోయాడు.

అలాంటి స్థితిలో వారున్న గ్రామానికి సమీపంగా మధ్వ మఠం సంచారం చేస్తూ వచ్చింది. భార్య సలహా ననుసరించి తన శాస్త్రాధ్యయనం వృద్ధి చేసుకునే అవకాశం లభించిందని సంతోషించి సకుటుంబంగా మఠాన్ని చేరుకున్నాడా భాగవతోత్తముడు. మఠాధిపతి అయిన సుధీంద్ర తీర్థులా శిష్య రత్నాన్ని చూచి ఉప్పొంగి పోయారు. సంప్రదాయ సిద్ధంగా, సరహస్య సకల శాస్త్రమంత్రాలనూ ప్రీతి పురస్సరంగా ఉపదేశించారు. మఠంలో ప్రవేశించడం వెంకటాచార్యుల జీవితంలో అత్యంత ప్రముఖమైన సంఘటన, సరికొత్త మలుపు. శ్రీ రాఘవేంద్రస్వామిగా వారి జీవితానికి పూర్వ రంగం దానితో ప్రారంభమైంది.

మఠ ప్రశస్తిని విని నాటి తంజావూరు నాయకరాజు స్వామి వారిని ఆహ్వానించారు. ఆ ఆస్థానంలో శ్రీయజ్ఞ నారాయణ దీక్షితులు ప్రధాన విద్వాంసులు. మీమాంస శాస్త్రానికి చెందిన శిల్ప సూత్రం మీద చక్కని వ్యాఖ్య రచించారు. ఆయన శ్రీ వెంకటాచార్యులను పరీక్షించి ఆయన పాండిత్యానికి జోహారు లర్పించి ఆస్థానంతరపున భూరిగా గౌరవించారు. ఆ తర్వాత శ్రీ వెంకటాచార్యులు తన వైదుష్యాన్ని ఉపయోగించి మధ్వ వేదాంతానికి సేవ చేయ సంకల్పించుకొని ప్రారంభంలో, అణు మధ్వ విజయ గ్రంధానికి వివరణం వ్రాశారు. అందులో శ్రీ మధ్వాచార్యుల జీవిత గాధను భక్తలోకానికి చక్కగా అర్ధమగునట్లు వివరించి అద్భుతమైన విజయం సాధించారు.

ఇలా ఉండగా మఠాధిపతులయిన శ్రీసుధీంద్ర తీర్థులకొకనాడు స్వప్నంలో మహా భాష్యం వెంకన్న భట్టుకు తన తర్వాత మఠాధిపత్యం, శ్రీ మూల రామ పూజాధి కారం యివ్వ వలసినదిగా భగవదాదేశం అయింది. స్వామి వారి ముఖతః నేరుగా ఆ విషయం విని వెంకటాచార్యులు ఆపాదమస్తకం కంపించి పోయాడు. చిర కాలం గర్భ దారిద్ర్యం అనుభవించి కొన్నాళ్లుగానే సంసార సుఖాలకు నోచుకొన్న తను, తన బహిః ప్రాణం భార్యనూ బిడ్డనూ వదలి సన్యసించడమా ! తాను అందుకు ఎంతమాత్రమూ అంగీకరించ లేదు. గురువు గారితో నిర్మొగమాటంగా తానాశ్రమ స్వీకారాని కంగీకరించేది లేదని కరాఖండిగా, బలవంతం చేస్తే మఠం వదలి వెళ్లి పోతాననీ కూడ చెప్పేశాడు. అంతట ఒకనాటి రాత్రి తురీయ యామంలో విద్యాలక్ష్మి ఆయనకు స్వప్న సాక్షాత్కారం యిచ్చి గుర్వాజ్ఞను మన్నించి ఆశ్రమ స్వీకరించ వలసినదిగా ఆదేశిస్తుంది. దాంతో భార్యా పుత్రుల మీది మమకారాన్ని చంపుకొని ఆశ్రమ స్వీకారానికి అంగీకరిస్తాడు. సుధీంద్రులు వెంటనే ఆయన కుమారునకు మఠంలోనే యథావిధిగా ఉపనయనం చేయించి, మఠ సంచారమనే మిషలో తంజావూరు వెంకటాచార్యులను తీసుకు వెళ్లారు. తనతో వస్తానని పట్టు బట్టిన భార్యను ఎలాగో సమాధాన పరచి కుంభకోణంలోనే ఉంచుతాడు వెంకన్న భట్టు. ఈ విషయం స్వామి వారికి తనకూ తప్ప మరెవరికి తెలియ లేదు.

ఆ రోజుల్లో తంజావూరిని తెలుగు రఘునాథ భూపాలుడు పాలిస్తుండే వాడు. ఆయనకు మధ్వ మఠ మంటే ఎంతో భక్తి శ్రద్ధలుండేవి. సుధీంద్ర తీర్థుల సంకల్పం విని మహదానందపడి ఆశ్రమ స్వీకారోత్సవం తన దర్బారులోనే ఎంత వైభవంతో జరిపించారు. ఆ చరిత్రాత్మకమైన సంఘటన 1621 సంవత్సరం ఫాల్గుణ శుద్ధ విదియ నాడు జరిగింది. శ్రీ సుధీంద్రులు, వెంకటాచార్యులకు దీక్షా మంత్రం, శాటీ దండకమండలాలు, వ్యాస ముష్టి, మూల రామ, జయరామ, దిగ్విజయ రామ విగ్రహాలు, శ్వేతచ్ఛత్రం, బంగారు పల్లకీ, చామర ద్వయం యిచ్చి, తమకు గలిగిన స్వప్నా దేశం మేరకు 'రాఘవేంద్ర యతి' అని నామ కరణంచేశారు.

ఆశ్రమ స్వీకారానంతరం స్వామివారు దిగ్విజయ యాత్రకు బయలుదేరి మధుర, మైసూరు, ఉడిపి, వెల్లూరు, గదగు, హుబ్బళి, సిర్‌సింగి, పండరీపురం, నాసిక, బీజాపూరు, ఆలూరు, మాన్వీ, శ్రీశైలం, తిరుపతి, కంచి, అరుణాచలం, శ్రీముష్ణం, కుంభకోణం, హంపి, హొసపేట, మొదలైన అనేక ప్రదేశములలో పర్యటించి తమ సమత్వ దృష్టి, విద్వత్తు, అసమానమైన వ్యక్తిత్వం, తపోమహిమలు ప్రదర్శించి సర్వజనులకు ఆరాధ్యులయ్యారు. వెళ్లిన ప్రతిచోట వారికి బ్రహ్మరథం పట్టారు. విమతస్థుడయిన బీజాపూరు సుల్తాన్ సైతం స్వామివారికి జగద్గురు అనే బిరుదు యిచ్చి శ్వేతచ్ఛత్రముతో గజోత్సవం చేయించాడు. ఇలా ఎన్నో పర్యాయాలు దేశ పర్యటనలు చేస్తూ భక్తుల ననుగ్రహించి భక్తిజ్ఞాన ప్రచారం చేయసాగారు. కొన్నేండ్ల తర్వాత అలాగే పర్యటిస్తూ ఆంధ్రలో కర్నూలు జిల్లాలో ఉన్న ఆదోని వెళ్లారు. ఆ రోజుల్లో సిద్దీమసూద్‌ఖాన్ అనే మహమ్మదీయుని ఏలుబడిలో ఆ ప్రాంతం వుండేది. అతడివద్ద దివాన్‌గావున్న వెంకన్నపంతు అనే ఆయన స్వామివారి శిష్యుడు. అప్పటికి కొన్ని సంవత్సరాలు క్రితం స్వామీజీ ఆయన్ని ఆశీర్వదించి ఆపత్తు ఏదైనా వస్తే, తనను స్మరించుకొమ్మని చెప్పారట. అప్పుడా వెంకన్న ఒక అనాథగా ఉండేవాడు. స్వామివారి అనుగ్రహబలంతో క్రమంగా పైకివచ్చి చివరకు సుల్తానుకు ముఖ్య సలహాదారైనాడు. స్వామీజీ యిన్నేండ్ల తర్వాత

తాను దివాన్ పదవిలో ఉన్నప్పుడు ఆదోనిరాజ్యం ఆ భక్తుడికి పరమానందం కలిగించింది. తాను సపరివారంగా ఎదురేగి స్వామి జీని ఆహ్వానించి వైభవంతో భిక్షలు చేయించ మొదలు పెట్టాడు. తన ప్రభువైన మసూద్‌ఖాన్‌కు ఆయన మహిమాన్వితుడని ఎంతో గొప్పగా చెప్పాడు. మొదట్లో ఖాన్ ఆయన మాటలను విశ్వసించక స్వామివారిని పరీక్షించ దలచుకున్నాడు. ఒకనాడు తన దివాన్‌ను పిలిచి తాను స్వామివారిని చూస్తానని చెప్పడంతో సంతోషించి వెంకన్న ఆ సంగతి స్వామికి తెలిపి అందుకు కావలసిన ఏర్పాట్లు చేశాడు. మనస్సులో కపటం పెట్టుకొన్న ఖాన్ ఒక పళ్లెంలో మాంసఖండాలుంచి వాటిని చక్కగా మఖ్మల్ గుడ్డతో కప్పి స్వామివారికి ఉపాయనంగా అర్పించి ఎదుట ఆసీనుడయ్యాడు. స్వామిజీ మసూద్‌ఖాన్‌ను కుశలప్రశ్నలు వేసి ఎంతో దయతో తియ్యగా మాట్లాడారు. ఆ మహాతపస్వి దర్శనంతో ఖాన్ మనస్సు పూర్తిగామారి తాను చేసిన పనికి లోలోపల పశ్చాత్తాప పడసాగాడు. కొంతసేపు మాట్లాడి శ్రీ రాఘవేంద్రస్వామి, ఖాను "వద్దు వద్దు" అంటున్నా వినక తను కమండలూదకాలు అతడు తెచ్చిపెట్టిన పళ్లెంమీద చల్లి తన శిష్యునికని పైన కప్పిన మఖమలు గుడ్డ తొలగించమన్నారు. వస్త్రం తొలగించగానే మాంసఖండాలకు బదులు మామిడిపండ్లు పూలతో నిండిన ఆ పళ్లరాన్ని చూచి ఖాను నివ్వెరపడి స్వామివారికి తాను చేసిన తప్పిదం చెప్పుకొని క్షమార్పణ వేడుకున్నాడు! స్వామిజీ మందహాసంతో అతణ్ణి అనుగ్రహించారు.

ఆ సంఘటనతో శ్రీ రాఘవేంద్రుల గొప్పతనాన్ని గురించి వెంకన్నపంతు చెప్పిన ప్రతి మాట నిజమని నవాబుకు రూఢి అయింది. తన ఏలుబడిలో ఏదేని ఒక గ్రామం వారికి కానుకగా యివ్వాలని నిశ్చయించుకున్నాడు. ఆ సంగతి తెలిసిన వెంకన్న పంతు ఆనందంతో గంతులువేస్తూ గురువుగారికా విషయం చెప్పారు. అప్పుడు స్వామిజీ తుంగభద్ర నదీతీరాన గల మంచాళ అనే గ్రామం యివ్వమని అడిగారు. అందుకు వెంకన్న, అది ఊసర క్షేత్రమని అక్కడ రాళ్లు నీళ్లు తప్ప మరేమీ లేదని వేరే ఒక మంచి సంపన్నమైన గ్రామాన్ని తాను యిప్పిస్తానని గురువుగారితో వాదిస్తాడు. అందుకు శ్రీ రాఘవేంద్రులు తమకా గ్రామమే కావలయునని, తామా విషయంలో పట్టుపట్టడానికి గల కారణం సమయం వచ్చినప్పుడు చెబుతానని వెంకన్నను ఒప్పిస్తాడు. గురువుల మహిమ తెలిసినవాడు గనుక వెంకన్న విధిలేక ఆ కుగ్రామాన్నే స్వామివారికి పట్టా వగైరాలతో స్వాధీన పరుస్తాడు.

అప్పటికి స్వామివారికి వృద్ధాప్యం వచ్చింది. తర్వాత కొన్నాళ్లకు ఒకనాడు వెంకన్న పంతుకు కొందరు పనివారలను నేలత్రవ్వ సాధనాలు తీసికొని రమ్మని కబురు చేస్తారు. వారలతో తుంగభద్ర ఒడ్డుననే గల ఒక చోటుకు వెళ్లి అక్కడ త్రవ్వ వలసినదనీ, ఒక హోమగుండము జపమాల వగైరాలు బయటపడుతాయనీ చెబుతారు. స్వామివారు చెప్పినట్లుకొంతలోతు త్రవ్వినంతనే హోమగుండం, భస్మం, పావుకోళ్లు, జపమాల బయటపడడంతో అందరూ అద్భుతాశ్చర్యాలు పొందుతారు. వెంకన్న జిజ్ఞాసను శాంతింపచేసేందుకు స్వామిజీ ఆ ప్రదేశం పవిత్రమైందనీ భక్త శ్రేష్ఠుడు ప్రహ్లాదుడు ఎన్నో యుగాల క్రితం అక్కడ యజ్ఞం చేశాడనీ అందువలననే తానా ప్రదేశమే కావలయునని కోరుకొంటిననీ చెబుతారు. అంతేకాకుండా తనకాయుర్దాయం 700 సంవత్సరాలనీ అన్నేండ్లు సోపాధికంగా భూమిమీద సంచరించడం కలియుగ ధర్మానికి విరుద్ధమనీ, కాగా తామా ప్రదేశాన జీవ సమాధి గైకొందుననీ అందుకు అనువైన రాతి కట్టడం నిర్మింప చేయుమని ఆదేశిస్తారు. అది విని వెంకన్న బాధపడుతూ మంచి పాలరాళ్లు తెప్పించి అందంగా సమాధి నిర్మించాలని సంకల్పించుకుంటాడు. శ్రీరాఘవేంద్రులాతని సంకల్పాన్ని వారించి అక్కడకు దాదాపు 3, 4 మైళ్ల దూరాన మహాద్వారం (నేటి మాధవరం) పురోపకంఠాన ఒకానొక వృక్ష చ్ఛాయలో పడివున్న పెద్ద నల్లని చట్రాతిని గొనితెచ్చి దాని శకలాలతో బృందావనం నిర్మించమని చెబుతారు. అందుకు కారణంగూడ వివరిస్తూ శ్రీరాముడు వనవాసం చేస్తూ దక్షిణ దిశకు పయనించినప్పుడు కొద్దిగడియలా రాతిపై ఆసీనుడై సేదతీర్చుకున్నారని చెబుతారు. ఆ విధంగా ప్రహ్లాదుని పవిత్ర యజ్ఞకుండం ఉన్నచోట శ్రీ రఘుపతి అంగ స్పర్శచే పునీతమైన ఆ శిలారాజంతో బృందావన నిర్మాణం జరిగిస్తాడు వెంకన్న పంత్.

స్వామివారు ఆదేశించిన విధంగా నిర్మాణం సిద్ధమైన తర్వాత నేటికి 300 సంవత్సరాలకు పూర్వం క్రీ. శ. 1671 సంవత్సరం శ్రావణ బహుళ విదియనాడు అభిజిన్ముహూర్తాన ఆ యతిసార్వభౌములు వందలాది భక్తుల సమక్షంలో సమాధిలో ప్రవేశించారు.

సూర్య చంద్రాది ప్రత్యక్ష దైవాలకు వలె శ్రీ వారు గూడ తమ విభూతులను కులమత జాతి దేశకాల పరిస్థితులనే భేదాలను ఏమాత్రం పట్టించుకో కుండా మానవాళికి సమంగా పంచి పెడుతున్నారు. ఈ విషయంలో ఎలాంటి సందేహం లేదు. సిద్దీ మసూద్ ఖాన్ బీజపూరు సుల్తాను లాంటి విమతస్థులనే కాక దాదాపు 150 ఏండ్ల క్రితం ఈస్టిండియా కంపెనీ ప్రధానాధికారిగా ఉండిన సర్ థామస్ మన్రో అనే విదేశీయుడైన క్రైస్తవునకు గూడ ప్రత్యక్ష దర్శనమిచ్చి ఆయనతో సంభాషించి మంత్రాక్షతలొసగి అనుగ్రహించారు : ఈ విషయం ఆనాటి బళ్లారి జిల్లా గజెటీరులో నమోదై ఉంది.

*

# కాలేజిగేటు కామేశం

కామేశంగారికి నలుగు రాడపిల్లలు. గుండెల మీది కుంపట్లా పెళ్ళి కెదిగి కూచున్నారు. చూస్తే కడిగిన ముత్యాల్లా వుంటారు. కానీ ఏం లాభం. కాసుల్లేకపోతే రంభ దిగొచ్చినా ఆ మూడు ముళ్ళూ పడతాయండీ ఈ రోజుల్లో—!

భార్య పురుడోసుకున్నపుడల్లా పక్క వాటా ఏజంటు భీమారావు పాలసీలు తీసుకోండీ అని పోరేవాడు. తనే ఖాతరు చెయ్యలేదు. కాలేజీ గేటులో నుంచుని వరుడికోసం అబ్బాయిల్ని వాకబు చేస్తున్నప్పుడు ఆయనకి ఆ సంగతే గుర్తొచ్చి నాలిక్కరచుకుంటూ వుంటాడు.

योगक्षेमं वहाम्यहम्

జీవితభీమాను
మించినది మరియేదియులేదు




EP.LIC.19.71

# జిల్లాలో


## దేశరక్షణ నిధి

కూడేరు పంచాయతీ సమితిలోని మర్రాడు గ్రామ యువకులు దేశరక్షణ నిధికిగాను 24–1–72వ తేదీన "కురుక్షేత్రం" అను నాటకాన్ని ప్రదర్శించారు. నాటకములోని ముఖ్య విశేషం గ్రామ సర్పంచ్ శ్రీ వేలూరి సుబ్బన్న దుర్యోదనుని పాత్రను, గ్రామ స్థాయీ కార్యకర్త శ్రీ వై. నారాయణరెడ్డి భీముని పాత్రను నిర్వహించడం.

నాటకము వేయగా వచ్చిన రూ. 1,016. లను కూడేరు సమితి బ్లాకు డెవలెప్‌మెంటు ఆఫీసరు శ్రీ కె. హనుమంతరెడ్డి



మర్రాడు గ్రామ సర్పంచ్ శ్రీ వేలూరి సుబ్బన్న, నాటకం వేయగా వచ్చినదైన రూ 1016 లను రక్షణనిధికై కూడేరు సమితి బి. డి. ఓ. శ్రీ కె. హనుమంతరెడ్డికి అందజేస్తున్న దృశ్యం.



ఫిబ్రవరి 2 న విశాఖపట్నంలో నౌకాదళ అధికారుల సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి

గారికి చెక్కు రూపమున గ్రామ సర్పంచ్ శ్రీ వేలూరి సుబ్బన్న సమర్పించారు. నాటి కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా పరిషత్ సెక్రెటరి శ్రీ ఎ. అచ్చయ్యశాస్త్రి ఉపన్యసిస్తూ గ్రామ ప్రజల దేశభక్తిని కొనియాడారు. సమితి సూపర్ వైజరు శ్రీ యం. చిన్నస్వామి నాయుడు కూడ ప్రసంగించారు.

## వీరన్నగుట్ట కాలనీలో నివేశ స్థలాలపట్టాల పంపిణీ

ముఖ్యమంత్రి శ్రీ. పి. వి. నరసింహారావు గారు కాచిగూడ సమీపంలోని వీరన్నగుట్ట హరిజన కాలనీలో నివేశన స్థలాల పట్టాలు పంచిపెట్టారు. ఈ సందర్భంలో ఆయన ప్రసంగిస్తూ ప్రభుత్వం హరిజనులు ఇతర వెనుకబడిన ప్రజల శ్రేయస్సు కొరకు అనేక అభివృద్ధి పథకాల క్రింద కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నదని చెప్పారు. ఈ పథకాల నుంచి లాభం పొందవలసిందని ఆయన ఉద్బోధించారు.

సభకు హైదరాబాదు జిల్లా కలెక్టరు శ్రీ టి. లక్ష్మారెడ్డి, జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ యం. భోజిరెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టరు శ్రీ యం. శ్రీరాములు, డిప్యూటీ డైరెక్టరు శ్రీ ఇ. రామమోహన్, శ్రీమతి శాంతాబాయి గారలు హాజరైనారు.



శ్రీకాళహస్తి బ్లాకుకు చెందిన పెద్ద కన్నలి మహిళామండలి అధ్యక్షురాలు శ్రీమతి కె. రామలక్ష్మమ్మకు యునెసెఫ్ ఉపప్రధానాధికారి సతీమణి శ్రీమతి గ్రున్ జనవరి 11న ట్రాన్సిస్టరును బహూకరిస్తున్న దృశ్యం

## తిరుపతిలో ఇండ్ల కాలనీకి ప్రారంభోత్సవం

రవాణా శాఖమంత్రి శ్రీ కె. గోపాలనాయుడు, ఫిబ్రవరి 6వ తేదీన తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ప్రకాశం నగర్ కాలనీకి ప్రారంభోత్సవంచేస్తూ విశ్వవిద్యాలయంలోని సిబ్బందికి గృహ సౌకర్యం కల్పించినందుకు సిండికేటును అభినందించారు.

ఆంధ్రకేసరి శతాబ్ది ఉత్సవంలో మంత్రి ప్రసంగిస్తూ ఆ మహానాయకుని గుణగణాలను అలవర్చుకోవాలని విద్యార్థులను ఉద్బోధించారు.

అంతకు ముందు విశ్వవిద్యాలయం రిజిస్ట్రారు శ్రీ ఎం.కె. రామకృష్ణ మంత్రికి స్వాగతం చెప్పారు.

ఉత్సవానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు డా॥ డి॥ జె. రెడ్డి ప్రసంగిస్తూ రూ 10.21 లక్షల ఖర్చుతో ప్రకాశం నగర్ లో 72 యిండ్లు నిర్మించ బడినాయని అన్నారు.

## గుంటూరు జిల్లాలో హరిజనులకు 10 వేల యిండ్ల నిర్మాణం

గుంటూరు జిల్లాలో బలహీన వర్గాల శ్రేయస్సు కొరకు రూ 1.30 కోట్ల ఖర్చుతో 10,000 ఇండ్లు నిర్మించడం జరిగింది. వచ్చే ఐదేండ్ల లోపల గుంటూరు జిల్లాలోని హరిజనులు గిరిజనులందరికీ ఇండ్ల స్థలాలు, ఇండ్లు కేటాయించడం జరుగుతుంది. వ్యవసాయ కూలీలకు ఉపాధికల్పించే ఉద్దేశంలో శీఘ్రతర గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు రూ 15 లక్షలు ఖర్చు పెట్టడం జరిగిందని గుంటూరు జిల్లా కలెక్టరు చెప్పారు.

## పాలేరులో లంబాడి ఇండ్ల కాలనీకి శంఖుస్థాపన

ఖమ్మంజిల్లా కలెక్టరు శ్రీ ఆర్. పార్థసారథి తిరుమలాయపాలెం పంచాయతీ సమితిలోని పాలేరు గ్రామంలో ఫిబ్రవరి 4వ తేదీన లంబాడీ కాలనీకి శంఖుస్థాపన చేశారు. 33 లంబాడీ కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి 5 సెంట్ల భూమి చొప్పున నివేశన స్థలాలు కేటాయించ బడినాయి.

ఈ సందర్భంలో కలెక్టరు ప్రసంగిస్తూ సమాజంలో బలహీన వర్గాల సంక్షేమం కొరకై ప్రభుత్వం చేబట్టిన వివిధ అభివృద్ధి పథకాలను వివరించి చెప్పారు. ఈ గ్రామంలోని 30 హరిజన కుటుంబాలకు కూడా ఒక కాలనీ ఏర్పాటు చేయబడుతుందని ఆయన చెప్పారు.

ఈ శంఖుస్థాపన సందర్భంలో కలెక్టరు మెడలో వేసిన పూలహారం వేలం వేయగా వచ్చిన రూ॥ 116/-లను జాతీయ రక్షణ నిధికి సమర్పించడం జరిగింది.

ఖమ్మం తహశీల్దారు శ్రీరంగారావు వందన సమర్పణ చేశారు.

## ఖానాపురంలో హరిజన కాలనీకి శంఖుస్థాపన

ఖమ్మంజిల్లా కలెక్టరు శ్రీ ఆర్. పార్థసారథి ఖమ్మం పంచాయతీసమితిలోని ఖానాపురం గ్రామంలో ఫిబ్రవరి 4వ తేదీని 30 హరిజన ఇండ్ల కాలనీకి శంఖుస్థాపన చేశారు.

హరిజనుల సంక్షేమం కొరకు అమలు జరుగుతున్న అభివృద్ధి పథకాలను చేపట్టడానికి హరిజనులు ముందుకు రావాలని కలెక్టరు ఉద్బోధించారు. ఇండ్ల నిర్మాణం త్వరలో పూర్తి కావాలని ఆయన వారికి చెప్పారు.



[illegible] జనవరి 26న [illegible] ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో శ్రీ [illegible] కవితలు చదువుతున్న దృశ్యం

ఖమ్మం ఆర్.డి.ఓ. శ్రీ జి. వెంకటరెడ్డి, గిరిజన సంక్షేమ వ్యవహారాల స్పెషల్ డిప్యూటీ కలెక్టరు శ్రీ బన్సీలాల్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఇతర జిల్లా అధికారులు ఈ శంఖు స్థాపనోత్సవానికి హాజరైనారు.

## కొమరగిరి పట్నంలో హరిజన కాలనీకి శంఖు స్థాపన

తూర్పు గోదావరి జిల్లా కలెక్టరు శ్రీ యల్. మూల కొండయ్య కొమరగిరి పట్నంలో షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలవారి కొరకు తక్కువ ఖర్చుతో నిర్మించబడే హరిజన కాలనీకి ఫిబ్రవరి 3వ తేదీన శంకుస్థాపన చేశారు

ఈ సందర్భంలో ఆయన ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ షెడ్యూలు తెగల సహకార గృహ నిర్మాణ సంస్థ పథకం క్రింద తూర్పు గోదావరి జిల్లాలో 1,001 ఇండ్లు నిర్మించడానికి ప్రభుత్వం మంజూరు ఇచ్చిందని తెలిపారు.

ఈ పథకం క్రింద కొమరగిరి పట్నం వాస్తవ్యులైన హరిజనులకు (మాజీ సైనికులకు) రూ 60,100 ఖర్చుతో 53 ఇండ్లు నిర్మించబడుతాయి. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోపల ఈ ఇండ్ల నిర్మాణం పూర్తి అవుతుంది

## రాయుడు పాలెంలో హరిజన కాలనీకి శంఖుస్థాపన

పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరు శ్రీ యస్. ఆర్. గోవింద రాజన్ రాయుడు పాలెంలో 61 ఇండ్లుగల హరిజన కాలనీకి ఫిబ్రవరి 11వ తేదీన శంఖుస్థాపన జరుపుతూ జిల్లాలో హరిజనులందరికీ ఇండ్లు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సంకల్పించిందని చెప్పారు. ఈ కాలనీకి త్వరలో అన్ని సౌకర్యాలు కల్పించ బడుతాయని ఆయన చెప్పారు

జిల్లా షెడ్యూలు తరగతులు, గిరిజన గృహ నిర్మాణం సంఘం ఆధ్వర్యాన ఈ కాలనీ నిర్మించ బడుతుంది. చింతలపూడి పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ యం. సత్యనారాయణ ప్రసంగిస్తూ, బలహీన వర్గాల శ్రేయస్సుకై ప్రభుత్వం అనేక అభివృద్ధి పథకాలను అమలు జరుపుతున్నదనీ, హరిజనులు, ఈ సౌకర్యాలనుంచి లాభం పొందాలనీ చెప్పారు

## కరీంనగరంలో స్ట్రాపేపరు ఉత్పత్తి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన సిఫారసు ప్రకారం న్యూఢిల్లీలోని స్ట్రాపేపర్ లిమిటెడ్ కంపెనీ, కరీంనగరులో ఒక కాగితపు పరిశ్రమను స్థాపించి అందులో సాలీనా 7500 టన్నుల స్ట్రాపేపరు, లైన్‌పేపరు ఉత్పత్తి చేయడానికి ఆ కంపెనీకి భారత ప్రభుత్వం అనుమతి ఇచ్చింది ఈ పరిశ్రమ పెట్టుబడి రూ. 1.5 కోట్లు వుంటుంది. ఇందులో సుమారు 400 మందికి ఉద్యోగాలు లభిస్తాయి.

## బూర్గంపాడులో గిరిజనులకు ఎద్దుల సరఫరా

ఇటీవల ఖమ్మం జిల్లా కలెక్టరు శ్రీ ఆర్. పార్థసారధి బూర్గంపాడులో గిరిజనులకు, లంబాడీలకు సేద్యంకొరకు 10 ఎద్దులను పంపిణీచేశారు. వీటిని కొనడానికి రూ. 4,000 లు ఖర్చు అయింది. కలెక్టరు 135 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ. 100 ల చొప్పున ఆపత్కాల తక్కావీ రుణాలు, 144 మంది గిరిజనులకు పట్టా సర్టిఫికెట్లు పంచిపెట్టారు.



సహకార సంఘాల రిజిస్ట్రారు పి. కె. దొరైస్వామి ఫిబ్రవరి 8న తెనాలిలో టాక్సీ సహకార సంఘానికి ప్రారంభోత్సవం చేసిన అనంతరం ఒక డ్రైవరుకు టాక్సీ పత్రాలను అందజేస్తున్న దృశ్యం

## ప్రొద్దుటూరు సమితిలో అభివృద్ధి పనుల పరిశీలన

కడప జిల్లా కలెక్టరు శ్రీ యస్. వి గిరి ఇటీవల ప్రొద్దుటూరు సమితిలోని ఏరర్లపాలెంలోని కమ్యూనిటీ బావులను, ఎయిజల కాలనీని సందర్శించారు. శీఘ్రతర కార్యక్రమం క్రింద ఈ గ్రామంలో బావుల త్రవ్వకం పనులు, గ్రామీణ గృహ నిర్మాణం కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఇక్కడ ఎరుకల జాతి ప్రజల కొరకు 21 కుటుంబాలకు ఇండ్లు నిర్మించబడినాయి

ప్రొద్దుటూరు సమితిలో 6 గ్రామాలలో 1971–72 సంవత్సరంలో షెడ్యూలు తరగతుల, షెడ్యూలు కులాలవారికొరకు 156 ఇండ్లు నిర్మించడానికి ఒక పథకం మంజూరుచేయబడింది. ఈ యిండ్ల నిర్మాణం 1972 మార్చిలోగా పూర్తి అవుతుంది.

## గుంటూరులో పాల ప్రాజెక్టు


వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ కాకాని వెంకటరత్నం గుంటూరు జిల్లాలోని అంగలకుదురులో పాల ఉత్పత్తిదారుల ప్రథమ మహాసభకు ఫిబ్రవరి 20 ఐ తేదీన అధ్యక్షత వహిస్తూ గుంటూరు జిల్లాలో వచ్చే సంవత్సరం రూ. 5 కోట్ల ఖర్చుతో ఒక కొత్త పాలప్రాజెక్టు స్థాపించబడుతుందని చెప్పారు. విజయవాడలో ఇప్పుడున్న పాల కేంద్రంలో పాల ఉత్పత్తి శక్తిని 1972 అక్టోబరు ఆఖరునాటికి రోజుకు 2.5 లక్షల లీటర్లకు పెంచడం జరుగుతుందని, అది ఇప్పటి శక్తికి రెండింతలు వుండగలదని ఆయన అన్నారు.

లాభనష్టాలు లేని ప్రాతిపదికమీద పాల ప్రాజెక్టు నడిపించి తద్వారా రైతులకు సహాయపడడానికి ప్రభుత్వం కృషిచేస్తున్నది. 1972 ఏప్రియల్ నుంచి పాల ఉత్పత్తిదారులకు లీటరు ఒకటికి పది పైసలు ఎక్కువగా చెల్లించబడుతుంది. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని పాల అధికోత్పత్తికి కృషిచేయాలని మంత్రి ఉద్బోధించారు.

లోకసభ సభ్యులు శ్రీ కె. రఘురామయ్య ఈ మహాసభకు ప్రారంభోత్సవం జరుపుతూ గుంటూరులో సుమారు 4 లక్షల గేదెలున్నాయని, గుంటూరులో పాలపొడి ఫ్యాక్టరీని ఏర్పాటు చేయడం సముచితంగా వుంటుందని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

అసిస్టెంటు పాల కమీషనరు శ్రీ వి. నారాయణరావు ప్రసంగిస్తూ కర్నూలు జిల్లాలో ముర్రెజాతి గేదెల కొరకు ఒక పరిశోధనా కేంద్రాన్ని నెలకొల్పడానికి భారత ప్రభుత్వం ఒక పథకాన్ని మంజూరు చేసిందని తెలిపారు.

శాసన సభ్యులు శ్రీ యస్. వెంకటావు ప్రసంగిస్తూ, పాల కేంద్రం అధికారులు అదనంగా సరఫరా అవుతున్న పాలను కొనకపోవడంవల్ల ఉత్పత్తిదారులు ఆర్థిక ఇబ్బందులకు లోనవు



జాతీయ పొదుపు [illegible] కేంద్ర సలహా [illegible] ప్రాతినిధ్య [illegible] కుమారి [illegible] జిల్లా కలెక్టరు శ్రీ [illegible] ఫిబ్రవరి 8 న జిల్లా పరిషత్తు [illegible] 1 లక్షకు చెక్కును [illegible] అందజేస్తున్న దృశ్యం

తున్నారని చెప్పారు. రైతుల వద్దనుంచి అదనపు పాలను కొనడానికి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని శాసనసభ్యులు శ్రీ ఏ. రామిరెడ్డి సూచించారు.

## శ్రీకాకుళంలో టెలిగ్రాఫ్ కార్యాలయానికి ప్రారంభోత్సవం

టెలిగ్రాఫ్ శాఖ డైరక్టరు శ్రీ శామామెయా ఫిబ్రవరి 17 వ తేదీన శ్రీకాకుళంలో డిపార్టుమెంటల్ టెలిగ్రాఫ్ కార్యాలయానికి ప్రారంభోత్సవం చేస్తూ రాష్ట్రంలో శ్రీకాకుళం బ్రాంచి 25 వ డిపార్టుమెంటల్ టెలిగ్రాఫ్ కార్యాలయమని అన్నారు.

ఈ సభకు అధ్యక్షత వహించిన శ్రీకాకుళం జిల్లా కలెక్టరు శ్రీ కె. పురుషోత్తమ నాయుడు ప్రసంగిస్తూ వెనకబడిన కోస్తా ప్రాంతంలోను గిరిజన ప్రాంతాలలోను టెలిగ్రాఫ్ సౌకర్యాలను విస్తరింప చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సూదుర ప్రాంతాలతో సంబంధాలు ఏర్పరుచుకోడానికి టెలిగ్రాఫ్ కమ్యూనికేషన్ చౌకదని ఆయన వర్ణించారు. ప్రజల సౌకర్యార్థం టెలిగ్రాఫ్ కార్యాలయం పనివేళను పెంచాలని ఆయన టెలిగ్రాఫ్ డైరెక్టరును కోరారు.

## జాతీయ పొదుపు ఉద్యమం

జాతీయ పొదుపు ఉద్యమం కేంద్ర సలహా మండలి సభ్యురాలు శ్రీమతి జ్ఞానకుమారి హెడా, ఫిబ్రవరి 16 న కరీం నగర్ లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ప్రసంగిస్తూ జిల్లాకు నిర్దేశించిన రూ 20 లక్షల సేకరణ లక్ష్యాన్ని సాధించడానికి తమ పూర్తి సహాయ సహకారాలను అందచేయాలని సభ్యులకు విజ్ఞప్తి చేశారు. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది నిమిత్తం క్యుములేటివ్ టైమ్ డిపాజిటు అకౌంట్లను, విద్యార్థుల నిమిత్తం హుండీ డబ్బాలను ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు.

ఈ ప్రాంతంలో జాతీయ పొదుపు నిమిత్తం సేకరించిన రూ. 55,000/ లు రూ. 6210/–లు చెక్కులను సిరిసిల్ల, వేములవాడబ్లాకు అభివృద్ధి అధికారులు ముఖ్య అతిథికి సమర్పించారు.

జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ పి. శ్రీనివాసరావు జాతీయ పొదుపు నిధికి 4,930/-ల చెక్కును సమర్పించారు.

జిల్లా కలెక్టరు శ్రీ ఎస్. పి. సుబ్రహ్మణ్యం ప్రసంగిస్తూ జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని నేరవేర్చడం జరుగుతుందని ముఖ్య అతిథికి హామీయిచ్చారు.


## జర్నలిస్టుల నాగార్జున సాగర్ పర్యటన

పత్రికా సంపాదకత్వపునశ్చరణ తరగతులలో పాల్గొంటున్న భారత దేశంలో 8 రాష్ట్రాలకు చెందిన 14 మంది జర్నలిస్టులు, ఇద్దరు చొప్పున ఇండోనీషియా మలయేషియా దేశాలకు చెందిన నలుగురు జర్నలిస్టులు, కార్డిఫ్‌లోని (యు కె.) ఎడిటోరియల్ స్టడీస్ ఆఫ్ ఫౌండేషన్ డిప్యూటీ డైరక్టరు, చర్చాగోష్ఠి నాయకుల ప్రిన్సిపాల్, శ్రీ నార్మన్ కట్లానాచ్, శ్రీడోనాల్డ్ వింటర్స్‌గిల్ (బ్రిటన్‌లో దిగార్డియన్ సీనియర్ సబ్‌ఎడిటర్) వెస్టర్న్ మైమ్స్, డిప్యూటీ, ఎడిటర్, భారత ప్రెస్ సంస్థ సలహాదారు శ్రీ కె. భూపాల్, ఫిబ్రవరి 5 6 తేదీలలో నాగార్జునసాగర్, నాగార్జునకొండలను సందర్శించారు.

నాగార్జునసాగర్ డామ్ కట్టడాలను చూచి వారెంతో ముగ్ధులవుతూ, భారత దేశం సాధించిన అపూర్వమైన యీ ప్రగతి మనస్సులో ఎల్లప్పుడూ మసలుతుంటుందనీ, పవిత్రమైన కృష్ణానది యుగయుగాల వరకు సౌభాగ్యాన్ని చేకూర్చుతుందనీ అన్నారు.

భారత ప్రెస్ సంస్థ, థామ్సన్ ఫౌండేషన్ సంస్థ (యు.కె.) వారు ఐదు వారల పాటు నిర్వహిస్తున్న పునశ్చరణ తరగతులు జనవరి 10వ తేదీ నుండి ప్రారంభమైనాయి.

సమాచార, పౌరసంబంధ, యాత్రికశాఖ యీపర్యటనను ఏర్పాటు చేసింది.



ప్రకాశం జిల్లా కలెక్టరు సతీమణి శ్రీమతి కె. విమలాబాయి చంద్రయ్య జనవరి 2వ తేదీన మద్దిపాడులో కుటుంబ నియంత్రణ కేంద్రానికి శంఖుస్థాపన చేసినప్పటి దృశ్యం

### ఈ సంచికలోని రచయితలు

శ్రీ రావూరు వెంకట సత్యనారాయణరావు, గాంధీనగర్, విజయవాడ
శ్రీ సి.వి. సుబ్బన్న శతావధాని, ప్రొద్దుటూరు
శ్రీ కల్యాణ సింగ్, బాగాగల్లీ, హైదరాబాదు
శ్రీ ఎల్. మాలకొండయ్య, తూర్పుగోదావరి జిల్లా కలెక్టరు, కాకినాడ
శ్రీ సి.వి. నరసింహారెడ్డి, రాష్ట్ర సమాచారశాఖ, హైదరాబాదు
శ్రీ తిరుమల రామచంద్ర, ఆంధ్ర ప్రభ, హైదరాబాదు
శ్రీ గునుపాటి భోగీశ్వరం, కోట, నెల్లూరు జిల్లా
శ్రీ చేకూరి చెన్నకృష్ణయ్య, హైదరాబాదు
శ్రీ పణతుల నరసింహయ్య, చిత్తూరు
శ్రీ కొసనం మహేశ్వరరావు, హిందీనగర్, హైదరాబాదు
శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, రాష్ట్రసమాచారశాఖ, హైదరాబాదు
శ్రీ సి. రాజగోపాలనాయుడు, ఎం. ఎల్. సి. చిత్తూరు
శ్రీ ముదిగొండ వీరభద్రమూర్తి, హైదరాబాదు
కే.శే. కొమర్రాజు లక్ష్మణరావు
శ్రీ రావుల శ్రీరామచంద్రమూర్తి, నరేంద్రపురం తూ. గో. జిల్లా

# గ్రంథ సమీక్ష

## సాహిత్య వివేచన

రచయిత్ర: డా॥కోవెల సుప్రసన్నాచార్యులు.

వెల:—నాలుగు రూపాయలు.

ప్రాప్తిస్థానం:—ఆంధ్రసారస్వతపరిషత్తు, బొగ్గులకుంట, హైదరాబాదు. వేంకటరామ అండ్ కో. వరంగల్

డాక్టర్ సుప్రసన్నాచార్యులు సాహితీ బంధు బృందం ఈ పుస్తకం ప్రకాశకీయంలో అన్నట్లు "ఆధునిక తెలుగు సాహిత్యంలో లబ్ధ ప్రతిష్ఠులు". వారు వ్రాసిన అనేక వ్యాసాల్లో ఎనిమిదింటి సంపుటి ఇది.

మొదటి వ్యాసమయిన "వచన పద్యము : రూపము–పరిణామము"లో ఆచార్యులు వచనపద్య పరిణామం, ప్రయోజనం వివరించి; భావం, అభివ్యక్తి రెండూ కవిత్వమేనని నిర్వచించి, వచన పద్యం భవిష్యత్తును కొంత ఊహించారు. కవితకు స్థానం తగ్గి బౌద్ధిక స్థితి ఎక్కువకావడంవల్ల కేవల లయానుబంధంతో జీవిస్తూఉన్న కవితారూపం క్రమంగా వచనమే అయినట్లు వచన కవిత క్రమంగా పూర్వఛందోమార్గాన జీర్ణములైన సీస పద్యముల వలె నిలిచిపోవచ్చునని, లేక సంగీత వాసనాబంధురమైన ఛందోరీతిఅయి, మళ్లీ అనుభూతి ఆవరించడమూ, సంగీతం నిలబడడమూ ఒకేసారి జరుగవచ్చునని అన్నారు.

"స్వాతంత్ర్యం తరువాత ప్రగతివాద కవిత" అనేది రెండవ వ్యాసం దీనిలో అభ్యుదయ కవితా చరిత్ర, పరిణామం, ఉద్యమోపజీవులైన కవుల, వారి కవితల ఉల్లేఖనం ఉన్నాయి.

మూడవదైన "పౌరపాటీ తిరుగుబాటు" అనే వ్యాసంలో శ్రీ ఆబ్బూరి రామకృష్ణరావు "అనామిక" అనేకవితలోని విశేషాల విశ్లేషణ ఉంది. "రాష్ట్రానికీ దేశానికీ, ఇంకా ఇలాంటి పరిధులకు అతీతముగా, మానవత్వాన్ని స్వచ్ఛంగా భావించిన తెలుగు కవులలో అబ్బూరి నిజంగా గణనీయులు" అని నిర్ణయించారు.

"నవ కవిత–తత్త్వ దర్శనము" అనే నాల్గవ వ్యాసంలోజాతీయ జీవనంలో కొనసాగుతూవున్న పునరుజ్జీవన పరిణామ వివరణ, ఆంతర వైయక్తిక ప్రేరణ; బాహిర సామాజిక ప్రేరణ ఈ రెండూ తొలిసారిగా ఆవిష్కారం పొందిన దాశరథి, నారాయణరెడ్డి, పుట్టపర్తి, ఆరుద్ర, కుందుర్తి, బా. గంగాధర తిలక్, సోమసుందర్, బైరాగి మొదలయినవారి కవితా తత్త్వ విచారం ఉన్నాయి.

ఐదవ వ్యాసం "నేటి కవిత–అభివ్యక్తి", దీనిలో నవకవులు కవితాభివ్యక్తీకరణలో చేసిన ప్రయోగాలు తరచబడ్డాయి. వారు ప్రయత్న పూర్వకంగా చేసిన జ్వరం, వేగిరం, నేన్నుంచొన్న, ఎగడ్తారు వంటి ప్రయోగాల చర్చఉంది (దీనిలో మేధస్సుచేరలేదు).

ఆరవ వ్యాసం "నగరంలో వాన–రెండు గీతాలు" అభ్యుదయ కవిత్వం ఆరంభదినాల్లో 'నయాగరా' అనే కవితా సంపుటితో వెలు[illegible] వచ్చి 'వచన కవిత' అన్న రూపాన్ని [illegible] ఘనత సంపాదించిన శ్రీ కుందుర్తి ఆంజనేయులుగారి "నగరంలో వాన–రెండు గీతాలు" అన్న [illegible]. దీనిలో శ్రీ కుందుర్తి [illegible] విచారం. [illegible] బడ్డాయి.


"ఆధునిక కవిత–అంతర్ముఖీనత" అనేది [illegible] నిక కవిత అంటే, [illegible] నుండి నివృత్తి వైపుగా ప్రయాణించే [illegible] అంతర్గతంగా పొదుపుకున్న కవిత" అని [illegible] తెన అనుభూతులను [illegible] పోయే కవి అంతర్ముఖీనుడవుతున్నాడని చెప్పటం [illegible] ధీనతవల్ల తన అనుభూతిని యథాతథంగా చెప్ప [illegible], దానికోసం విశిష్టమైన [illegible] కారణంగా ఈ కవిత మేధాసంబంధి అయిపోయి" [illegible] సాధారణం కాని విజ్ఞానావగాహన [illegible] పాఠకుడికి కవిత [illegible] దురవగాహన అనే [illegible] అని చెప్పడం, ఈ వ్యాసంలో ఉన్నాయి.

ఎనిమిదవవ్యాసం "ఎవడు సహృదయుడు?" అనేది. దీనిలో "కావ్యానుశీలనంచేత ఎవరి మనస్సు విశదంగా అద్దంలాగ ఏర్పడుతుందో, అందువల్ల కవి వర్ణించే వస్తువుతో తన్మయీభవన యోగ్యత కలుగుతుందో వారు సహృదయులు. సహృదయుడైన పాఠకుడికి మూడులక్షణాలు ముఖ్యం. భావుకత, నిరంతర కావ్యానుశీలనం, ఆస్వాదోన్ముఖత–ఈ మూడు ప్రతిభామూలమైనటువంటివి" అన్నదానితో వ్యాఖ్యానించింది ఈ వ్యాసం.


రేఖామాత్రంగా ఈ గ్రంథంలోని వ్యాసాలవస్తువివి. వీగిరి రచియించిరేని సమకాలమువారలు మెచ్చరేకదా! అని చేమకూర వేంకటకవి ప్రకరణాంతరంలో అన్నది మన విమర్శసాహిత్యానికి నిరంతరం వర్తిస్తుందని నేను అనుకుంటూఉంటాను. అసహనపరాకాష్ఠచూచి విమర్శను–గుణదోష విచారమాత్రమను–సహించే గుణమే అలవడనప్పుడు, నిర్మలమైన అంతఃకరణం చెదరని ఇంద్రియాలూ ఉన్న పాఠకుడు తాను చదువబోయే కావ్యాన్ని అందుకోదగినంత వ్యుత్పన్నతను పెంచుకుంటూ, అందులోని కవి చాతుర్యాన్ని గ్రహిస్తూ, కావ్యపరమార్థాన్ని మనస్సు లోతుల్లో సాక్షాత్కరించుకోవలసివుంటుంది" (పుట–137)అన్న స్థితి ఎప్పుడో ఏమైనా శ్రీ సుప్రసన్నాచార్యులు తాము ఎలుగెత్తి చాటిన సహృదయతకు అనుగుణంగా, పక్షపాతరాహిత్యంతో, నిష్పక్షదృష్టితో, సమ్యగ్విమర్శ పరాయణతతో వచన కవితాతత్త్వం, తదభివ్యక్తీకరణ వైవిధ్యం, భాషాచ్ఛందః ప్రయోగసరళి, ఆధునిక కావ్యపరమార్థస్వరూప నిరూపణము అనే నాలుగు విషయాలను ఈ గ్రంథంలో విపులంగా సఫలంగా నిరూపించారు సమగ్రమైన పరాయణత గలవారు గనుకనే, కవితాపరిణామానికి పరాకాష్ఠ వచన కవిత్వమనే ప్రతినివిష్టవాదాలుచేయక "వచన కవితోద్యమం అంతకే కవిత్వానికి చేరదగిన చివరి మజిలీకాదు, ఇంకో ఉద్యమం











రావచ్చు. దానికి మనం హృదయపూర్వకంగా స్వాగతం చెప్ప గలిగితే అదిచాలు." (పుట 1°) అన్నారు శ్రీ సుప్రసన్నా చార్యుల ఉదారత, దూరదృష్టి ప్రశంసనీయాలు.

కాని నవ నవోన్మేషదృష్టి దేశ సిద్ధాంతాల్ని అన్నిరంగాల లోను అన్వయించే ప్రయత్నం భాషాసాహిత్యాలలోను సంగ్రహం చడం వల్ల కవితాపరిణామచరిత్ర గ్రంథంలో శ్రీ సుప్రసన్నా చార్యుల స్వసిద్ధాంతాను గుణనిర్వచనాయి ఏకాంగి సంగ్రహించే అవ కాశాలు ఉన్నాయి.

వారు కావ్యాభివ్యక్తిని చర్చిస్తూ. ప్రాచీన కావ్యాలలో మానవుని వైయక్తిక జీవనం ఇతివృత్తంకాగా, ఆధునిక కావ్యం సమాజ చైతన్యసామూహికాభివ్యక్తిగా రూపొందుతుందని ఊహించ వీలు న్నది, (పుట—19) అని నిర్వచించారు. దీనికి అపవాదంగా మన రామాయణభారతాలనే కాక గాథా సప్తశతివంటి సంకల నాలను, వారుచ త్తాపికాదిక, మృచ్ఛకటికాదులను ఉదాహరించ వచ్చు. వీటిలో వైయక్తిక జీవిత నిమిత్త మాత్రమైన సమష్టి చైతన్యాభివ్యక్తి హెచ్చని గట్టిగా చెప్పగలం.

"అయిన వారిని అంగలమెక్కించటం" అన్న సామెతగా సుప్రసన్నాచార్యులు కొందరి విషయంలో వ్రాశారు. అవిచ్ఛిన్న మయిన తెలుగు కవితాసంప్రదాయాన్ని పరిపాలిస్తూ విశ్వనాథ ఈ యుగంలో తన రామాయణ కల్పవృక్షంద్వారా ప్రతీయాత్మ ప్రస్థానం చేసినాడు. భారతీయసాహిత్యాకాశన శ్రీ అరవిందుల సావిత్రి అవతరణం ఎలాంటి మహత్తర సన్నివేశమో విశ్వనాథ రామాయణావతారంకూడా అంతటి మహత్తరమయినదే. ఈ రెండూ స్వాతంత్ర్యోత్తరకాలాన భారతీయ కవితా జగత్తులో ఆవిర్భవించిన మహాకావ్యాలే సర్వచైతన్య భౌతిక జగత్తులో ఆవిష్కారం పొందడమే ఈ రెండింటిలోనూ నిరూపితమైన తత్త్వం. రెండూ సాహిత్యతేజశ్శిఖరాలు." [పుట—57] అన్నారు రచయిత. శ్రీ విశ్వనాథవారు మహాకవి అనడంలోను, తెలుగు కవితాసంప్రదాయాన్ని పరిపాలిస్తున్నారనడంలోను ఎవరికీ విప్రతిపత్తి లేదు. కాని, అరవిందుల సావిత్రితో రామాయణ కల్పవృక్షాన్ని పోల్చడంలోనే కొంత విప్రతిపత్తి. సావిత్రి అధిమానస చైతన్యావతరణోపన్యాసను దర్శింపజేసేది. ఋగ్వేద ఋషులు దర్శించిన దివ్యచైతన్యానికి విజ్ఞానమయ వ్యాఖ్యవంటి దది. దానిలో మానవకల్పితాలయిన విభేదాలకు తావులేదు. అది అక్షరాంతర తత్త్వమని వేత్తలు అంటున్నారు. కవితా రామణీయకంలోను అది ఋగ్వేదరామాయణాది ప్రపంచసాహిత్య నవనీతాతిశాయి అంటు న్నారు. రచయిత మరొకమారు సావిత్రిని పఠింతురుగాక.

"సంప్రదాయాన్ని ఆశ్రయించిన కవులు ఈయన [శ్రీ విశ్వనాథ] మార్గాన్ని ఆశ్రయించి ముందుకుపోయినారు. తుమ్మల ఆత్మకథ మహాత్మకథయు, మధునాపంతుల—ఆంధ్రపురాణము, వాన మామలై వరదాచార్యుల పోతనచరిత్రము—ఇవన్నీ ఈ త్రోవలో వెలుబడ్డ శిఖరాలవంటి కావ్యాలు. [పుట—57] అని మరొక వ్యాఖ్య.

పై వాక్యాలలో "తెలుగు సంప్రదాయాన్ని ఆశ్రయించి" నప్పుంతవరకు బాగుంది. కానితక్కిన మాటలు న్యాయ మయినవి కావు. తెలుగు కవుల [illegible] చెప్పగల వైదుష్యము [illegible] పోలిసను చెప్పినను. కాని శ్రీవిశ్వనాథ గారి దారి. ప్రాచీన తెలుగు కవితా రంగంలో ప్రసక్తికలుకు ఒకమెట్టు గట్టిగా ఉన్నాయి. వారిని అనుసరించే వారిని [illegible] జున్నులు కోకొల్లలు. తెలుగు భాష జిగిబిగులు నిగ్గుతేలినవై సాగిన వారి కావ్యాలను 'ఒయసి' మార్గం అను [illegible] న్యాయంకాదు.

"భారతీయసాహిత్యం లభిస్తుంది అప్పుడే స్పష్టమయింది: సర్వజీవులనూ ఆత్మవత్తుగా భావించేది." [పుట—115] అంటూ రచయిత వ్రాసుకుపోయారు. భారతీయ తత్త్వంవేదాంతమే అది కాబోలు రచయిత వ్రాసింది: ఆ అద్వైత తత్త్వం మనదే కాదాచి కాదు, ప్రతి మతమూ ప్రకారాంతరంగా చెప్పేది ఇదే. అదే నేడు విద్యమానమయితే సంస్కృతులు, ఆచార్యులు, భక్తుల అవత రించడం. తమ ప్రతిభానుకూల వ్యాఖ్యలు చేయడం జరిగేది కాదు. గాంధీజీ వంటి వారూ, [illegible] చేయవలసిన అవసరం లేదుగదా కాని ప్రసిద్ధులకా నాటి చేసిన కారు. ప్రాచీన సంప్ర దాయమును [illegible], [illegible] మధ్య కాలాగతాలూ అయిన పద్ధతులను సమర్థించే సాహిత్యము పైకి ఎంత సమతా వున్నట్లు కనిపించినా, అంతరంగా అద్వైత భావవ్యాఘాతకమే.

రచయిత చివరి వ్యాసంలో ఆ ప్రసక్తంగా పండితులను ఆక్షేపించినట్లు నేను భావిస్తున్నాను. ప్రాచీనాలంకారికులు రసము కావడంతో కావ్యాలను కొలిచినా, రసానుభూతిలో కులగోత్రాలు చూడలేదు. అలా చూసినప్పుడే,

ఆహో ప్రభావో వాగ్దేవ్యాః
యన్మాతంగ దివాకరః
శ్రీహర్షస్యాభవత్సభ్యః
సమో బాణమయూరయోః

అని రాజశేఖరుడు ఆశ్చర్యపడి వుండడు. ఇప్పటి విమర్శలు ఎన్ని అనులోమ ప్రతిలోమ గణితాలతో జరుగుతున్నదీ మన కందరికీ తెలుసు. ప్రాచీనాలంకారికులు ఇతివృత్త ప్రాధాన్యంతో మాత్రమే, చూచారు; ఒక్కనవి రసాస్వాదనకు అంతిమేమి కలిగించవని మాత్రమే అన్నారు; రసాన్ని బ్రహ్మగా భావించారుగనుక, గాథాసప్త శతివంటి ముక్తకగుచ్ఛాన్ని కూడా విచ్చలవిడిగా తమ లక్షణాలకు లక్ష్యాలుగా ఉదాహరించారు

శ్రీసుప్రసన్నాచార్యులుగారు ప్రాచీనులపై కొంచం కన్నెఱ్ఱ చేసినా యిష్టులపై కొంచెం చేయి విదలించినా, తద్భిన్నులపై చేయి బిగిపట్టినా సమకాలి కాధునికుల కవితా పరిణామ కథన వివేచనాధులలో సవ్యమార్గాన్నే అనుసరించారని, వచన కవితాగతిని తెలుసుకొనడానికి ఈ "సాహిత్యవివేచన" ఉపాదేయమని చెప్పడంలో అనౌచిత్యమేమీకనిపించదు. స్వతః సుప్రసన్నులయిన ఆచార్యులుగారు అభిప్రాయభేదాలను సుప్రసన్నతతో స్వీకరిస్తారని ఆశిస్తున్నాను.

— తిరుమల రామచంద్ర.

## Statement About Ownership And Other Particulars About

## "ANDHRA PRADESH"

FORM-IV

(*See Rule* 8)

| | | |
|---|---|---|
| Place of Publication | : | Hyderabad. |
| Periodicity of Publication | : | Monthly. |
| Printer's Name | : | Director, Government Printing. |
| Nationality | : | **Indian.** |
| Address | : | Chanchalguda, Hyderabad-24. |
| Publisher's Name | : | P. Vaman Rao. |
| Nationality | : | Indian. |
| Address | : | Director, Department of Information, Public Relations and Tourism, Hyderabad, A.P. |
| Chief Editor's Name | : | P. Vaman Rao. |
| Nationality | : | Indian. |
| Address | : | Director, Department of Information, Public Relations and Tourism, Hyderabad, A.P. |
| Name and address of individuals who own the Newspaper and partners or share-holders holding more than one per cent of the total capital. | | Nil. |

I P. Vaman Rao, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

1-3-1972.
Hyderabad,

(Sd.) P. VAMAN RAO,
*Signature of the Publisher.*

PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION, PUBLIC RELATIONS & TOURISIM ANDHRA PRADESH, HYDERABAD
PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVT. OF ANDHRA PRADESH, AT THE GOVT. CENTRAL PRESS HYDERABAD